

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

19 వ వసంతంలోకి ...

ఉత్తరాంధ్ర

విశాఖపట్నం, శ్రీకాకుళం విజయనగరం

బుధవారం 18-02-2026 పేజీలు: 22


# ఫ్లీట్ రివ్యూతో విశాఖకు సమర శోభ



- యుద్ధ విన్యాసాలకు సన్నద్ధమైన తీరం
- నేడే ఫ్లీట్ రివ్యూ ప్రధాన వేడుక
- కనువిందు చేయనున్న 71 యుద్ధ నౌకలు, 21 విదేశీ నౌకలు
- రేపు ప్రధాన మూడు కార్యక్రమాలు
- నగరానికి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సీఎం చంద్రబాబు
- భద్రత కట్టుదిట్టం

2వ పేజీలో

# విశాఖ టీడీపీలో శ్రీభరత్ దేనా హవా?

- కూటమి ఎమ్మెల్యేల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తి! - తమ వ్యవహారాల్లో ఎంపీ జోక్యంపై గుర్రు - ఏసీపీ వివేకానంద బదిలీలోనూ.. - గంటాలోనూ అసంతృప్తి ఉందా? - మింగుడు పడని కూటమి ఎమ్మెల్యేలు..



3 పేజీలో

# మునపర్తి చెరువులో మట్టి దోపిడీ

- యంత్రాల సహాయంతో చెరువులో భారీ గుంతలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- పర్యావరణాన్ని కాపాడాలని స్థానికుల ఆవేదన



4 లో

# అభివృద్ధి పేరుతో రైతులను మోసగిస్తారా..?



5వ పేజీలో

# విశాఖ కీర్తిని తెలియజేయండి



- పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించండి - ఐఎఫ్ఆర్ ప్రాంతాల్లో పరిశుభ్రతా పనులను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్

3వ పేజీలో

# వార్నింగ్ లెటర్స్‌ను ఉపసంహరించుకోవాలి



3వ పేజీలో

# ఫ్లీట్ రివ్యూతో విశాఖలో సమర శోభ..

- యుద్ధ విన్యాసాలకు సన్నద్ధమైన విశాఖ తీరం
- నేడే ఫ్లీట్ రివ్యూ ప్రధాన వేడుక
- అరుదైన నౌకాదళ ప్రదర్శన
- కనువిందు చేయనున్న భారీ నౌకాదళ విన్యాసాలు
- పాల్గొననున్న 71 యుద్ధ నౌకలు
- 23 విదేశీ నౌకలు
- కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు
- 19న మూడు ముఖ్య కార్యక్రమాలు
- నగరానికి చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము,ముఖ్యమంత్రి చంద్రబాబు..
- రాష్ట్రపతి రాకతో తీరంలో భద్రత కట్టుదిట్టం











**(క్రైం బ్యూరో : మేజర్ న్యూస్)**

ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ పేరుతో సముద్ర తీరంలో 'శాంతి' గర్జన వినిపించేందుకు భారత్ సమాయత్తమైంది. కేవలం ఐఎఫ్ఆర్ మాత్రమే కాకుండా.. ఐఓఎన్ఎస్ సదస్సు, మిలాన్ యుద్ధ విన్యాసాల సన్నద్ధానికి సై అంటూ విశాఖ తీరం సిద్ధమైంది.విశాఖ వేదికగా 15 నుండి 25 వరకు జరగనున్న అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సమీక్షించనున్న ఈ అరుదైన నౌకాదళ ప్రదర్శనలో 71 యుద్ధనౌకలు, విమాన వాహక నౌక విక్రాంత్, అణు జలాంతర్గాములు పాల్గొననున్నాయి. బీచ్ రోడ్‌లో సందర్శకుల కోసం ప్రత్యేక గ్యాలరీలు, ఎల్ ఈ డి స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఐ ఎఫ్ ఆర్ 2026తో పాటు మాలాబార్ ఎక్సర్‌సైజ్ మిలన్ 26, ఇండియన్ ఓషన్ నావల్ సింపోజియం సదస్సులు కూడా విశాఖలోనే జరగనున్నాయి. ఐఎన్ఎస్ విక్రాంత్, దిల్లీ, విశాఖ, రాజ్‌పుత్, నీలగిరి, శివాలిక్, తల్వార్ తరగతి యుద్ధనౌకలతో పాటు, వివిధ దేశాలకు చెందిన 23 యుద్ధనౌకలు ఇందులో పాల్గొంటున్నాయి. బీచ్ రోడ్‌లో 1,000 మంది కూర్చునేలా ప్రత్యేక ఎన్‌క్లోజర్లు, ప్రదర్శన వీక్షించడానికి ఎల్ ఈ డి తెరలు, భద్రతా చర్యలు చేపట్టారు. పదేళ్ల తర్వాత మళ్లీ విశాఖలో ఈ భారీ నౌకాదళ విన్యాసాలు జరుగుతున్నాయి. నౌకాదళ శక్తి సామర్థ్యాలను ప్రదర్శించే ఈ అద్భుతమైన ఈవెంట్ కోసం సన్‌రైజ్ ఫ్లీట్ (తూర్పు నౌకాదళం) సిద్ధమైంది. ఈ సందర్భంగా సాగర తీరంలో నిర్వహిస్తున్న సన్నాహక కార్యక్రమాలు , వీరోచిత విన్యాసాలు.. నడిస ముద్రంలో ఒళ్ళు గగుర్పొడిచే యుద్ధ సంరంభాలు.. వార్ జోన్లో అడుగు పెట్టిన గంభీర వాతావ రణం.. ప్రజలను సంబరమాశ్చర్యాలకు గురిచేస్తున్నాయి. ఇండో పసిఫిక్ ప్రాంతంపై పట్టు పెంచుకోవడమే లక్ష్యంగా భారత నావికాదళంతో పాటు స్నేహపూర్వక దేశాలు ఒకే చోట చేరి తమ సన్నద్ధతను ప్రద ర్శించనున్నాయి. రక్షణ రంగ శక్తి సామర్థ్యాలను చాటి చెప్పడం ఐ ఎఫ్ ఆర్ లో ప్రధానంకాగా, త్రివిధ దళపతి హోదాలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఫ్లీట్ రివ్యూ చేయ నున్నారు. మిలన్,ఐ ఎఫ్ ఆర్, ఇండియన్ నేషనల్ ఓషన్ కాన్ క్లేవ్ ఒకేసారి జరుగుతున్న తరుణం లో విస్తృతమైన ఏర్పాట్లు జరిగాయి. ఈ కార్యక్రమంలో వివిధ స్నేహపూర్వక దేశాలకు చెందిన నౌకలతో పాటు జలాంతర్గాము లు, నేవల్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫ్లైపాస్ విన్యాసాలు చేస్తాయి. సెయిలింగ్ వెసెల్స్ పరేడ్, హెలికాప్టర్ల ద్వారా సెర్చ్ అండ్ రెస్క్యూ , మెరైన్ కమాండోల ప్రదర్శన జరగను న్నాయి. ఈనెల 18న ప్రధాన వేడుకలో త్రివిధ దళపతి హోదా లో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము నౌకాదళ పాటవాల్ని సమీక్షించనున్నారు. 19వ తేదీ అత్యంత కీలకం కాగా ఒకే రోజు మూడు ముఖ్యకార్య క్రమాలు జరగనున్నాయి. ఇంటర్నేషనల్ సిటీ పెరేడ్.. భారత నావల్ ఎయిర్‌క్రాఫ్ట్, హెలికాప్టర్ల వైమానిక శక్తి ప్రదర్శనతో సిటీ పరేడ్ ప్రారంభం కానుంది. త్రివిధ దళాలు, కోస్ట్‌గార్డ్ మార్చింగ్ కంటింజెంట్‌లు, మిలిటరీ బ్యాండ్‌లతో పాటు విదేశీ దళాలు వారి సెరిమోనియల్ బ్యాండ్‌లతో అలరించనున్నాయి. కవాతులో యువత స్ఫూర్తిని ప్రతిబింబించే ఎన్‌సీసీ, సీసీసీ పరేడ్ కూడా ఉంటుంది. సైనిక వేడుక, సంస్కృతి, కళల సామరస్య కలయికతో సముద్ర వారసత్వం, వైవిధ్యాన్ని ప్రతిబింబించే కళాత్మక శకటాల ప్రదర్శన ఉంటుంది. ఆర్‌కేబీచ్ తీరంలో లంగరు వేసిన నౌకల విద్యుత్ దీపాలంకరణ ప్రదర్శనతో సిటీ పరేడ్ ముగియనుంది. అనంతరం బాణసంచా, లేజర్ లైట్లు, డ్రోన్ ప్రదర్శన నిర్వహిస్తారు. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలు అన్నింటిలోనూ ఇప్పుడు జరుగుతున్నదే అతిపెద్దదని ఇండియన్ నేవీ వర్గాలు చెబుతున్నాయి. ఐ ఎఫ్ ఆర్ సహా మూడు ప్రతిష్టాత్మక వేడుకలు ఒకేసారి జరుగుతుండగా రాష్ట్రపతి, గవర్నర్, రక్షణ మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం పాటు వివిధ రంగాల ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. దీంతో భద్రతతో పాటు ఐ ఎఫ్ ఆర్ జరిగే బీచ్ రోడ్డులో అనేక ఆంక్షలు అమలులోకి వచ్చాయి. పార్క్ హోటల్ నుంచి నేవల్ కోస్టల్ బ్యాటరీ వరకు మూడు రోజుల పాటు సముద్రం వైపు ఉన్న సగం రోడ్డు నేవీ పరేడ్ కోసం కేటాయిం చారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత వాహనాలను డైవర్ట్ చేస్తున్నందున ప్రజలు సహక రించాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలు తమకు సహకరించాలని ఈ సందర్భంగా పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## - రాష్ట్రపతికి ఘన స్వాగతం..

విశాఖ జిల్లాలో అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ కార్యక్రమాలలో పాల్గొనేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము విశాఖ చేరుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం వాయుమార్గం ద్వారా ఢిల్లీ నుండి భారతీయ వాయుసేనకు చెందిన ప్రత్యేక విమానంలో విశాఖ నేవల్ ఎయిర్ స్టేషన్, ఐ ఎన్ ఎస్ డేగాకు చేరుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము కు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, జిల్లా ఇన్చార్జి మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, పార్లమెంటు సభ్యులు యం.శ్రీ భరత్, మేయర్ పీలా శ్రీనివాస రావు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ, తూర్పు నావికాదళ అధికారులు ఐ ఎన్ ఎస్ డేగాలో ఘన స్వాగతం పలికారు. ప్రధాన కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు మంత్రులు కూడా పాల్గొననున్నారు.

# రైతులందరూ ఫార్మర్ రిజిస్టర్

**- నమోదు చేసుకోవాలి, ఏవో జోష్నా కుమారి**



**మునగపాక, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్:** మండలంలో గల గ్రామాల రైతులందరూ ఫార్మర్ రిజిస్టర్ తప్పనిసరిగా ఆయా గ్రామాల అగ్రికల్చర్ అధికారి వద్దకు వెళ్లి నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిని సిహెచ్ జోష్నా కుమారి తెలిపారు, రాబోయే నెలలో ప్రభుత్వం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, రైతులకు విత్తనాలు, యూరియా, సబ్సిడీపై రైతు యంత్రాలు, మొదలగునవి నమోదు కావాలి అంటే తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్టర్ నమోదు చేయించుకోవాలని, దీనికి అవసరమైన పత్రాలు ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోను, వన్ బి, మరియు పాస్ పుస్తకం, పత్రాలు తీసుకొని గ్రామంలో ఉన్న గ్రామ వ్యవసాయ అధికారులను దగ్గరికి వెళ్లి ఫార్మర్ రిజిస్టర్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిని సిహెచ్ జోష్ణకుమారి తెలిపారు.

# విశాఖ టీడీపీలో శ్రీభరత్ దేనా హవా?

**విశాఖపట్నం, ప్రత్యేక ప్రతినిధి, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** విశాఖ టీడీపీలో ఆధిపత్య పోరు ఊపందుకుంటోంది. విశాఖ ఎంపీ శ్రీభరత్, ఆ పార్టీ ఎమ్మెల్యేల మధ్య అంతర్గతంగా అసంతృప్తి పెల్లుబుకుతోంది. ఎంపీ భరత్ ఆయన సామాజిక వర్గీయులకు, తన వర్గీయులకు పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యేలు లోలోన మదనపడుతున్నారు. పైగా తమ నియోజకవర్గాల్లోనూ ఎంపీ జోక్యంపైనా వీరు మండిపడుతున్నారు. ఇటీవల కాలంలో జరుగుతున్న పరిణామాలపై అంతర్మథనం చెందుతున్నారు. వీరంతా సమయం, సందర్భం కోసం వేచి చూస్తున్నారు. ఎంపీ శ్రీభరత్ ముఖ్యమంత్రి చంద్రబాబు తనయుడు, మంత్రికి స్వయానా తోడల్లుడు. హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణకు అల్లుడు. మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తికి మనవడు. గీతం యూనివర్సిటీ ఛైర్మన్తో పాటు పారిశ్రామికవేత్త కూడా. ఇన్ని హోదాలున్న శ్రీభరత్ విశాఖ ఎంపీగా ఎన్నికయ్యారు. అప్పటివరకు రాజకీయాల్లో ఏమంత పలుకుబడి ఉండేది కాదు. కానీ ఎంపీగా గెలవడం, టీడీపీ అధికారంలోకి రావడం, తోడల్లుడు లోకేష్ మంత్రి కావడం, ఆయన తండ్రి సీఎం అవ్వడం వంటివి శ్రీభరత్కు బాగా కలిసొచ్చాయి. వీటన్నిటి బలంతో శ్రీభరత్ అటు ప్రత్యర్థి (ప్రతిపక్ష) నేతలపైనే కాదు.. సొంత పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలపై కూడా పట్టు సాధిస్తున్నారు. ఇదే ఇప్పుడు టీడీపీ ఎమ్మెల్యేల్లో అసంతృప్తికి, అంతర్మథనానికి కారణమవుతోందని అంటున్నారు. ఈ జాబితాలో గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కూడా ఉన్నారని చెప్పుకుంటున్నారు.

**– మచ్చుకు కొన్ని వ్యవహారాలు..**

కొన్నాళ్ల క్రితం గాజువాక నియోజకవర్గంలో టీడీపీ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీకి చెందిన భూ వ్యవహారంలో ఎంపీ శ్రీభరత్ జోక్యం చేసుకున్నారన్న ప్రచారం ఉంది. తన నియోజకవర్గంలో భూ వివాదంలో గండి బాబ్జీ తలదూర్చడం, ఆ కేసులో బాధ్యులు అరెస్టు కాకుండా ఎంపీ ఒత్తిడి చేయడం వంటివి జరిగాయని అప్పట్లో గుప్పుమంది. సాక్షాత్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడినైన తన ప్రతిష్టకు భంగం కలగడమేనన్న భావనతో పల్లా ఉన్నట్టు తెలుస్తోంది.

**– ఏసీపీ వివేకానంద బదిలీలోనూ..**

శ్రీకాకుళం డీఎస్పీ వివేకానందను ఇటీవల విశాఖ హార్బర్ ఏసీపీగా బదిలీ చేశారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన కొన్ని గంటల్లోనే మళ్లీ వెనక్కి (శ్రీకాకుళానికి) పంపేశారు. ఆయన స్థానంలో ఏసీపీగా చిట్టిబాబును నియమించారు. ఈ వ్యవహారం ఇటు రాజకీయ వర్గాల్లోనూ, అటు పోలీసు వర్గాల్లో పెను సంచలనంగా మారింది. కేవలం గంటల వ్యవధిలోనే ఒక ఏసీపీని బదిలీ చేయాల్సినంత బలమైన కారణం ఏమిటన్న దానిపై చర్చనీయాంశమైంది. తీరా ఆరా తీస్తే వివేకానంద స్థానంలో చిట్టిబాబును ఉన్నఫళంగా తీసుకురావడంలో విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎంపీ శ్రీభరత్ల హస్తం ఉందన్న ప్రచారం బయటకు వచ్చింది. చిట్టిబాబు వీరి సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో కీలకమైన హార్బర్ ఏసీపీ పోస్టులో ఆయన్ను పట్టుబట్టి నియమించుకున్నట్టు చెప్పుకుంటున్నారు.

**– మింగుడు పడని కూటమి ఎమ్మెల్యేలు..**

వివేకానందను శ్రీకాకుళం నుంచి హార్బర్ ఏసీపీగా బదిలీ కావడానికి గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ లు కృషి చేసినట్టు కూటమి పార్టీల్లో ప్రచారం ఉంది. ఇంతలోనే అనూహ్యంగా గంటల వ్యవధిలోనే వివేకానందను మార్చేసి చిట్టిబాబును తెచ్చేసుకోవడం ఈ కూటమి ఎమ్మెల్యేలకు మింగుడు పడలేదు. ఏసీపీల బదిలీ వ్యవహారంలో ఎంపీ శ్రీభరత్ పాత్ర ఉందన్న భావన ఈ ఎమ్మెల్యేల్లో ఉందని తెలుస్తోంది. ఇలా ఎంపీ శ్రీభరత్ వల్ల తమకు ఇబ్బందులు తలెత్తుతున్నా తమకంటే బలవంతుడు కావడంతో ఆయనను నేరుగా ఏమీ అనలేక, ఎదురించే సాహసం చేయలేక సతమతమవుతున్నారు.

**– గంటాలోనూ అసంతృప్తి ఉందా?**

మరోవైపు భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు కూడా ఎంపీ శ్రీభరత్ వ్యవహారశైలిపై అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. తన నియోజకవర్గంలోనూ శ్రీభరత్ వేలు పెడుతున్నారన్న ఆవేదన ఆయనలో ఉందని సమాచారం. రాబోయే ఎన్నికల్లో శ్రీభరత్ భీమిలి నియోజకవర్గం నుంచి పోటీ చేసే యోచనలో ఉన్నందున అక్కడ తరచూ పర్యటిస్తున్నారన్న అనుమానం ఉంది. దీనిపై అప్పట్లో శ్రీభరత్ స్పందిస్తూ ఎంపీగా తాను ఏ నియోజకవర్గంలోనైనా పర్యటిస్తానని వివరణ ఇచ్చారు. ఒకవేళ శ్రీభరత్ భీమిలి నుంచి పోటీ చేస్తే తాను విశాఖ ఎంపీగా పోటీ చేస్తానని కౌంటర్ ఇచ్చారు. ఇలా ఎంపీ శ్రీభరత్ ఒకరిద్దరు ఎమ్మెల్యేలు తప్ప మిగిలిన కూటమి ఎమ్మెల్యేలతో పొసగడం లేదన్న ప్రచారం మాత్రం ఊపందుకుంది.

## వార్నింగ్ లెటర్స్‌ను ఉపసంహరించుకోవాలి

**విశాఖపట్నం, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** విశాఖ స్టీల్ కార్మికుల వార్నింగ్ లెటర్స్ ను యాజమాన్యం ఉపసంహరించుకోవాలని స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యాన్ని హెచ్చరించారు. నేడు స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వార్నింగ్ లెటర్స్ ఉపసంహరించుకోవాలన్న ప్రధాన డిమాండ్ తో స్మృత్యాంజలి పార్కు వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం యాజమాన్యానికి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ స్టీల్ యాజమాన్యం అనైతికంగా స్టీల్ కార్మికుల జీతభత్యాలను ఉత్పత్తి ఆధారంగా చెల్లింపులు కొనసాగించడం అత్యంత దుర్మార్గమని వారు అన్నారు. దీనిని కొనసాగించకూడదని రీజనల్ లేబర్ కమిషనర్, డిపి ఈ చెప్పినప్పటికీ యాజమాన్యం ఆచరించలేదు. నేడు కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా సమ్మెలో 25 కోట్ల మంది కార్మిక వర్గం పాల్గొన్నారు. ఆ సమ్మెకు మద్దతుగా ఉత్పత్తికి ఎటువంటి అంతరాయం కలగకుండా స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు ఈ సమ్మెకు మద్దతు తెలియజేశారు. అటువంటి వారికి నేడు స్టీల్ యాజమాన్యం వార్నింగ్ లెటర్స్ ఇవ్వాలని నిర్ణయించడం అత్యంత దుర్మార్గమని అన్నారు. నేడు యాజమాన్యం ఆర్ ఎల్ సి, డి పి ఈ వారి ఆదేశాలను పాటించకుండా వారు చెప్పారని నేడు వార్నింగ్ లెటర్స్ ఇవ్వడం హాస్యాస్పదమని వారు ఎద్దేవా చేశారు. ఈ సమ్మె ను యాజమాన్యానికి నిర్ణీత కాలవ్యవధిలోనే తెలియజేశామని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. యాజమాన్యం తన మొండి వైఖరిని కొనసాగిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డి ఆదినారాయణ, పి వి రమణమూర్తి, జె అయోధ్యరామ్, దొమ్మేటి అప్పారావు, దాసరి సురేష్ బాబు, యు రామస్వామి, జె రామకృష్ణ, ఎల్ వి రమణ, డొక్కా నర్సింగరావు, పి శ్రీనివాసరాజు, నగేష్ తదితరులతో పాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు మరియు కార్మికులు పాల్గొన్నారు.


ALL UNIONS OF RINL VSP

## గూగుల్ డేటా సెంటర్ భూ నిర్వాసితులకు అండగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



**ఆనందపురం, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** మండలంలోని తర్లువాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 1లో సుమారు 30 ఎకరాల బంజరు భూమిని గత 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న 26 మంది రైతులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భరోసానిచ్చారు. మంగళవారం రైతులు తమ సమస్యపై ఆయనను కలిసి సమస్యలను విన్నవించారు ఆయన సానుకూలంగా స్పందించి. గత 30 సంవత్సరాలుగా నీలగిరి మొక్కలు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్న ఈ భూమిని ప్రభుత్వం గూగుల్ డేటా సెంటర్ ( ఏపీఐఐసీ ) కోసం కేటాయించిన నేపథ్యంలో, రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లు నమోదు కాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు గతంలో రెవెన్యూ అధికారులు నిర్వహించిన సర్వే సమయంలో, సాగులో ఉన్న కొన్ని మొక్కలు వర్షాలు లేక చనిపోవడం వలన మొక్కలు లేవని సాకుగా చూపి, రైతుల పేర్లను నమోదు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులను, స్థానిక నాయకులను కలిసినా ఎటువంటి ఫలితం దక్కలేదు. దీంతో 26 మంది రైతులు కూటమి నాయకులు సమక్షంలో నేరుగా గంటా శ్రీనివాసరావును కలిసి తమ ఆవేదనను చెప్పారు. రైతుల గోడు విన్న ఎమ్మెల్యే, సాగులో ఉన్న ప్రతి రైతు పేరు రికార్డుల్లో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తమ సమస్యపై సానుకూలంగా స్పందించి, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించిన సర్పంచ్ బి.ఆర్.బి నాయుడు, వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, మండల టీడీపీ అధ్యక్షులు తాట్రాజు అప్పారావు, బాలి అప్పలరాజు(బంకురాజు)ల చొరవకు తర్లువాడ గ్రామ రైతులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# విశాఖ కీర్తిని తెలియజేయండి

**- ఐఎఫ్ఆర్ లో రాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి,ప్రపంచ దేశాల ప్రతినిధులు పాల్గొననున్నారు**

**విశాఖపట్నం, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్:** విశాఖ వేదికగా ప్రతిష్టాత్మకమైన ఐ ఎఫ్ ఆర్ 2026 , మిలాన్ ,ఇయాన్స్ కాంక్లేవ్ కార్యక్రమాలు విశాఖ నగరంలో జరుగుతున్నందున ప్రపంచ దేశాల అతిథులను ఆకట్టుకునేలా విశాఖ కీర్తిని తెలియజేసేలా పరిశుభ్రతా పనులు చేపట్టాలని, ఐఎఫ్ఆర్ లో భారత రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి,ప్రపంచ దేశాల అతిథులు, ప్రముఖులు పాల్గొననున్నందున పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని జీవీఎంసీ ప్రజారోగ్య అధికారులను, జోనల్ కమిషనర్లను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. మంగళవారం ఆయన జీవీఎంసీ అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ బి. హేమావతి లతో కలిసి బీచ్ రోడ్లో ఐ ఎఫ్ ఆర్ ప్రాంతాలు, ఐఎన్ఎస్ డేగా, టూరిజం టెర్మినల్,ఈస్టర్న్ నావెల్ కమాండ్ తదితర ప్రాంతాలను పర్యటిస్తూ పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఐఎఫ్ఆర్ జరుగుతున్నందున భారత రాష్ట్రపతి , రాష్ట్ర ముఖ్యమంత్రి ,ఉప ముఖ్యమంత్రి కేంద్ర , రాష్ట్ర మంత్రుల తో పాటు ఎంతోమంది ప్రపంచ దేశాలు అతిథులు, సందర్శకులు, పర్యాటకులు నగరానికి వస్తున్నారని, అందుకు అనుగుణంగా నగర పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్లకు, ప్రజారోగ్య అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా బీచ్ లో , ఐఎఫ్ఆర్ జరుగు ప్రాంతాల్లో వ్యర్థాలు లేకుండా చూడాలని, అలాగే డస్ట్ బిన్ల వద్ద ఓపెన్ ప్రదేశాలలో వ్యర్థాలు కనిపించకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని అధికారులను ఆదేశించారు. ఐఎఫ్ఆర్ ప్రాంతాలలో మధురవాడ, ఈస్ట్, వెస్ట్, సౌత్ జోన్లలో ప్రధాన రహదారులతో పాటు అనుసంధాన రోడ్లను నిత్యం పర్యవేక్షిస్తూ పరిశుభ్రత పనులు జరిగేలా చూడాలని ఆయా జోనల్ కమిషనర్లను ఆదేశించారు. ప్రముఖులు బస చేయు మార్గాలను నేవీ అధికారులతో కలిసి పర్యటించి పారిశుద్ధ్యం పనులను పర్యవేక్షించారు. 17 ,18 19 తేదీలలో ఐఎఫ్ఆర్ జరుగుతున్నందున ఈ మూడు రోజులు పారిశుద్ధ్య పనుల విధుల నిర్వహణ నిమిత్తమై ఒక షిఫ్ట్ కొరకు 365 మంది పారిశుద్ధ్య కార్మికులను మూడు షిఫ్ట్లలో మొత్తం 1095 మందిని 3 రోజులు కొరకు అదనంగాఏర్పాటు చేశామని , అలాగే నిరంతర పరిశుభ్రత దిశగా ఆయా ప్రాంతాలలో 6 పెద్ద స్వీపింగ్ మిషన్లను, 8 చిన్న స్వీపింగ్ మిషన్లను, 4 బీచ్ క్లీనింగ్ మిషన్ లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఫుట్పాత్పై వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని వ్యర్థాలను రోడ్లపై వేయకుండా డస్ట్ బిన్ లో వేయాలని సూచించారు. వ్యర్థాలు ముఖ్యంగా పడే ప్రదేశాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో అదనంగా పారిశుద్ధ్య కార్మికులను నియమించి వ్యర్థాలను తొలగించాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయక వైద్యాధికారులు డాక్టర్ కృష్ణంరాజు, బి. ప్రసాదరావు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటేషన్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.






## ఆర్కే మార్ట్‌లో భారీ అగ్ని ప్రమాదం

**- సుమారు రూ.2 కోట్ల నష్టం**






**అచ్యుతాపురం, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** అచ్యుతాపురం పూడిమడక రోడ్డులో ఉన్న కేఆర్ ఎంటర్ప్రైజెస్ దుకాణంలో మంగళవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. హౌస్ కీపింగ్, స్టేషనరీ, ప్లాస్టిక్ సామాగ్రి నిల్వ ఉన్న కారణంగా మంటలు వేగంగా వ్యాపించాయి. స్థానికుల సమాచారం మేరకు ఆర్కే మార్టు మోసాయిపేట గ్రామానికి చెందిన కోన వెంకట్ దిగా తెలిపారు వెంటనే మూడు ఫైర్ ఇంజిన్లు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. దుకాణంలో భారీగా నిల్వ ఉన్న ప్లాస్టిక్ మెటీరి యల్ కారణంగా దట్టమైన పొగ వ్యాపించింది. ఈ ఘటనలో ప్రాణనష్టం సంభవించలేదు. అయితే ఆస్తినష్టం రూ.2కోట్లు వరకు ఉండొచ్చని ప్రాథమిక సమాచారం, షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

## నులి పురుగుల నిర్మూలనతో ఆరోగ్యం

**: జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్**



**పరవాడ, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** నులి పురుగుల నిర్మూలన వల్ల ఆరోగ్యం సమకూరుతుందని, పిల్లలందరూ నులిపురుగుల నిర్మూలనకు అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగులు నిర్మూలన దినోత్సవం సందర్భంగా పరవాడ మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు) లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పాల్గొని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1 వ సంత్సరం నుండి 19 సంవత్సరాల వయసు లోపల ఉన్న విద్యార్థులందరూ ఒక అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఇప్పుడు పాఠశాలకు రాని వారికి ఈ నెల 24 వ తేదిన న మరోసారి పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్టేట్ నోడల్ ఆఫీసర్ నిర్మల గ్లోరీ, జిల్లా విద్యా శాఖ అధికారి జి. అప్పారావు నాయుడు, డిఎంహెచ్ ఒ డాక్టర్ హైమావతి, ఎం ఈ ఓ లు జి సాయి శైలజ, దివాకర్ రావు, డా.రంజిత్, డా. శాంతి,డా.ఎస్తేరు రాణి,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నునపర్తి చెరువులో మట్టి దోపిడీ

**- యంత్రాల సహాయంతో చెరువులో బారీ గుంతలు - పట్టించుకొని అధికార యంత్రాంగం - పర్యావరణాన్ని కాపాడాలని స్థానికుల ఆవేధన**






**అచ్చుతాపురం, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** అచ్యుతాపురం: కూటమి ప్రభుత్వం చెరువులను ధ్వంసం చేస్తుంది. ఎక్కడ చెరువు కనపడిన కూటమి నాయకులు డేగ లాగ వాలిపోతున్నారు. చెరువుల ఆనవాళ్లు పూర్తిగా కోల్పోయి కనబడుతున్నాయి. అచ్యుతాపురం మండలం నునపర్తి గ్రామంలో సర్వే నెం 126లో 9.90 ఎకరాల విస్తీర్ణంలో గల కొత్త చెరువు లో గత కొద్ది రోజులుగా వందల సంఖ్యలో బారీ టిప్పర్ లారీలతో అక్రమంగా గ్రావెల్ మట్టి తరలించుకుపోతున్నారు. అధికార పార్టీ అండదండలు పుస్కాలంగా ఉండటంతో రాత్రి పగలు తేడా లేకుండా పొక్లెయిన్ సహాయంతో భారీ టిప్పర్లు, ట్రాక్టర్లతో మట్టిని తరలించి అక్రమార్కులు సొమ్ములు చేసుకుంటున్నారు. నాయకులు, అధికారులు కుమ్మక్కు అవడం వలనే కొత్తచెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్థులు అంటున్నారు. లంచాలకు అలవాటు పడ్డ అధికారులకు మట్టి అక్రమంగా తరలిస్తున్న విషయం తెలిసినా, ఏమాత్రం పట్టించుకోకుండా అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారని స్తానిక రైతులంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ప్రకృతి సహజ సిద్దమైన సంపదలను దోచుకుంటూ, పర్యావరణాన్ని పాడుచేస్తున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ సంపదను కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## పంచదార్ల దళిత భూములపై జిల్లా యంత్రాంగం కన్ను!

**➢ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి విదసం పిలుపు ➢ 50 ఏళ్ల హక్కులపై కుట్ర... పంచదార్లలో భగ్గుమన్న పోరాటం ➢ ప్రభుత్వ ఉత్తర్వులు రద్దు చేయాలి ➢ దళిత భూములపై వివక్షకు నిరసన ➢ దళితుల భూముల జోలికి వస్తే రాష్ట్రం దద్దరిల్లుతుంది! ➢ భూమే జీవితం... హక్కుల కోసం పంచదార్ల దళితుల పోరాటం ➢ పంచదార్ల అసైన్డ్ భూములపై ప్రభుత్వం కన్ను ➢ రోడ్డెక్కిన దళితులు**






**అచ్యుతాపురం / రాంబిల్లి / యలమంచిలి, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** పంచదార్ల గ్రామంలోని దళితుల అసైన్డ్ భూముల జోలికి వస్తే ఉద్యమాన్ని రాష్ట్ర స్థాయికి విస్తరిస్తామని, ప్రభుత్వం జారీ చేసిన స్వాధీన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని విస్తృత దళిత సంఘాల ఐక్య వేదిక (విదసం) రాష్ట్ర కన్వీనర్ డా. బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. గత 15 రోజులుగా పంచదార్ల దళిత రైతులు చేపడుతున్న ఉద్యమానికి మద్దతుగా మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. విదసం ఆధ్వర్యంలో పలు సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నిరసన శిబిరాన్ని ఉద్దేశించి బూసి వెంకటరావు మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "దళితుల భూములపై మాత్రమే దృష్టి ఎందుకు?" రాష్ట్రవ్యాప్తంగా లక్షల ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు అక్రమంగా ఆక్రమితమవుతున్నా చర్యలు తీసుకోని అధికారులు, పంచదార్ల దళితుల భూములపై మాత్రమే దృష్టి పెట్టడం వెనుక పెద్ద కుట్ర ఉందని ఆరోపించారు. కృష్ణంపాలెం, సీతపాలెం గ్రామాలకు పునరావాసం కల్పించేందుకు దళితుల భూములే దొరికాయా? అని ప్రశ్నించారు. ఎదురువాడ, దెబ్బపాలెం ప్రాంతాల్లో ఏపీఐఐసీ భూములు ఉన్నప్పటికీ వాటిని వదిలేసి పంచదార్ల భూములపై కన్నేయడం వివక్షకు నిదర్శనమన్నారు.

**➢ అక్రమ కబ్జాలు... లంచాల ఆరోపణలు**

రాంబిల్లి మండలంలో కట్టా వెంకటేశ్ కుటుంబానికి చెందిన అసైన్డ్ భూమి అక్రమంగా కబ్జా అయినా అధికారులు అడ్డుకోలేకపోయారని తెలిపారు. అలాగే అసైన్డ్ భూముల వ్యవహారంలో లంచాల ఆరోపణలు ఉన్నా సంబంధిత సిబ్బందిపై చర్యలు లేవని విమర్శించారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 89లోని 25 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోని అధికారులు, ఇక్కడ మాత్రం దళితుల భూములు తీసుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా కబ్జాలపై మౌనం కశింకోట మండలం, తాళ్లపాలెం గెడ్డ, అలాగే అనకాపల్లి శారదా నది గట్టు వద్ద ఉన్న భూముల కబ్జాలపై వార్తలు వచ్చినా జిల్లా అధికారులు స్పందించలేదన్నారు. అయినా పంచదార్ల భూములపై మాత్రమే చర్యలు తీసుకోవడం సిగ్గుచేటని అన్నారు. "50 ఏళ్ల హక్కులను లాక్కోవడం అట్రాసిటీ నేరం" 50 ఏళ్ల క్రితం ప్రభుత్వం దళితులకు కేటాయించిన భూములను తిరిగి లాక్కోవడానికి ప్రయత్నించడం, వారిని బెదిరించడం అట్రాసిటీ నేరమని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే అధికారులు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమానికి నాయకత్వం గాధం అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాజి ఓంకార్, నేతల నాగేశ్వరరావు, ఐ. దేవుడుబాబు, గోదు వెంకటేశ్వరరావు, బుడతల అప్పారావు, పాము నాగభూషణం, ఎం. శ్రీనివాస్, కూరపాటి అప్పారావు, గుడివాడ ప్రసాద్, దిమ్మల జగ్గారావు, ఈరిగల రమణ తదితరులు పాల్గొన్నారు.




## నులిపురుగుల నివారణతోనే పిల్లల ఆరోగ్యం



రామభద్రపురం, మేజర్ న్యూస్ 17 ఫిబ్రవరి : పిల్లలకు నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఎంపీహెచ్ ఎస్ పి ప్రభావతి అన్నారు. మంగళవారం నాయుడువలస పాఠశాలలో స్థానిక ఏ ఎన్ ఎమ్ సి హెచ్ భవాని ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు ముందుగా విద్యార్థులకు నులిపురుగుల సోకిన పిల్లలు.. లక్షణాలు ..నివారణపై అవగాహన నిర్వహించారు. నులిపురుగులు సోకిన పిల్లల్లో రక్తహీనత,పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసంగా ఉండటం కడుపునొప్పి, వికారం, వాంతులు బరువు తగ్గడం మొదలు లక్షణాలు ఉంటాయని ప్రభావతి తెలియచేసారు. ఇందుకు డివార్మింగ్ మాత్రలు (అల్బెన్డోజోల్) తప్పనిసరిగా పిల్లలు నమలి మింగాలని తెలియ చేశారు. ఆంగ్ల భాషా బోధనోపాధ్యాయులు జెసి రాజు మాట్లాడుతూ అల్బెన్డోజోల్ మాత్రలు వేసుకోవడం వల్ల రక్తహీనత నివారిస్తుందని, పోషకాలు సక్రమంగా శరీరానికి అంది ఆ రోగ్యంగా ఉంటారని తద్వారా చురుకుగా చదువుపై ఏకాగ్రత, నేర్చుకొని సామర్థ్యం పనిచేయగలిగే నేర్పు కలుగుతుందన్నారు అనంతరం పాఠశాలకు హాజరైన పిల్లలందరి చేత ఎంపీ హెచ్ ఎస్ ప్రభావతి, హెచ్ ఎమ్ వేణు ,జె సి రాజు ఆల్బెండోజోల్ మాత్రలను వేసి, నమలించి కాచి చల్లార్చిన నీటిని విద్యార్థులకు అందించి వైద్య సిబ్బంది పర్యవేక్షణలో విద్యార్థులనువుంచారు కార్యక్రమంలో ఎమ్ పి హెచ్ఏవి జయ ప్రకాష్, ఉపాధ్యాయ సిబ్బంది రాజమ్మ, జగదీశ్వరి, రమణ, కృష్ణం నాయుడు ఆషాలు సుబ్బలక్ష్మి, కె.లక్ష్మీ పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాలపై తస్మాత్ జాగ్రత్త

### పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో అధికారుల దిశా నిర్దేశం



పూసపాటిరేగ, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనే ఎందుకు ముందస్తు చర్యల్లో భాగంగా మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపిడీవో రాధిక అధ్యక్షతన ఓటర్ జాబితాతో పాటు కూలింగ్ కేంద్రాల 20 వాటిపై ప్రత్యేక సమావేశంలో మంగళవారం చర్చించారు. ఇందుకు సంబంధించి ముందస్తుగానే 2025 జనవరి నాటికి ప్రచురించిన ఓటర్ల జాబితా లను ప్రచురించడంతో వాటిని పంచాయితీ కార్యదర్శులకు సమావేశంలో అందజేసి ఓటర్ల లోటుపాట్లపై మండల పంచాయతీ విస్తరణ అధికారి జ్ఞానేశ్వర్ రావు చర్చించారు. ఓటర్ల జాబితాలలో పొరపాట్లు లేకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ లిస్ట్ ల ద్వారా ఎవరైనా చనిపోయిన వారు ఉన్నా అటువంటి వాటిపై దృష్టి సారించి ఓటర్ జాబితాలో తొలగించే విధంగా చర్యలు తీసుకోవాల న్నారు. అలాగే కొంతమంది ఓటర్లు పక్క గ్రామాలకు ఓటర్లుగా నమోదయ్యే విధంగా ఉంటారని అలా కాకుండా ఏ పోలింగ్ స్టేషన్ సంబంధించి ఆ పోలింగ్ కేంద్రాలలోనే ర్ ఓటర్లు ఉండే విధంగా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓటర్ జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల ఏ పరిస్థితుల్లో ఉన్నాయన్న దానిపై పంచాయతీ కార్యదర్శి ద్వారా అధికారులు ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మండల పరిపాలనాధికారి వైయస్సార్ నాయుడు, డిప్యూటీ ఎంపీడీవో పైడిరాజు పాల్గొన్నారు.

# అభివృద్ధి పేరుతో రైతులను మోసగిస్తారా

## కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మ్యాపులను మారుస్తారా?

## హోటళ్లకు మా భూముల మీదనుండే రోడ్లు వేయడం తగదు : దిబ్బలపాలెం రైతుల ఆవేదన









భోగాపురం, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ : అంతర్జాతీయ విమానాశ్రయం పేరుతో ఇప్పటికే రైతుల భూములను తీసుకొన్న ప్రభుత్వం ఇప్పుడు మరల కార్పొరేట్ సంస్థలకు వెన్నుదన్నుగా ఉంటూ మరిన్ని భూములను లాక్కునే ప్రయత్నం తక్షణమే విర మించుకోవాలని దిబ్బలపాలెం గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ జిల్లా భీమిలి మండలం అన్నవరం పంచాయతీ పరిధిలోని రెండు ప్రైవేట్ హోటళ్ల నిర్మాణం జరుగుతోందని. దిబ్బలపాలెం నుంచి ఆ హోటళ్లకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేకపోవడంతో, రోడ్డు నిర్మాణం కోసం దిబ్బలపాలెం రైతుల భూములను ఇవ్వాలని అధికారులు డిమాండ్ సబబు కాదన్నారు. విమానాశ్రయానికి భూములు కోల్పోయి మేముంటే ఇలా మరల భూములు లాక్కునేందుకు సిద్ధపడడం ఎంతవరకు సమంజసం అన్నారు.

గతంలో రైతులు నిరాకరించడం జరిగిందని, ఇందుకోసం పక్కనే బంజర భూమి ఉన్నప్పటికీ తమ భూములే కావాలనడం హాస్యాస్పదమన్నారు. తమ భూములను కాపాడుకోవడం కోసం ఎంతవరకైనా తెగిస్తామని, భూములు ఇచ్చేదే లేదంటూ ఎంపీటీసీ ప్రతినిధి పి.బి.రెడ్డి, నర్సింగ్, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

# జాతర ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ



చీపురుపల్లి ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి చీపురుపల్లి గ్రామ దేవత శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవ ఏర్పాట్లను డీఎస్పీ ఎస్.రాఘవులు మంగళవారం పరిశీలించారు. 22 నుంచి 24 వరకు జరగనున్న జాతర మహోత్సవ ఏర్పాట్లను, కనక మహాలక్ష్మి ఆలయ ప్రాంగణాన్ని ఆయన కమిటీ సభ్యులతో పాటు సిఐ జి.శంకరరావు, ఎస్ఐ ఎల్.దామోదరరావులతో కలసి పర్యటించి పరిశీలన జరిపారు. అల్లరి మూకలు ఎటువంటి అల్లర్లకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుని చట్టపరంగా శిక్షిస్తామని రాఘవులు హెచ్చరించారు. ప్రత్యేకించి జాతరకు హాజరుకానున్న లక్షల మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రత్యేకించి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే వేదికతో పాటు ఆలయ ప్రాంగణానికి చేరుకోవడానికి అవసరమైన రహదారులను భద్రత ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రాయివలస జంక్షన్ నుండి దారి మళ్లించి వాహనాల కొరకు ప్రత్యేకంగా తోటపల్లి కాలువ పక్కనుండి నాగంపేట వరకు రహదాలను ఏర్పాటు చేసి వాహనాలను మళ్ళించనున్నట్లు ఆయన వివరించారు. ప్రత్యేకించి జాతరలో బూరలు ఊదుతూ అధిక శబ్దాలతో అసౌకర్యం కల్పించే ఆకతాయిలపైన కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. అదేవిధంగా బోకాటలు, పేకాటలుకి ఎటువంటి అనుమతులు లేవని, ఎవరైనా నిర్వహిస్తే చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. జాతరలో ఆకతాయి మూకలను నివారించడానికి పోలీసుల ప్రత్యేక గస్తీ బృందాలు ఏర్పాటు చేశామన్నారు. క్యూలైన్ బారికేడ్ల వద్ద తోపులాట జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఆయన వెంట ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రౌతు కామ నాయుడు, ఆలయ కార్య నిర్వహణ అధికారి నానాజీ బాబు, కమిటీ పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పాముల వలస పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంఈఓ



తెర్లాం, ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్ : పాముల వలస ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి జె. త్రినాథ రావు ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం ఆయన ప్రార్థన సమయానికి వచ్చి పిల్లలు చేసిన ప్రార్థన విని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం విద్యా శాఖ అధికార సిబ్బంది పాఠశాల పనితీరు పిల్లలలో ఉన్న జిజ్ఞాస మరెన్నో విషయాలను పరిశీలించారు. విద్యా శాఖ అధికారి త్రినాథ రావు బేసిక్ ప్రైమరీ స్కూల్ తనిఖీ చేసి పిల్లల వార్షిక అకాడమిక్ లెవెల్స్ వర్క్ బుక్స్ కరప్షన్ రీడింగ్ రైటింగ్ స్కిల్స్ 75 రోజుల ఎఫ్.ఎల్.యాక్షన్ ప్లాన్ ఇంప్లిమెంట్ పిల్లల గ్రేడింగ్ వంటి పలు విషయాలపై ఆరా తీశారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించారు. మరుగు దొడ్ల నిర్వహణ తాగునీరు పిల్లలు సౌకర్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులు డి.రామ్మోహన్ రావుని ఆదేశించారు. ఈ సందర్భంగా పిల్లలకు లెక్కలు బోర్డు పైన వ్రాసి గుణకారాలు తీసివేతలు భాగాహారాలు వంటివి చేయించారు. ఎం.ఈ.వో.2, ఆర్.పాపారావు నిర్వహించారు. సిర్పిలు గాడి నాగేశ్వరరావు పి.అప్పన్నలు తనిఖీలో పాల్గొన్నారు.

# ఏప్రిల్ నాటికి రైల్వే వంతెన పనులు పూర్తి

**– ఈ ఏడాది లోనే కేంద్రీయ విద్యాలయ తరగతులు ప్రారంభం –**

**కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**



**పలాస, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** కాశీబుగ్గ రైల్వే వంతెన ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కాశీబుగ్గ రైల్వే వంతెన పనులు, కేంద్రీయ విద్యాలయ నిర్మాణం కోసం పలాస కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధి సూది కొండ ప్రాంతంలో గల స్థలాన్ని మంగళవారం పరిశీలన చేశారు. అనంతరం తాత్కాలికంగా కేంద్రీయ విద్యాలయ తరగతులు నిర్వహించేందుకు కాశీబుగ్గ రైల్వే ఉన్నత పాఠశాల రైల్వే బేరక్ భవనాలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశీబుగ్గ రైల్వే వంతెన నిర్మాణం పనులు 18 ఏళ్ళుగా పట్టిపీడిస్తున్న కూడా...గత ప్రభుత్వం వంతెన నిర్మాణానికి కనీసం ఒక్క రూపాయి కూడా వెచ్చించ కుండా నిర్లక్ష్యం చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైల్వే వంతెన నిర్మాణం పై ప్రత్యేక దృష్టి సారించి కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి సమస్యను తీసుకు వెళ్ళి రూ. 46 కోట్లు నిధులు మంజూరు చేయడంతో పాటు పనులు ప్రారంభం చేయడం జరిగిందని చెప్పారు. ఈ పనులు ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు లక్ష్యంగా పెట్టడం జరిగిందన్నారు. రైల్వే వంతెన పూర్తి చేయకపోవడంతో గర్భిణీ స్త్రీలు, రోగులు, ప్రమాదం జరిగిన సమయాల్లో ఎంతో ఇబ్బందులు గురైనా సంఘటనలు నా దృష్టికి వచ్చాయని, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి వంతెన నిర్మాణం పూర్తి చేస్తున్నామన్నారు. అంతే కాకుండా వంతెనకు అనుసంధానంగా సర్వీస్ రోడ్లు నిర్ణీత సమయానికి నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించామన్నారు. తాళభద్ర రైల్వే గేటు ప్రాంతంలో వంతెన నిర్మాణం కోసం రైల్వే నిధులు రూ. 76 కోట్లు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. అతి తొందరలో ఆ ప్రాంత రైల్వే వంతెన నిర్మాణం పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే స్థల పరిశీలన చేసి నిర్వాసితులను గుర్తించడం జరిగిందన్నారు. ఉద్దాన ప్రాంతం నుంచి ఎంతో మంది ఆర్మీ, రైల్వేతో పాటు ఇతర సెక్యూరిటీ సంస్థల్లో పని చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని దృఢ సంకల్పంతో కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయించు కోవడం జరిగిందన్నారు. ఈ ఏడాది కేంద్రీయ విద్యాలయ తరగతులు ప్రారంభం చేయనున్నామని, తాత్కాలిక తరగతి గదులు కోసం కాశీబుగ్గ రైల్వే ఉన్నత పాఠశాల, బేరక్ గదులను పరిశీలించామన్నారు. కేంద్రీయ విద్యాలయం, రైల్వే ఉన్నతాధికారులతో ఇక్కడ నుంచే మాట్లాడి,ఉన్న సమస్యలను పరిష్కరించి ఈ ఏడాది నుంచే తరగతులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఉద్దాన ప్రాంతంలో ప్రధానమైన జీడి, కొబ్బరి పంటల ఉత్పత్తులకు ఎంతో అవసరమైన పరిశ్రమలు ఏర్పాటుకు బడ్జెట్ లో కేంద్రం ప్రవేశ పెట్టిన అంశాన్ని ఆంధ్రప్రదేశ్ లో కుడా నెలకొల్పే విధంగా కేంద్ర మంత్రితో,ముఖ్యమంత్రి చంద్రబాబు,తాను చర్చించి అనుబంధ సంస్థలు తీసుకురావడం రైతాంగానికి ఎంతో సులభ పరిణామన్నారు. రైల్వే వంతెన నిర్మాణం, తాళభద్ర రైల్వే వంతెన మంజూరు చేయడంతో పాటు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటులో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కృషి ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి, ఆర్ డి ఓ జి వెంకటేష్, ఏపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పి విఠల్ రావు, లొడగల కామేశ్వరరావు , గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా, బి నాగరాజు, ఎం నరేంద్ర, జోగ మల్లి, కొరికాన శంకర్, తాసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, కమిషనర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# భిన్నత్వంలో ఏకత్వమే దేశానికి బలం




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** యువతలో జాతీయ సమగ్రత పెంపొందించడం ద్వారానే బలమైన దేశ నిర్మాణం సాధ్యమవుతుందని జిల్లా ఉపాధి అధికారిణి కె.సుధ అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 'మేరా యువ భారత్' ఆధ్వర్యంలో శ్రీ శివాని ఫార్మసీ కళాశాలలో జరుగుతున్న 'అంతర్ జిల్లా యువజన మార్పిడి' కార్యక్రమాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతూ.. వివిధ జిల్లాల యువత ఒకచోట చేరి ఆలోచనలు పంచుకోవడం వల్ల పరస్పర అవగాహన పెరుగుతుందన్నారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు మనమంతా ఒక్కటే అనే 'సమగ్రత' భావన యువతలో కలగాలి. విభిన్న సంస్కృతులను అర్థం చేసుకోవడం వల్ల ప్రాంతీయ విభేదాలు తొలిగి, స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని ఆమె వివరించారు. ఈ వేదిక యువత తమ నైపుణ్యాలను, జిల్లాల్లోని ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి చక్కని అవకాశమని పేర్కొన్నారు. మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె. వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ.. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరంలో నెల్లూరు నుంచి వచ్చిన యువతకు మన జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాలను క్షేత్రస్థాయిలో చూపిస్తామన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు, శ్రమదాన్, చర్చా వేదికల ద్వారా నాయకత్వ లక్షణాలను మెరుగుపరుస్తామని తెలిపారు. యువజన సర్వీసుల శాఖ సీఈఓ వి.వి. అప్పలనాయుడు మాట్లాడుతూ.. చక్కని క్రమశిక్షణతో కూడిన ఇలాంటి శిబిరాలు యువత భవిష్యత్తుకు బాటలు వేస్తాయన్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి నారాయణరావు, కళాశాల పీడీ టీ. బాలాజీరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. బి. ప్రసాదరావు, గణాంక అధికారి డి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాలంటీర్లు అరుగుల దిలీప్ కుమార్, మట్టా ప్రియాంక, గార మౌనిక, అజిత్, నెల్లూరు జిల్లా యువతీ యువకులు పాల్గొన్నారు.

# మా డిమాండ్లను పరిష్కరించాలంటూ ఉపాధ్యాయుల ధర్నా




**హిరమండలం, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** విజయవాడలో జరిగిన యుటిఎఫ్ ధర్నా కార్యక్రమంలో హిరమండలం మండలానికి చెందిన 20 మంది ఉపాధ్యాయులు తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలంటూ కోరారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 29% ఐ ఆర్, పెండింగ్ డిఏ, సి పి ఎస్ రద్దు కోరుతూ.. ప్రభుత్వానికి తమ గళం వినిపించారు ఈ కార్యక్రమంలో కె నాగేశ్వరరావు, నారా శంకరరావు, బి నాగరాజు తదితరులు పాల్గొన్నారు ఉపాధ్యాయుల సమస్యల కోసం యు.టి.ఎఫ్. నిర్వహించిన ఈ ధర్నా లో మండలానికి చెందిన ఉపాధ్యాయులంతా పాల్గొని తమ డిమాండ్ల పరిష్కారం కోసం తమ గలం వినిపించారు.




# పనిభారం తగ్గించాలని నిరసన



**మెలియాపుట్టి, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** వీఆర్వోలు పై పని భారం తగ్గించాలని మంగళవారం మెలియాపుట్టి తాసిల్దార్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధిక పనిభారం మోపడంతో చాలామంది వీఆర్వోలు మానసికంగా, శారీరకంగాను తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కొంతమంది వీఆ ర్వోలు పనిభారం కారణంతోనే ఆత్మహ త్యలకు పాల్పడినట్లు వాపోయారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు మాత్రమే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదనపు పనిభారం కారణంగా వ్యక్తిగత, కుటుంబ జీవితంపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విధులకు సంబంధించిన స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి, అధికారుల ఒత్తిడిని తగ్గించాలని వారు విజ్ఞప్తి చేశారు. వీఆర్వోల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ కే .రాము ,ఆర్ఐ ఆశ , వీఆర్వోలు రాజు, సత్యనారాయణ, రామయ్య, సోమేశ్వరరావు , మల్లేశ్వరరావు, ప్రసాద్, వనజాక్షి, వీఆర్వోలు ,వీఆర్ఏలు, సర్వేర్లు, తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుల నిర్లక్ష్యం విద్యార్థి మృతి..!

**– నరసన్నపేటలో బంధువుల ఆందోళన.. – రాజీ కుదుర్చేందుకు రంగంలో ఎదిగిన పెద్దలు.. – అర్ధరాత్రి వరకు తేలన వ్యవహారం.. – ఆస్పత్రి పై పలు ఆరోపణలు..**



**నరసన్నపేట, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** నరసన్నపేట పట్టణంలోని గొలివి ఆసుపత్రి వద్ద మంగళవారం సాయంత్రం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. జలుమూరు మండలం కృష్ణాపురానికి చెందిన గద్దిబోయిన మణికంఠ(15) ఆస్పత్రిలో చనిపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు ఆందోళన చేశారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మణికంఠ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సోమవారం రాత్రి నిమ్మాడ వద్ద జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడ్డ మణికంఠను బంధువులు నరసన్నపేట లోని గొలివి ఆసుపత్రికి తరలించారు. దవడ ప్రాంతంలో ఎముక ఇరిగిందని ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పినట్లు బంధువులు తెలియజేశారు. అందుకు అవసరమైన ఎక్స్రే, స్కానింగ్ ను పాత బస్టాండ్ సమీపంలోని అక్షరా స్కానింగ్ సెంటర్ వద్దకు మణికంఠ ఆరోగ్యవంతంగా నడిచి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. అనంతరము శస్త్ర చికిత్స చేయాలన్న వైద్యులు మంగళవారం ఉదయం 10:30 గంటల సమయంలో ఆపరేషన్ గదికి తరలించారని, మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎటువంటి విషయం బయటకు చెప్పకుండా, పరిస్థితి విషమించింది శ్రీకాకుళం ఆసుపత్రికి తీసుకువెళ్లాలని అంబులెన్స్ లో తరలించేందుకు ప్రయత్నించగా రోగి బంధువులు అడ్డుకున్నారు. వైద్యులను వైద్య సిబ్బందిని ప్రశ్నించి ఏం జరిగిందో చెప్పాలని నిలదీశారు. మెరుగైన వైద్య సహాయానికి శ్రీకాకుళం వైజాగ్ తరలించాలని కుటుంబ సభ్యులకు ఆసుపత్రి సిబ్బంది చెప్పారు. కుటుంబ సభ్యులు మణికంఠను పరిశీలించగా అప్పటికే మరణించాడు. ఆసుపత్రి వైద్యులు వ్యవహరించిన తీరుకు మణికంఠ బంధువులు ఆస్పత్రి ఆవరణలో మృతదేహంతో నిరసన తెలియజేశారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మణికంఠ మరణించినట్లు బంధువులు ఆందోళన చేశారు. పోలీసులు, పెద్దలు చేరుకొని రాజీ చేసే ప్రయత్నం చేశారు. రాత్రి 9 గంటల 30 నిమిషాల వరకు ఎటువంటి విషయము తెలలేదు. పూర్తి వివరాలు తెలియవలసింది.




## జాతీయ నులి పురుగుల దినోత్సవం



**పాలకొండ, మేజర్ న్యూస్ :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆశ వర్కర్లు మహేశ్వరి, కన్యాకుమారిలు సుమారు 350 మంది విద్యార్థిని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ పైల శంకర్రావు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై శ్రద్ధ వహించగలరని, నులిపురుగుల నిర్మూలనతో రక్తహీనతను అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు గేదెల గోవిందరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెలమల అప్పారావు, బీవీటి శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులకు మాత్రల వినియోగంపై అవగాహన కల్పించారు.

## పరాన్న జీవిని తరిమీద్దాం... ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

### - జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

### - పెదబొండపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 'జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం' ప్రారంభం



**పార్వతీపురం, ఫిబ్రవరి 17 (మేజర్ న్యూస్) :** పరాన్న జీవిని తరిమీద్దాం... ఆరోగ్యాన్ని కాపాడుదాం,విద్యార్థులతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు నులిపురుగులు ప్రధాన అడ్డంకి అని, వాటిని నిర్మూలించడం ద్వారానే ఆరోగ్యవంతమైన తరాన్ని నిర్మించ గలమని పేర్కొన్నారు. మంగళవారం పార్వతీపురం మండలం పెదబొండపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి, వారికి అల్బెండజోల్ మాత్రల ప్రాముఖ్యతను వివరించి, స్వయంగా విద్యార్థులకు మాత్రలను వేశారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత ఏర్పడి, చదువుపై ఏకాగ్రత తగ్గుతుందని, ఈ మాత్రల ద్వారా దానిని అరికట్టవచ్చని తెలిపారు. బహిరంగ మల విసర్జన మానుకోవాలని, భోజనానికి ముందు, తదుపరి చేతులను శుభ్రంగా కడుక్కోవడం వంటి చిన్న పాటి అలవాట్లు పెద్ద మార్పును తెస్తాయని సూచించారు. జిల్లాలోని 1 నుండి 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ, బడి బయట ఉన్న పిల్లలకు కూడా ఈ మాత్రలు అందేలా అధికారులు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్.భాస్కరరావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.విజయ్ మోహన్, ప్రోగ్రాం మేనేజర్ డా. టి.జగన్మోహనరావు, మండల విద్యా శాఖాధికారి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంస్థాగత ఎన్నికల్లో విజయమే లక్ష్యం..

### - పార్టీ బలోపేతానికి బలమైన నాయకత్వాన్ని పార్టీలో చేర్చుకుంటాం.!

### - అరుకు పార్లమెంటరీ నియోజకవర్గంలో టిడిపి అధ్యక్షులు ఎం.తేజోవతి

### - శంబరలో తేజోవతికి ఘన స్వాగతం - తేజోవతి రాకతో మక్కువ, శంబరలో వెలసిన పెక్సీలు

### - శంబరలో భారీగా కార్యకర్తలు మొహరింపు - పోలమాంబ ను దర్శించుకున్న తేజోవతి



**మక్కువ, ఫిబ్రవరి 17, (మేజర్ న్యూస్) :** రానున్న సంస్థాగత ఎన్నికల్లో తమ పార్టీ విజయమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని తెలుగుదేశం పార్టీ అరుకు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షురాలు ఎం తేజోవతి అన్నారు. శంబర శ్రీ పోలమాంబ అమ్మవారి జాతరలో భాగంగా నాలుగ వ మంగళ వారాన్ని పరిష్కరించుకొని స్థానిక ఎంపీటీసీ, తీళ్ల పోలినాయుడు ఆహ్వానం మేరకు ఆమె మంగళవారం నాడు శంబర శ్రీ పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నామన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యకర్తల సమ్మేలనలో భాగంగా మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ , శంబర ఎంపీటీసీ, తీళ్ల పోలినాయుడు, పాచిపెంట మాజీ ఎంపీపీ, పిన్నింటి ప్రసాద్ రావు తదితరులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రానున్న సంస్థాగత గత ఎన్నికల్లో పార్టీ విజమే లక్ష్యంగా తామంతా ఐక్యమత్యంతో పని చేస్తున్నట్టు ఆమె తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా అరకు పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో గల అన్ని గ్రామాలను పర్యటించి పార్టీని మరింత బలోపేతం చేసి , ముందుకు నడిపిస్తున్నట్టు ఆమె తెలిపారు. తమకు మంత్రి సంధ్యారాణి అక్క.. మధ్య ఏ విధమైన రాజకీయ విభేదాలు లేవని విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానం గా.. ఆమె స్పష్టం చేశారు. పార్టీ బలోపేతం చేసేందుకు బలమైన నాయకత్వాన్ని పార్టీలో చేర్చుకుంటామని ఆమె తెలిపారు. తామంతా సమిష్టిగా కృషి , పార్టీ నుంచి బలోపేతం చేస్తామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా శంబర గ్రామానికి తొలిసారి విచ్చేసిన టిడిపి అరకు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షురాలు ఎం తేజోవతికి గ్రామంలో ఘన స్వాగతం లభించింది. ఈ కార్యక్రమానికి మండలంలో అనే గ్రామాల నుంచి వందలాది కార్యకర్తలు , అభిమానులు తరలివచ్చి ఆమె కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా పెంట తిరుపతిరావు స్వగ్రామైన ఏ వెంకంపేట వెళ్లిన, టిడిపి పార్లమెంటు అధ్యక్షురాలు ఎం తేజోవతిని అక్కడ టిడిపి అభిమానులు కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి మండలంలో గల 21 గ్రామపంచాయతీల నుండి అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు. ఆమె రాకతో మండల కేంద్రమైన మక్కువలో సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావు, శంబరలో తేజెక్క యువ సేవ పేరిట పెక్సీలు వెలిసాయి. శంబర లో జరిగిన కార్యక్రమం అనంతరం మక్కువ లో గల మావుడి ప్రసాదరావు ఇంటికి వెళ్లి అక్కడ కార్యకర్తలతో సమాలోచన చేశారు.





## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

### ఉదయం 7 గంటల నుండి 2 గంటల వరకు సరఫరా నిలుపుదల

### ఎలక్ట్రికల్ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ కే.గోపాలరావు నాయుడు



**సీతానగరం, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** పార్వతీపురం మన్యం జిల్లా ట్రాన్స్ కోఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆదేశాల మేరకు సీతానగరం మండల కేంద్రం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మెంటినెన్స్ పనులు కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడం జరుగుతుందని ఎలక్ట్రికల్ ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ కే.గోపాలరావు నాయుడు తెలిపారు. సీతానగరం సబ్‌స్టేషన్ పరిధిలో పలుచోట్ల విద్యుత్ లైన్‌లకు ఆనుకుని ఉన్న చెట్లు కొమ్మలను తొలగించడంతో పాటు విద్యుత్తు లైన్‌ల పరిధిలో నిర్వహణ పనులు కారణంగా విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేయడం జరుగుతుందని వినియోగదారులు ఈవిషయంను గమనించాలని సహకరించాలని కోరారు.

### రైల్వే డివిజనల్ మేనేజర్‌ను కలిసిన

## పలువురు సర్పంచులు నాయకులు

### చినబోగిలి రైల్వే గేట్ యధాతరంగా పునదించాలని వినతిపత్రం అందజేత



**సీతానగరం ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్ :** మండలంలో చినబోగిలి రైల్వే గేట్ యధాతరంగా పునదించాలని పలు గ్రామాల సర్పంచులు నాయకులు విశాఖపట్నం వెళ్లి రైల్వే డివిజనల్ మేనేజర్ శ్రీలలిత్ బోహ్రాని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యను ఎవరెస్టు వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయనతో స్థానిక నాయకులు మాట్లాడుతూ రైల్వే గేట్ అవతల చిన బోగిల గ్రామ రైతులకు చెందిన సుమారు 16 వందల ఎకరాలు వ్యవసాయభూములుఉన్నాయి, పొలంలోకి వెళ్లాలన్న పండిన పంటనుఇంటికి తెచ్చుకోవాలన్నా, కొత్తగా నిర్మించిన సబ్ వే ద్వారా తీసుకురావడం చాలా కష్టంగా ఉంటుంది, మరియు అంగన్వాడి సెంటర్, ప్రాథమిక పాఠశాల ఉన్నాయి, చిన్నపిల్లలు గేటు దాటడం ప్రమాదకరం, ఈ సెంటర్ నుండి మండలంలో ఆరు గ్రామాలు ప్రజలు మరియు మక్కువ మండలం ప్రజలు కూడా ఈ గేటు ద్వారా ప్రయాణం చేయాల్సి వస్తుంది, రాత్రి సమయంలో వైద్య సహాయం కోసం జిల్లా కేంద్రమైన పార్వతీపురం లేదా విజయనగరం అత్యవసర పరిస్థితుల్లో రోగులను తీసుకు వెళ్లడం కష్టతరం, కావున సంబంధిత రైల్వే శాఖ అధికారులు స్పందించి ఈ గేటును యధావిధిగా కొనసాగించాలనీ వినత పత్రం అందజేయడం జరిగిందని దానికి ఆయన సానుకూలంగా స్పందించారని . త్వరలోనే అక్కడికి వచ్చి సందర్శిస్తానని తెలియజేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చినబోగిల సర్పంచ్ కుర్మాన శీను. బక్కుపేట సర్పంచ్ అప్పారావు. బలకృష్ణ రాయపురం సర్పంచ్ నడిమింటి రామకృష్ణ. గెడ్డలప్పి సర్పంచ్ తిరుపతి నాయుడు తో పాటు పలు గ్రామాల సర్పంచులు నాయకులు డిఆర్ఎం ను కలిసిన వాళ్ళ ఉన్నారు.

# బాడంగిలో 'స్వచ్ఛ రథం' ప్రారంభం



**బాడంగి, ఫిబ్రవరి 17 (మేజర్ న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న క్లాప్ క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా బాడంగి మండలంలో చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు 'స్వచ్ఛ రథం' కార్యక్రమాన్ని ఈ నెల 21వ తేదీ శనివారం ప్రారంభించ నున్నట్లు ఎంపీడీవో ఎస్. రామకృష్ణ వెల్లడించారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మరియు పంచాయతీరాజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గ్రామాలు, పట్టణాలను ప్లాస్టిక్ రహితంగా, పరిశు భ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ పథకం కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛ రథం వాహనం ఇంటింటికి వెళ్లి పనికిరాని ప్లాస్టిక్, గాజు, ఇనుము, పాత కాగితాలు తదితర వ్యర్థాలను సేకరిస్తుందని చెప్పారు. సేకరించిన వ్యర్థాల బరువుకు అనుగుణంగా ప్రజలకు నిత్యావసర సరుకులను ఉచితంగా అందజేస్తారని వివరించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి స్వచ్ఛ రథం గ్రామాల్లో పర్యటించి వ్యర్థాలను సేకరిస్తుందని తెలిపారు. ప్రజలు తమ ఇళ్లలోని తడి, పొడి, ప్లాస్టిక్ వ్యర్థాలను వేర్వేరుగా భద్రపరచి ఈ వాహనానికి అందజేస్తే, వాటి బరువుకు అనుగుణంగా ఆయిల్, షాంపూ, సబ్బులు, పప్పులు, కూరగాయలు వంటి నిత్యావసర వస్తువులు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని గ్రామాల పరిశుభ్రతకు సహకరించాలని ఎంపీడీవో పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ప్రోత్సాహకాలు అందించే ఈ వినూత్న కార్యక్రమం విజయవంతం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

### బాడంగి సీహెచ్‌సీలో 150 మొక్కల నాటి

## ఆస్పత్రి పచ్చదనానికి డాక్టర్ నాగేశ్వరరావు ప్రత్యేక కృషి



**బాడంగి, ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్ :** పర్యావరణ పరిరక్షణతో పాటు రోగులకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో బాడంగి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) ఆవరణలో మంగళవారం విస్తృతంగా మొక్కలు నాటారు. సీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ పెద్దింటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆస్పత్రి ప్రాంగణంలో 150 మొక్కలను నాటించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాడంగి సీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష తండ్రి హరి రామ్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 150 మొక్కలను ఆస్పత్రి అభివృద్ధి కోసం అందజేశారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ పట్ల ఆయన చూపిన ఆసక్తి అభినందనీయమని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఆస్పత్రి ఆవరణను మరింత పచ్చదనంతో నింపేందుకు అదనంగా సుమారు 500 మొక్కలను నాటేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో టేకు, నేరేడు, బాదం వంటి విలువైన, నీడనిచ్చే మరియు పర్యావరణానికి మేలు చేసే మొక్కలను నాటనున్నట్లు వివరించారు. ఆస్పత్రి పరిసరాలు పచ్చగా, ఆహ్లాదకరంగా ఉండడం వల్ల రోగులకు మానసిక ప్రశాంతత లభించడమే కాకుండా ఆరోగ్యపరంగా కూడా మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆస్పత్రిని ఆదర్శవంతమైన హరిత ప్రాంగణంగా తీర్చిదిద్దేందుకు సిబ్బంది అందరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, భాను, ఆస్పత్రి సిబ్బంది పాల్గొని మొక్కలను నాటి వాటి సంరక్షణకు కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేశారు.

## డీ వార్మింగ్‌తో రక్తహీనత మటుమాయం : వైద్యాధికారి డా.గోపాలకృష్ణ



**కొత్తవలస. ఫిబ్రవరి 17 (మేజర్ న్యూస్) :** డీ వార్మింగ్‌తో రక్తహీనత మటుమాయమని వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ అన్నారు. ఈమేరకు మంగళవారం మండలంలోని వియ్యంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రా0 పరిధిలో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా నాలుగు హై స్కూల్స్, నాలుగు యు.పి.స్కూల్స్, 15 ఎంపీపీ. స్కూల్స్, 30 అంగన్వాడీ కేంద్రాలలో స్కూల్ ఉపాధ్యాయులు, ఎమ్.ఎల్.హెచ్.పి.లు, ఏఎన్ఎమ్స్, ఆశ వర్కర్స్, అంగన్వాడీ వర్కర్స్ సమన్వయంతో 4910 పిల్లలుగాను 4802 మంది పిల్లలు కి ఆల్బెండజోల్ మాత్రలు మింగించినట్లు తెలిపారు. అన్ని స్కూల్స్, అంగన్వాడీ కేంద్రాలలో పర్సనల్ హైజీన్, హ్యాండ్ వాషింగ్ పై అవేర్నెస్ కల్పించి ఆరోగ్య విద్య అందించారు. డీవార్మింగ్ వలన పిల్లలకి కడుపు నొప్పి, నీరసం, రక్తహీనత రాకుండా ఉంటుందని, తద్వారా పిల్లలలో శారీరక, మానసిక ఎదుగుదల ఉంటుందని, చదువులో ఏకాగ్రత పెరుగు తుందని తెలిపారు. ఈకార్యక్రమంలోవైద్యాధికారి డాక్టర్ సింహాద్రి నాయుడు, డా "బి.ఆర్.అంబేద్కర్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.వి.ఎస్.లక్ష్మీ, జెడ్.పి. హైస్కూల్ హెచ్ఎమ్ గోవిందరాజు, ఓ.పి. జిందాల్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.వి.ఎస్.ఎస్. విశ్వనాథం, హెల్త్ సూపర్ వైజర్స్ నరసింహరావు, పద్మావతి, ఈశ్వరరావు, సత్యారావు, ఉపాధ్యాయులు,ఆశ వర్కర్స్, అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

## చరిత్ర మెచ్చిన పార్టీ వైయస్సార్సీపి : నెల్లిమర్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బడ్డు కొండ





**భోగాపురం, ఫిబ్రవరి 11,మేజర్ న్యూస్ :** వైయస్సార్ సిపి పార్టీ రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని, స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి తో పాటు, ఆయన తనయుడైన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలన ప్రజల హృదయాల్లో సొంతం చేసుకోవడం అందరికీ తెలిసిన విషయ మేనని నెల్లిమర్ల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ప్రస్తుత కూటమి పాలన అటకెక్కిందని ఇచ్చిన హామీలే నెరవేర్చని ఈ ప్రభుత్వం మరికొద్ది రోజుల్లో గద్దె దిగబోతుందని జోష్యం చెప్పారు. గ్రామ కమిటీల ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలని, కార్యకర్తలందరికీ వైఎస్సార్సీపీ అండగా నిలుస్తుంద న్నారు. భోగాపురం మండలం ఏ రావివలస, గూడెపు వలస, దల్లి పేట, రెడ్డి కంచేరు గ్రామాల్లో వైకాపా మండల కన్వీనర్ ఉప్పాడ సూర్య నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిం చిన గ్రామ కమిటీ సమావేశానికి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

ఈ సందర్భంగా బడ్డుకొండ మాట్లాడుతూ వైఎస్సార్సీపీ కార్యకర్తలకు ఉన్న గౌరవం ఇతర పార్టీల కార్యకర్తలకు ఉండదని కమిటీల్లో స్థానం సంపాదించుకున్న వారు పార్టీ పటిష్టతకు అహర్నిశలు కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఉప్పాడ శివారెడ్డి, పచ్చిపాల గురునాథ్, సుందర హరీష్, రేగాన శ్రీనివాసరావు, కొల్లి రామ్మూర్తి, దల్లి శ్రీను, శీరపు గురునాథ్, బైరెడ్డి రమణ తదితర నాయకులు పాల్గొన్నారు.

## 19 నుండి హనుమాన్ చాలీసా పారాయణం



**విజయనగరం టౌన్, ఫిబ్రవరి 17,మేజర్ న్యూస్ :** విజయనగరం, ఎన్.సి.ఎస్. రోడ్‌లోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఫిబ్రవరి 19 నుంచి ఏప్రిల్ 1 వరకు 41 రోజులు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు దేవాలయ అధ్యక్షులు మడిపల్లి వెంకటాచలం తెలిపారు. మంగళవారం జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడిన చలం, ప్రతిరోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 4 జట్టులుగా ఏర్పాటు చేసి 108 సార్లు చాలీసా పారాయణం చేస్తామని చెప్పారు. కార్యదర్శి గ్రంధి గుప్తా కూడా ఇదే వివరించారు. కన్వీనర్ కామరాజు మాట్లాడుతూ మొదటి రోజు ఉదయం 10 గంటలకు కాకినాడ శ్రీ పీఠం పరిపూర్ణానంద స్వామిజీ ప్రవచనం చెప్పనున్నారనీ, దేవాలయ గౌరవ అధ్యక్షులు మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. దీనిలో పాల్గొనే భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పెంటపాటి బాల, గోకవరపు ఉదయ్ ప్రసంగించారు. అనంతరం కార్యక్రమ కరపత్రాలు విడుదల చేశారు. భక్త బృందం సునీల్, బాబ్జి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పూడి వలసలో ఉపాధి పనులపై ఏపీవో ఆకస్మిక తనిఖీ



**బాడంగి, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** క్షేత్ర పరిశీలనలో భాగంగా బాడంగి మండలంలోని పూడి వలస గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఏపీవో కె. సాయిరాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పూడి చెరువు వద్ద నిర్వహిస్తున్న పనుల పురోగతిని సమగ్రంగా పరిశీలించి, పనుల నాణ్యత, కార్మికుల హాజరు వివరాలను సవివరంగా తెలుసుకున్నారు. ఈ పనులకు సంబంధించి కేవలం 76 మంది మాత్రమే పనులకు హాజరైనట్లు గుర్తించారు. కార్మికుల గైర్హాజరుపై అధికారులకు ఆరా తీసి, పనులకు కార్మికుల హాజరు శాతాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనులు ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమైన పథకం కావున, పనులు పారదర్శకంగా, నాణ్యత ప్రమాణాలతో కొనసాగాలని ఏపీవో స్పష్టం చేశారు. కార్మికులకు ఉపాధి అవకాశాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రామారావు, ఫీల్డ్ అసిస్టెంట్ రామ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## మనీష్‌కి పలువురు అభినందనలు



**నెల్లిమర్ల, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** ఏపీపీఎస్సీ గ్రూపు 2 ఫలితాలలో సత్తాచాటి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీషర్ ఉద్యోగం సాధించిన పతివాడ మనీష్‌ని మంగళవారం పలువురు అభినందించారు. మండలం లోని కొండగుంపాం సచివాలయ పరిధి గరికిపేట నాయకులు విజయ నగరంలో మనీష్‌కి దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. మనీష్ ఉన్నతి ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. మనీష్‌ని అభినందించిన వారిలో సర్పంచి గుంటమాని ఉమామహేశ్వరరావు, మాజీ సర్పంచి గుంటమాని రాజిబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు మహంతి పైడినాయుడు, వెంకటరావు, ఆదినారాయణ, అప్పలనాయుడు ఉన్నారు.

## విద్యార్థులు విధిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి



**నెల్లిమర్ల, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** పదేళ్ల వయసు ఉన్న పిల్లలకి విధిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని ఎన్ ఐఇపి స్టేట్ కన్సల్టెంట్ సత్యవతి, వైద్యాధికారులు ధనుంజయ్, శిరీష సూచించారు. కొండవెలగాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధి మొయిద ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్(నులుపురుగు మాత్రలు) మంగళవారం వేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధవహించాలని సూచించారు. చిరుతిళ్లకు దూరంగా ఉండాలని చెప్పారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నరసరావుపేటలో ప్రమాదవశాత్తు గొల్లలములగాం వాసి మృతి



**చీపురుపల్లి ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్ :** మండలంలోని గొల్లల ములగాం గ్రామానికి చెందిన కక్కి ఆదినారాయణ (40) అనే రోజు కూలి ప్రమాదవశాత్తు నరసరావుపేటలో మృతి చెందారు. గొల్లలములగాం తెలుగుదేశం పార్టీ నాయకులు గడే సన్యాసప్పలనాయుడు సమాచారం మేరకు తాపీ మేస్త్రిగా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆదినారాయణ పనుల నిమిత్తం నరసరావుపేటలో కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మృతుడికి భార్య భాగ్యలక్ష్మి, కుమార్తె అమూల్య ఉన్నారు. ఈనెల 15న బహిర్భూమికి బయటికి వెళ్లి సమీపంలో గల కాలువ వద్ద కాలుజారి పడిపోవడం తలకు బలమైన గాయం కావడంతో ఆయన మృతి చెందినట్లు తెలిపారు. భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు నరసరావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామ పెద్దలు కక్కి భీమారావు, పిసిని శ్రీను, కరిమజ్జి అప్పల నాయుడు తదితరులు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించడానికి చర్యలు చేపట్టారని వివరించారు.

## నులిపురుగుల నిర్మూలనతో సంపూర్ణ ఆరోగ్యం



**చీపురుపల్లి ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్ :** నులి పురుగుల నిర్మూలనతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చీపురుపల్లి ఐసిడిఎస్ పిఓ పి నాగమణి అన్నారు. నేషనల్ డి.వార్మింగ్ డే సందర్భంగా చీపురుపల్లి పట్టణంలోని రామాంజనేయ కాలనీ అంగనవాడి కేంద్రంలో ఆమె డి వార్మింగ్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రతి పిల్లవాడికి డి వార్మింగ్ మాత్రలు అంద జేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఎన్వి సూర్యకుమారి, అంగన్వాడీ కార్యకర్త బి.రాము, ఆశా వర్కర్ ఎం.విజయ, ఆయమ్మ అనసూయ పాల్గొన్నారు.

## ఓటరు జాబితా మ్యాపింగ్‌పై అవగాహన సదస్సు

### బియల్వోలతో సమావేశమైన తహశీల్దార్ హేమంత్ కుమార్



**తెర్లాం ఫిబ్రవరి 17 (మేజర్ న్యూస్) :** ఎన్నికల అధికారి వారి ఆదేశాల మేరకు తహశీల్దార్ జి.హేమంత్ కుమార్ బీఎల్వో లతో సమావేశం నిర్వహించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండల మొత్తం ఓటరు జాబితా 49,993 కి గాను 34,844 ఓటరు జాబితా మ్యాపింగ్ 70 శాతం జరిగిందన్నారు. అయితే 65 శాతం కంటే మ్యాపింగ్ తక్కువ చేసిన 17 మందికి పలు రకాల సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు హెచ్‌డిటి గొంగాడ సత్య నారాయణ, బియల్వోలు తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్స్-1లో సత్తా చాటిన గ్లోబల్ స్కూల్ విద్యార్థులు
















**రామభద్రపురం,ఫిబ్రవరి17 (మేజర్ న్యూస్) :** నిన్న విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ -1ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా తెలుగువారి ప్రతిభ కనిపించింది. స్థానిక మండల కేంద్రంలోని గ్లోబల్ వ్యూ స్కూల్ మొదటి సిబియస్ఈ బ్యాచ్ విద్యార్థులు జేఈఈ మెయిన్స్ -1ఫలితాల్లో తమ సత్తా చాటారు. 2023-24విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన గెంజి భరత్ కుమార్,రుంకాన జ్ఞాణదీప్,కొల్లి యతీష్ కుమార్,కిర్ల నవదీప్, పూజారి జస్వంత్‌లు ఉత్తమ ప్రతిభ కనపర్చారని భవిష్యత్ లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి తమ తల్లిదండ్రులకు పాఠశాలకు గుర్తింపు తీసుకొని వస్తారని ఆశీస్తూ పాఠశాల కరస్పాండెంట్ పి.వేంకటరమణ, డైరెక్టర్ చంద్రమోహన్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తమ అభినందనలు తెలిపారు.

# శిలువ ధ్యానం... పాప హరణం

## సీతానగరం, ఫిబ్రవరి 17:40 రోజుల లెంట్ డేస్ ప్రారంభం







సీతానగరం: లోకపాపాల హరణకు శిలువపై త్యాగం చేసిన క్రీస్తు స్మరణార్థం క్రైస్తవులు 40 రోజుల లెంట్ డేస్‌ను భక్తిశ్రద్ధలతో ఆచరిస్తున్నారు. ఫిబ్రవరి 18 నుంచి మొదలయ్యే ఈ దీక్షలో ప్రజలు పాపస్వీకారం చేసుకుంటూ, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ పరిశుద్ధ జీవితం గడుపుతారు.



**ఉపవాసం, ప్రార్థనలతో శ్రమ దినాలు :** ప్రతి రోజూ ఆహార నియంత్రణ పాటిస్తూ, మూడు నుంచి ఏడు సార్లు ప్రార్థనలు చేస్తారు. కొందరు ఒక పూట భోజనం, బుధ, శుక్రవారాల్లో పూర్తి ఉపవాసం ఉంటారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఫలహారంతో భక్తి చాటుకుంటారు. యువత మాంసాహారం మానేసి, ఇతరుల క్షేమార్థం ప్రార్థిస్తారు.

**14 స్థలాలు, ఏడు మాటలు స్మరణ :** క్రీస్తు శిలువపై చెప్పిన ఏడు మాటలు, 14 స్థలాల కష్టాలను ధ్యానిస్తారు. రోమన్ క్యాథలిక్‌లు ప్రతి బుధ, శుక్రవారం విగ్రహాల ముందు ప్రార్థనలు, పరలోకజపం చేస్తారు. పామ్ సండే (మట్టల ఆదివారం)లో ఖర్జూర, మట్టలతో చర్చి ప్రదక్షిణలు చేస్తారు.

**సహాయం, సామాజిక కార్యక్రమాలు :** లెంట్‌లో భోజన దానం, వస్త్రాలు, పుస్తకాలు పంపిణీ చేస్తూ అసమానతల పరిహారం కోరుకుంటారు. రోడ్ల శుభ్రత వంటి సేవలు చేస్తారు. గుడ్ ఫ్రైడేలో ప్రార్థనలు, ఈస్టర్ వరకు దీక్షలు ముగుస్తాయి.

**40 రోజుల దీక్షా వ్రతం :** కొందరు రంగు దుస్తులు ధరించి ఒక పూట భోజనం, ప్రార్థనలు చేస్తూ పుణ్యక్షేత్రాల్లో స్నానంతో వ్రతం విరమిస్తారు. రెవరెండ్ డేవిడ్ రాజు మాట్లాడుతూ, ఇవి పాపాల క్షమాపణ, క్రొత్త జీవితానికి స్వాగతం అని చెప్పారు. లుథరన్ చర్చ్ (పెదబోగిలి) అధ్యక్షులు జె.గురు మండలం మాట్లాడుతూ ప్రపంచ శాంతి, ప్రజల సౌఖ్యం కోరుతూ ఈ రోజులు ధ్యానిస్తామన్నారు.

# ఓవర్‌లోడ్ వాహనాలపై కఠిన చర్యలు : ఎస్పీ ఎఆర్ దామోదర్



**విజయనగరం క్రైమ్, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** రహదారి భద్రత, ప్రజల జీవన రక్షణ కోసం పరిమితికి మించి లోడు మోసుకునే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, హెచ్చరించారు. గడ్డి, చెరుకు, ఊక, ఇసుక, గ్రావెల్, సిమెంట్ వంటి సరుకులతో లారీలు, ట్రాక్టర్లు, ట్రక్కులు, ఆటోలు ప్రయాణిస్తున్నాయి. ఇటీవల ఓవర్‌లోడింగ్ ఘటనలు పెరగడంతో ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభిస్తున్నామని ఎస్పీ తెలిపారు. వీటిని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

**ప్రమాదాలకు ప్రధాన కారణం :** ఓవర్‌లోడ్ వల్ల బ్రేకులు, టైర్లు, సస్పెన్షన్‌పై ఒత్తిడి పెరిగి ప్రమాదాలు జరుగుతాయి. రోడ్లు దెబ్బతింటాయి. డ్రైవర్లు వెనుక వాహనాలు కనపడకుండా పోవడం కూడా ఒత్తిడికి కారణం అవుతుందని ఎస్పీ హెచ్చరించారు. దేశవ్యాప్తంగా ఇది ప్రధాన కారణమని పేర్కొన్నారు. యజమానులు లాభం కోసం రిస్క్ తీసుకోకూడదని, ప్రమాదం జరిగితే బీమా క్లెయిమ్ తిరస్కరణ, చట్టపరమైన ఇబ్బందులు వస్తాయని ఎస్పీ సూచించారు. ఓవర్‌లోడ్ వాహనాలు కనిపిస్తే పోలీస్ స్టేషన్‌లకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రోడ్డు ప్రమాదాలు లేని సురక్షిత సమాజం కోసం అందరూ సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

# గనుల లీజుకు త్వరగా అనుమతులు : జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్





**విజయనగరం , ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** నిబంధనలను పరిశీలించిన అనంతరం, గనుల లీజుకు వీలైనంత త్వరగా అనుమతులు జారీ చేస్తామని జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ చెప్పారు. భారీ, చిన్నతరహా గనుల బ్లాక్స్‌కు సంబంధించి రాష్ట్రస్థాయి మొదటి సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం సాయంత్రం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆద్వర్యంలో అమరావతిలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, గనులశాఖ డిడి సూర్యచంద్రరావు, వివిధ ప్రాజెక్టుల ఇంజనీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, గరివిడి మండలం మందిరవలస, చీపురుపల్లి మండలం నిమ్మలవలస, నెల్లిమర్ల మండలం జగ్గిరాజుపేట తదితర గనుల బ్లాకుల పరిస్థితిని విరించారు. వచ్చిన ధరఖాస్తులను పరిశీలించి వీలైనంత త్వరగా వాటికి ఎన్‌ఓసి మంజూరు చేస్తామని తెలిపారు.

# కబ్జా కోరల్లో నందిగాం చెరువులు

- ప్రైవేట్ లేఔట్ దౌర్జన్య వైఖరికి రైతుల నిరసనలు
- కాలువలు కప్పేసిన వైనం





**భోగాపురం, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** భోగాపురం మండలంలో గజం స్థలం కూడా లక్షల్లో పలకడంతో భూ బకాసురులు వ్యతిరేకి పోతున్నారు. ఇదే అదునుగా ప్రేవేట్ లేఔట్ యజమానులు అధికారుల అండ చూసుకొని కాలువలు చెరువులను కప్పేసిన పరిస్థితి దాపురిస్తుంది. మండలంలోని సుందరపేట నందిగాం గ్రామాల చెరువులైన పాలబంద, దొరగారు బంధ, కోమటి చెరువు లకు వెళ్లే కాలువలను లేఔట్ తాలూకా మట్టి పూడ్చేస్తూ ఆత్రములకు పాల్పడుతున్నారు. ఇదే విషయాన్ని భోగాపురం పంచాయతీ నీటి సంఘం అధ్యక్షులు వరుపులగిరి, రైతులు ధనంజయరావు, వరుపుల ప్రసాద్ రావు, వెల్లం శెట్టి, తాతయ్యలు, కాపుగంటి శ్రీను, కొండ, కాపుగంటి నారాయణరావు మరియు నందిగామ రైతులు పాల్గొన్నారు. తక్షణమే ఆక్రములను తొలగించకపోతే పరిస్థితి తీవ్రతరంగా ఉంటుందని హెచ్చరించారు.

# జేఈఈ మెయిన్స్‌లో వి.కృష్ణాపురం విద్యార్థి ప్రతిభ



**దత్తిరాజేరు (మేజర్ న్యూస్) :** జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో దత్తిరాజేరు మండలం వి.కృష్ణాపురం గ్రామానికి చెందిన మార్పిన మణికంఠ 98పర్సంటైల్ సాధించి ప్రతిభ చాటాడు. దేశంలో ప్రఖ్యాతిగాంచిన ఇంజనీరింగ్ కళాశాలు ఐఐటి, ఎన్ఐటిలో ఎంట్రన్స్ ప్రవేశాలు కోసం గత నెల 21 నుండి 28 దేశవ్యాప్తంగా పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ ఫలితాలను ఎన్ టి ఏ( నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) సోమవారం రాత్రి విడుదల చేసింది. ఈ ఫలితాల మణికంఠ సత్తా చాటాడు. చదువులో చురుగ్గా ఉండడంతో ఎలాగైనా కష్టపడి చదివించాలన్న తపనతో తల్లిదండ్రులు పార్వతి, శంకరరావు ఇద్దరూ కూలి పనుల కోసం చెన్నైవలస వెళ్లారు .కూలీలుగా పనిచేస్తూ విశాఖపట్నం ప్రైవేట్ కాలేజీ హాస్టల్లో చదివిస్తున్నారు. మణికంఠ 10వ తరగతిలో 597 మార్కులు సాధించి నారాయణ స్కూల్ పెద్దపాలెం టాపర్ గానిలిచాడు. ఇప్పుడు జేఈ మెయిన్స్ లో కూడా విజయం సాధించడంతో కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గుర్ల గెడ్డ రిజర్వాయర్‌కు మహర్దశ

- రూ.17 కోట్లుతో ప్రతిపాదనలు పంపిన ఇరిగేషన్ అధికారులు - రిజర్వాయర్‌ను పరిశీలించిన ఎస్ఈ బృందం
- నెరవేరనున్న మంత్రి సంధ్యారాణి హామీ - ప్రాజెక్ట్ స్థితిగతులు పరిశీలించాం : ఎస్ఈ అప్పల నాయుడు





**మెంటాడ, పిబ్రవరి17 (మేజర్ న్యూస్) :** మండలంలోని ఖగుర్ల గెడ్డ మిని రిజర్వాయర్‌కు ఎట్టకేలకు మంచిరోజులు రానున్నాయి. మంత్రి గుమ్మడి సంధ్యారాణి చొరవతో ఈ జలాశయం ఆయకట్టు రైతుల దశాబ్దాల ఎదురుచూపులు ఫలించనున్నాయి. ఈ రిజర్వాయర్ పూర్తికి 17కోట్ల రూపాయల నిధులు అవసరమని ఇరిగేషన్ అధికారులు గత ఏడాది సెప్టెంబర్ లో ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు మంగళవారం ఈ ప్రాజెక్టు స్థితిగతులను స్వయంగా పరిశీలించారు. దీంతో, అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మెంటాడ మండలం సహా అల్లూరి జిల్లా సరిహద్దునున్న పది గ్రామాలకు చెందిన సుమారు మూడువేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే సంకల్పంతో 2000 సంవత్సరంలో 430 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో దీనిపనులు ప్రారంభించారు. రిజర్వాయర్ నిమిత్తం 268 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు.

అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి 138 ఎకరాలతోపాటు, రైతుల నుంచి మరో 130 ఎకరాలు సేకరించారు. ప్రారంభంలో పనులు చురుగ్గానే జరిగినా, తర్వాత నిధులు సర్దుబాటులో తడబాటు కారణంగా పనులు ముందుకు సాగలేదు. కొన్నాళ్ళకు అర్ధాంతరంగా ఆగిపోయాయి. సర్ప్లస్ వాల్,కుడి ఎడమల కాలువల నిర్మాణం పూర్తిచేసుకున్నప్పటికీ, వాటిద్వారా ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందని పరిస్థితి. ఈ కారణంగా పూర్తిగా రిజర్వాయర్ ఆధారిత భూములు పూర్తిగా వర్షాధారమవడంతో ఏటా అరకొర సాగుతో చాలీచాలని పంటతో రైతులు నెట్టుకొస్తున్నారు. ఈ రిజర్వాయర్ పూర్తిచేయాలని పలుమార్లు రైతులు స్థానిక ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. వారిచ్చిన హామీలు రిజర్వాయర్లో కలిసిపోయాయి. వైసీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా రైతుభరోసా కేంద్రాలను ఇక్కడినుంచే వర్చువల్ గా ప్రారంభించిన నాటి ముఖ్యమంత్రి జగన్, ఈ రిజర్వాయర్ పూర్తిచేయిస్తానని బహిరంగ సభ సాక్షిగా ఇచ్చిన హామీకూడా గాలిలో కలిసిపోయింది. ఎమ్మెల్యేగా పీడిక రాజన్నదొర ఈ రిజర్వాయర్ ను ప్రతి ఎన్నికల ప్రచారంలో తురుపుముక్కగా వాడుకొని వదిలేశారు. ఉప ముఖ్యమంత్రి అయ్యాక కూడా దృష్టి పెట్టలేదు. ఫలితంగా, రైతుల్లో తీవ్ర నిరాశ ఆవరించింది.

ఇలాఉంటే, గుమ్మడి సంధ్యారాణి గతేడాది ఎన్నికల సమయంలో ఈ జలాశయం పూర్తికి స్పష్టమైన హామీ ఇచ్చారు. మంత్రి అయ్యాక కూడా హామీని పునరుద్ఘాటించారు. రెణ్ణెల్ల క్రితం ఈ మండల పర్యటన సందర్భంగా, గుర్లగెడ్డ రిజర్వాయర్ను తన హయాంలో పూర్తిచేయించే బాధ్యతను తాను తీసుకున్నానని, ఇది వీలైనంత త్వరలోనే జరుగుతుందని ప్రకటించారు. మంత్రిమాటపై నమ్మకం ఉన్నప్పటికీ, పాతికేళ్లుగా ఇటువంటి హామీలు వినీవినీ వేసారిన రైతుల్లో కొంత సందేహం ఉండేది.

మంగళవారం ఈ ప్రాజెక్ట్ స్థితిగతులు పరిశీలనకు జిల్లా ఇరిగేషన్ ఎస్ ఈ అప్పలనాయుడు బృందంపరిశీలించింది. త్వరలో మిని రిజర్వాయర్ పనులు ప్రారంభం అవుతాయని ఓ అధికారి సూచనప్రాయంగా చెప్పడంతో అన్నదాతల ఆనందానికి అవధుల్లేవు. రిజర్వాయర్ పూర్తయితే మూడువేల ఎకరాలకు దశాబ్దాలుగా వెంటాడుతున్న సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనడంలో సందేహం లేదు.

**రూ.17కోట్లుతో ప్రతిపాదనలు పంపించాము : పి.అప్పలనాయుడు సూపరింటెండెంట్ ఇంజినీర్, జిల్లా ఇరిగేషన్ శాఖ**

గుర్ల గెడ్డ మిని రిజర్వాయర్ పూర్తికి రాష్ట్ర ప్రభుత్వంకు 17కోట్ల రూపాయల అవసరమని గత ఏడాది సెప్టెంబర్ లో ప్రతిపాదనలు పంపించడం జరిగింది. ఈ నేపథ్యంలో, ప్రాజెక్ట్ ప్రస్తుత స్థితిగతులు పరిశీలనకు వచ్చాం. నిధులు అందుబాటులోకి వచ్చిన వెంటనే పనులు ప్రారంభించి నిర్దేశిత గడువులోగా పూర్తిచేస్తాం. ఈలోగా కొంత రిజర్వాయర్ భూమి ఆక్రమణకు గురయ్యింది. ఆక్రమణలు తొలిగిస్తాము. దీనివల్ల రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

# లింగ వివక్షతను అరికట్టాలి

## జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ జీవనరాణి






**విజయనగరం, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** సమాజంలో వేళ్లూను కుపోయిన లింగ వివక్షత మరియు మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు కేవలం చట్టాలు మాత్రమే సరిపోవని, క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి మరియు ప్రజలకు విస్తృతమైన అవగాహన, సామర్థ్య పెంపుదల అవసరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. జీవనరాణి అన్నారు. ఈ మేరకు స్థానిక డిఎం అండ్ హెచ్ఓ కార్యాలయంలో "లింగ వివక్షత ఆధారిత హింస నివారణ మరియు సామర్థ్య పెంపుదల" అనే అంశంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పిసిపిఎన్డిటీ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్ఓ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లు, యం.ఆర్.ఐ మరియు సీటీ స్కాన్ సెంటర్లు తప్పనిసరిగా పి.సి.పి.ఎన్.డి.టి చట్టం-1994 నిబంధనలను పాటించాలని ఆదేశించారు. ప్రతి స్కానింగ్ సెంటర్ జిల్లా మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ ద్వారా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, అలాగే పనిచేసే డాక్టర్ల అర్హత పత్రాలను, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ సర్టిఫికేట్లను సెంటర్‌లో స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. ముఖ్యంగా "ఇక్కడ లింగ నిర్ధారణ పరీక్షలు చేయబడవు" అనే హెచ్చరిక బోర్డులను తెలుగు మరియు ఆంగ్ల భాషల్లో రిసెప్షన్, వెయిటింగ్ హాల్ మరియు స్కానింగ్ గదుల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీలకు చేసే ప్రతి స్కానింగ్ వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు, ఆ రిపోర్టులను ప్రతి నెలా 2వ తేదీలోపు తమ కార్యాలయానికి సమర్పించాలన్నారు. అన్ని రకాల స్కాన్ల ఇమేజ్‌లు, బిల్లులను కనీసం రెండు సంవత్సరాల పాటు భద్రపరచాలని, తనిఖీ సమయంలో రికార్డుల్లో తేడాలు ఉంటే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పిసిపిఎన్డిటి నోడల్ ఆఫీసర్ డాక్టర్ అచ్యుతకుమారి, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ సూర్యనారాయణ, ఎస్ఐ శిరీష, డెమో వి.చినతల్లి, నేచర్ ఎన్జీవో ప్రతినిధి నుండి దుర్గ, ప్రోగ్రామ్ అధికారులు, స్కానింగ్ సెంటర్ల ప్రతినిధులు, డిఈఓలు, డెమో సెక్షన్ సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ అర్జీలను వెంటనే పరిష్కరించాలి : జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్

**విజయనగరం (మేజర్ న్యూస్) :** పిజిఆర్ఎస్‌కు వచ్చే సమస్యలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ ఆదేశించారు. ఆయన మంగళవారం పూసపాటిరేగ మండలంలో పర్యటించారు. స్థానిక తాహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఫైళ్లను, పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ అర్జీలు, మ్యుటేషన్లు పరిశీలించారు.

వాటి స్థితిని తెలుసుకున్నారు. నిర్ణీత కాలవ్యవధిలోగా, లబ్దిదారులు సంతృప్తి చెందేవిధంగా వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. పట్టాదారు పాసుపుస్తకాలు, ఐవిఆర్ఎస్‌పై సమీక్షించారు. ప్రజల సంతృప్త స్థాయిని పెంచేందుకు కృషి చేయాలని సూచించారు.

ఏప్రెల్ నెలలో పంపిణీ చేయాల్సిన పాసుపుస్తకాలను అన్నివిధాలుగా పరిశీలించి, తప్పులు లేనివిధంగా పట్టాదారు పాసుపుస్తకాలను మాత్రమే రూపొందించి పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో తాహసీల్దార్ వెంకటరమణ, హెచ్‌డిటి సంజీవ్‌కుమార్, మండల సర్వేయర్ గణపతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# డోకిశీల ఆశ్రమ పాఠశాల, పీహెచ్‌సీని తనిఖీ చేసిన పీఓ





**పార్వతీపురం, ఫిబ్రవరి 17:మేజర్ న్యూస్ :** పార్వతీపురం మండలం డోకిశీల గ్రామంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఇంచార్జి ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పర్యటనలో పాఠశాల మౌలిక సదుపాయాలు విద్యార్థుల వసతులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. పాఠశాల ఆవరణ లోని తరగతి గదులు, భోజనశాల, వంటగది, మరుగుదొడ్లు, స్నానపు గదుల పరిశుభ్రతను నిశితంగా పరిశీలించారు.

ఆహారం సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో తయారయ్యేలా చూడటానికి వంటగది, భోజనశాలలో పరిశుభ్రత ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించారు. తాగునీటి లభ్యత, సరైన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలు, మొత్తం క్యాంపస్ పరిశుభ్రతను సమీక్షించారు. ఉన్నత స్థాయి పరిశుభ్రత ప్రమాణాలను పాటించాలని, క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల విద్యా పురోగతి, వారి క్షేమం, హాస్టల్, పాఠశాల వసతులలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకోవడానికి వారితో నేరుగా మాట్లాడారు. విద్యార్థులు తమ చదువుపై దృష్టి పెట్టాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పాఠ్యేతర కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొనాలని వారిని ప్రోత్సహించారు. గుర్తించిన లోపాలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థుల ప్రయోజనం కోసం అన్ని వసతులు సక్రమంగా ఉండేలా చూడాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డోకిశీల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలు సిబ్బంది హాజరును పరిశీలించారు. గిరిజన ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం నిరంతరం అందుబాటులో ఉండాలని వైద్యాధికారులకు సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ఐటీడీఏ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# డి వార్మింగ్ డే కార్యక్రమం పరిశీలించిన జాయింట్ డైరెక్టర్

**– ఉల్లిభద్ర,తోటపల్లిలో పరిశీలించిన పరిశీలకులు నరసింగరావు – టాబ్లెట్‌లు వినియోగంపై అడిగి తెలుసుకున్న పరిశీలకులు**



**గరుగుబిల్లి, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని గరుగుబిల్లి,రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఉల్లి భద్ర, తోటపల్లి, సంతోషపురం తదితర గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన జాతీయ నులిపురు గుల నిర్మూలన దినోత్సవం కార్య క్రమంను రాష్ట్ర పరిశీలకులు మరియు వైద్యారోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ జె.నరసింగరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఆల్బండంజల్ మాత్రలు వినియోగం నులిపురు గుల యొక్క దుష్పరిమానాలు, తది తర అంశాల గురించి అడిగి తెలుసు కున్నారు.అనంతరం జాతీయ నులి పురుగుల దినోత్సవం కార్యక్రమం పరిశీలకులు జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జె.నరసింగరావు మాట్లా డుతూ పిల్లల శారీరక మరియు మానసిక ఎదుగుదలకు నులిపు రుగులు ప్రధాన అడ్డంకి అని వాటిని నిర్మూలించడం ద్వారానే ఆరోగ్యవం తమైన తరాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు. నులి పురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత ఏర్పడి చదువుపై ఏకాగ్రత తగ్గుతుందని ఈమాత్రలు వేయడం ద్వారా దానిని అరికట్ట వచ్చని వెల్లడించారు. ముఖ్యంగా బహిరంగ మలవిసర్జన మానుకోవా లని భోజనానికి ముందు తదుపరి చేతులను శుభ్రంగా కడుక్కోవడం వంటి చిన్న పాటి అలవాట్లు పెద్ద మార్పులు తెస్తాయని డాక్టర్ నర్సింగరావు సూచించారు.ఒకటి నుండి 19 ఏళ్ల లోపు పిల్లలకు మరియు విద్యార్థులకు, బడిబయట ఉన్న పిల్లలకు ఈమాత్రలు అందేలా వైద్య శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో గరుగుబిల్లి, రావివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఎన్.జగదీశ్వరి, చింతాడ ఉదయకుమారి, ఎస్.ఎస్.ప్రకాశ రావు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సి .సిలు రిసోర్స్ పర్సన్స్&సచివాలయ సిబ్బందికి శిక్షణ



**పాలకొండ, మేజర్ న్యూస్ :** స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మరియు ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ గవర్నెన్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పాలకొండ మునిసిపాలిటీ పరిధిలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) రిసోర్స్ పర్సన్స్, పర్యావరణ కార్యదర్శులు, ప్రజారోగ్య కార్యదర్శులు, మేస్త్రీలు మరియు వివిధ విభాగాలకు చెందిన సచివాలయ సిబ్బందికి పాలకొండ నగర పంచాయతీ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఒక్కరోజు పూర్తిస్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మల్లీశ్వరి , మున్సిపల్ కమిషనర్ రత్న రాజు , మెప్మా డిపి కృష్ణా రావు మరియు పాలకొండ మునిపాలిటీ శానిటేషన్, వెల్ఫేర్, యమినిటీస్ కార్యదర్శులు మరియు మెప్మా, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.ఈ శిక్షణా కార్యక్రమంలో ఘన వ్యర్థాల నిర్వహణ, మూలంలోనే వ్యర్థాల వేర్పాటు (Source Segregation), డోర్–టు–డోర్ వ్యర్థాల సేకరణ, ప్లాస్టిక్ నిర్మూలన, ప్రజల భాగస్వామ్యం, శుభ్రత ప్రమాణాలు మరియు ముఖ్యంగా స్వచ్ఛ సర్వేక్షణలో పాలకొండ నగర ర్యాంకింగ్ మెరుగుపరచడం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాలకొండ మునిసిపల్ చైర్‌పర్సన్ మల్లీశ్వరి మాట్లాడుతూ, స్వచ్ఛ సర్వేక్షణ కేవలం ర్యాంకుల పోటీ మాత్రమే కాకుండా, పట్టణ పరిశుభ్రత, ప్రజారోగ్యం మరియు పౌరుల జీవన ప్రమాణాలను మెరుగుపరచే సమగ్ర కార్యక్రమమని తెలిపారు. ప్రతి కార్యదర్శి, రిసోర్స్ పర్సన్ తమ పరిధిలో చేపట్టే ప్రతి కార్యాచరణ Swachh Survekshan స్కోరింగ్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.

వ్యర్థాల వేర్పాటు, డోర్–టు–డోర్ సేకరణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, ఫీల్డ్ స్థాయి అమలు, సరైన డాక్యుమెంటేషన్ మరియు ప్రజల చైతన్యం వంటి అంశాలను ప్రాధాన్యతతో అమలు చేయాలని సూచించారు. సమష్టి కృషితో Swachh Survekshan లో ఉత్తమ ర్యాంకింగ్ సాధించాల్సిన బాధ్యత అందరిదేనని కమిషనర్ తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నాలెడ్జ్ పార్టనర్ ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ నుండి శిక్షకులుగా వెంకటేశ్వర్ రావు మరియు తిరుపతి రావు శిక్షణను ప్రారంభించిన ప్రతి ఉద్యోగి తమ సామర్థ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ, ఉత్తమ ఆచరణలను (Best Practices) అనుసరించి విధుల్లో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు Swachh Bharat లక్ష్యాల సాధనకు, అలాగే Swachh Survekshan లో మెరుగైన ర్యాంకింగ్ సాధించేందుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ బి.గణపతిమ్మ, AIILSG విజయవాడ టీం అజారుద్దీన్, సుధీర్ మరియు నవీన్ పాల్గొన్నారు.ఈ శిక్షణా కార్యక్రమాన్ని విజయవాడ నుండి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండి, ఆర్డిఎంఎ, సిడియమ్యే అధికారులు యూట్యూబ్ లైవ్ ద్వారా ప్రత్యక్ష పర్యవేక్షణ చేసి, Swachh Bharat-Swachh Andhra-Swachh పాలకొండ లక్ష్య సాధనకు అవసరమైన దిశా నిర్దేశం చేశారు.

# పార్టీ సమగ్ర సమాచారం కోసం మై టిడిపి యాప్

**– టిడిపి నాయకులు పెద్దింటి శ్రీధర్,యేగిరెడ్డి సింహాచలం**

**– కొత్తూరులో మై టిడిపి యాప్ పోస్టర్ ఆవిష్కరణ**



**గరుగుబిల్లి, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సమగ్ర సమాచారం కోసం నాయకులు, కార్యకర్తలు తెలుసుకునేందుకు వీలుగా పార్టీ అధిష్టానం రూపొందించిన మై టిడిపి యాప్ పోస్టర్‌ను మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్దింటి శ్రీధర్, యేగిరెడ్డి సింహాచ లంనాయుడులు ఆవిష్కరించారు. మై టిడిపి యాప్ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన డిజిటల్ వేదిక.ఈ యాప్ ద్వారా పార్టీ తాజా వార్తలు అప్ డేట్స్ నాయకులతో నేరుగా మాట్లాడే అవకాశం సభ్యత్వ నమోదుతో పాటు నాయకులు, కార్యకర్తలు గ్రీవెన్స్ వంటి సేవలను పొందే అవకాశం ఉంది.మై టిడిపి యాప్ పార్టీ కార్యకలాపాలను సుల భతరం చేసే డిజిటల్ గుర్తింపుగా పనిచేస్తుంది. ఈసందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్దింటి శ్రీధర్, యేగిరెడ్డి సింహాచలం నాయుడులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధిష్టానం రూపొందించిన మై టిడిపి యాప్ ద్వారా పార్టీకి సంబంధించిన తాజా వార్తలు మరియు సమాచారంను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.సభ్యత నమోదు ప్రక్రియలో భాగంగా ఈ యాప్ ద్వారా సులభంగా మెంబర్ షిప్ తీసుకోవచ్చని టిడిపి నాయకులు పెద్దింటి శ్రీధర్, యేగిరెడ్డి సింహాచలం నాయుడులు పేర్కొన్నారు. మై టిడిపి యాప్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నకిలీ సర్టిఫికెట్స్‌తో పని చేస్తున్న ఇరువురు ఉపాధ్యాయులను సర్వీస్ నుండి తొలగింపు : డిడి అన్నదొర

**సీతంపేట, మేజర్ న్యూస్ :** సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, సీతంపేట వారి ఆధీనంలో గల మినీ గురుకుల పాఠశాల (బాలికలు) కారిగూడలో, సిఆర్‌టి టీచర్స్‌గా పని చేస్తున్న శ్రీమతి నిమ్మల దులేంత్రిని, సిఆర్‌టి హిందీ & నిమ్మల శ్రీలక్ష్మి సిఆర్‌టి తెలుగు వారు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఝాన్సీలో గల బుందేల్ఖండ విశ్వవిద్యాలయం, నుండి పొందిన నకిలీ బిఈడీ సర్టిఫికెట్లుతో ప్రస్తుతం పని చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై ప్రాజెక్ట్ అధికారి ఐ.టి.డి.ఏ. సీతంపేట వారు విచారణ నిర్వహించారు. సంబందిత బిఈడీ సర్టిఫికెట్లు నకిలీవని బుందేలఖండ్ విశ్వవిద్యాలయంవారు అధికారికంగా నిర్ధారించ డంతో, శ్రీయుత ప్రాజెక్ట్ అధికారి, ఐ.టి.డి.ఏ., సీతంపేట వారు నిమ్మల దులేంత్రిని, ఎన్. శ్రీలక్ష్మి ఇద్దరినీ కాంట్రాక్ట్ సర్వీస్ నుండి తొలగించడం జరిగిందని డిడి అన్నదొర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## జేఈఈ మెయిన్స్ పాలకొండ విద్యార్థుల ప్రభంజనం



**పాలకొండ, మేజర్ న్యూస్ :** జాతీయ స్థాయి ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష 'జేఈఈ మెయిన్స్–2026' ఫలితాల్లో పాలకొండ ప్రాంత విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు.జాతీయ స్థాయిలో అత్యుత్తమ పర్సంటైల్ సాధించి పాలకొండ పేరును నిలబెట్టారు. పట్టణంలో నవోదయ నగర్ కు చెందిన లలితా ఆదిత్య 99.94 పర్సంటైల్తో అగ్ర స్థానంలో నిలిచాడు. తండ్రి రమేష్ ఉపాధ్యాయునిగా పని చేస్తుండగా, తల్లి లావణ్య గృహిణి. తల్లిదండ్రుల ప్రోత్సాహం, క్రమశిక్షణతో కూడిన చదువే తన విజయానికి కారణమని ఆదిత్య పేర్కొన్నాడు.అలాగే పట్టణం వడ్డాది వారి వీధికి చెందిన భాసూరు ప్రసాద్ (స్వామి), సరళ కుమారి కుమారుడు మణిధీరజ్ 99.867 పర్సంటైల్తో సత్తా చాటాడు. అత్యుత్తమ స్కోరు సాధించిన మణిధీరజ్ కు స్థానికులు, బంధుమిత్రులు అభినందనలతో ముంచెత్తారు. పట్టణంలోని గారమ్మకాలనీకి చెందిన గుమ్మడి మణి కంఠ 99.071 పర్సంటైల్ సాధించాడు. మణికంఠ వెన్నలవలస జవహర్ నవోద యలో పదో తరగతి వరకు, విశాఖలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదివాడు. తల్లిదండ్రులు జనార్ధన వ్యాపారస్తుడు కాగా, తల్లి సింధుకుమారి గృహిణి. కుమారుడి విజయంపై వారు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలోని మల్లివీడు గ్రామానికి చెందిన కోట రణధీర్ నాయుడు 99.036 పర్సంటైల్ పొందాడు. రణధీర్ నాయుడుది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు రాజు, ప్రశాంతి వ్యవసాయం చేస్తూ కుమారుడిని చదివిస్తున్నారు. రణధీర్ ప్రాథమిక విద్య రాజాం, విశాఖలో చదవగా, ఇంటర్ విజయవాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాడు. వీరందరిని పట్టణ ప్రజలు, నాయుకులు అభినందనలు తెలియజేశారు.

## జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన బొత్స పూర్ణచంద్

- బురధవెంకటాపురం గ్రామానికి చెందిన పూర్ణచంద్
- అభినందించిన సర్పంచ్ బొత్స లక్ష్మి, బొత్స శ్రీరాములు
- ఆనందం వ్యక్తం చేస్తున్న తల్లి దండ్రులు నారాయణస్వామి, సుజాతలు



**గరుగుబిల్లి, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** ఐఐటీ, ఎన్ఐటిల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన జేఈఈ మెయిన్ ఫలితాలలో మండల పరిధిలోని బురదవెంకటాపురం గ్రామానికి చెందిన బొత్స పూర్ణచంద్ సత్తా చాటారు. దేశవ్యాప్తంగా జాతీయ విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షలకు సంబంధించి విడుదల చేసిన ఫలితాలలో బురద వెంకటాపురం గ్రామానికి చెందిన బొత్స పూర్ణచంద్ 99.112 పర్సం టేజ్ తో రాణించాడు.విశాఖపట్నం లోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్ణచంద్ చదువుతు న్నాడు.పూర్ణచంద్ తండ్రి బొత్స నారాయణస్వామి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు,తల్లి బొత్స సుజాత గృహిణి.పూర్ణచంద్‌కు జేఈఈ మెయిన్స్ ఫలితాలలో 99.112 పర్సంటేజ్ రావడం పట్ల తమకు ఎంతో ఆనందంగా ఉందని తల్లిదండ్రులు నారాయణస్వామి, సుజాతలు పేర్కొన్నారు.ఐఐటి మరియు ఎన్ఐటీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన జేఈఈ మెయిన్ ఫలితాలలో బొత్స పూర్ణచంద్ 99.112 పర్సంటేజ్ సాధించడం పట్ల బురదవెంకటాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ బొత్స లక్ష్మి, బొత్స శ్రీరాములు తదితరులు అభినందించారు.

## ఎలక్ట్రిక్ వాహనాల టెక్నీషియన్ శిక్షణ

**సీతంపేట, మేజర్ న్యూస్ :** సీతంపేట వైటిసిలో శుక్రవారం నుండి ఎలక్ట్రికల్ వెహికల్ టెక్నీషియన్ శిక్షణను ప్రారంభించనున్నట్లు ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 30 రోజులపాటు శిక్షణలో ఇస్తామని, శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయము కల్పిస్తామన్నారు. ఐటిఐ, ఇంటర్ ఉత్తీర్ణులైన గిరిజన పురుష అభ్యర్థులు మాత్రమే ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన గిరిజన పురుష అభ్యర్థులు తమ పూర్తి లగేజీతో సీతంపేట వైటీసీకి హాజరుకావాలని పీవో తెలిపారు.

## ఘనంగా నులిపురుగులు నివారణ దినోత్సవం



**పార్వతీపురం, రూరల్ ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** మండల పరిధి లోని పెదబొండపల్లి, బంధలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పుట్టురు, యం ఆర్ నగరం, బాలగుడబ, అడ్డపుశీల తదితర గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన జాతీయ నులిపురు గుల నిర్మూలన దినోత్సవం కార్య క్రమంను వైద్యాధికారులు, చీకటి శంకరరావు, గులిపిల్లి ధరణి ఆధ్వర్యంలో ఆల్బండంజల్ మాత్రలు పంపిణీ చేసారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ నులిపురు గుల యొక్క దుష్పరిమానాలు, తది తర అంశాలనువివరించారు.కున్నారు.అనంతరం జాతీయ నులి పురుగుల దినోత్సవం కార్యక్రమం పిల్లల శారీరక మరియు మానసిక ఎదుగుదలకు నులిపు రుగులు ప్రధాన అద్దంకి అని వాటిని నిర్మూలించడం ద్వారానే ఆరోగ్యవం తమైన తరాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు.నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత ఏర్పడి చదువుపై ఏకాగ్రత తగ్గుతుందని ఈమాత్రలు వేయడం ద్వారా దానిని అరికట్ట వచ్చని వెల్లడించారు.ముఖ్యంగా బహిరంగ మలవిసర్జన మానుకోవా లని భోజనానికి ముందు తదుపరి చేతులను శుభ్రంగా కడుక్కోవడం వంటి చిన్నపాటి అలవాట్లు పెద్ద మార్పులు తెస్తాయని డాక్టర్ నర్సింగరావు సూచించారు.ఒకటి నుండి 19 ఏళ్ల లోపు పిల్లలకు మరియు విద్యార్థులకు,బడిబయట ఉన్న పిల్లలకు ఈమాత్రలు అందేలా వైద్య శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. బంధలుప్పి పరిధిలో 5183మంది పిల్లలు కు మాత్రలు వేయవలసి ఉండగా 5086 మందికి వేశమన్నారు.98.2%పూర్తి అయిందన్నారు.ఈకార్యక్రమంలో, పెదబొండపల్లి, బంధలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది యంపి హెచ్ఈఒ బి.శ్రీరాములు నాయుడు, గౌరజాణ శంకరరావు, హెచ్ఎస్ రామకృష్ణ, ఎయన్‌యంలు, ఆశ వర్కర్స్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో జోగింపేట 'స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్' విద్యార్థుల ప్రభంజనం

- అభినందించిన జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి - మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పిలుపు



**సీతానగరం, ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్ :** జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ ఫలితాల్లో జోగింపేటలోని ఏపీ గిరిజన సంక్షేమ రెసిడెన్సియల్ 'స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్' విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరచడం పట్ల జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఒకే పాఠశాల నుంచి ఏకంగా 22 మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో ప్రవేశానికి అర్హత సాధించడం విశేషమని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులు తమ ఉపాధ్యాయులతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్‌ను మంగళవారం ఆయన ఛాంబరులో మర్యాదపూర్వకంగా కలిశారు.విద్యార్థుల కృషిని, వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయ బృందాన్ని జేసీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఇంతటి ఘనత సాధించడం గర్వకారణమని ఆయన కొనియాడారు. భవిష్యత్తులో వీరంతా మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జేసీ ఆకాంక్షించారు. 37 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించగా, వారిలో 22 మంది విద్యార్థులు ప్రభంజనం సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ జెసీకి వివరించారు. ఇందులో ముగ్గురు విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటి)లలో సీట్లు సాధించే అవకాశం ఉందన్నారు. మిగిలిన విద్యార్థులకు వివిధ కేంద్ర విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు లభించనున్నాయని ప్రిన్సిపాల్ వెల్లడించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.ధర్మ రాజు మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కూడిన శిక్షణ, విద్యార్థుల పట్టుదల వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు. మా పాఠశాల నుంచి 22 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో రాణించడం ఎంతో సంతోషాన్నిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో వీరంతా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..

## ప్రాథమిక విద్య బలోపేతంతోనే హైస్కూల్ విద్య : ఉపవిద్యా శాఖాధికారి నారాయుడు



**సీతంపేట మేజర్ న్యూస్ :** దిగువ కారిమానుగూడ జిపిఎస్ పాఠశాలను ఐటీడీఏ ఉపవిద్యాసఖాధికారి పి.నారాయుడు మంగళవారం సందర్శించడమైనది సందర్శన సమయంలో భాషా వలంటీర్ సవర వెంకట్రావు హాజరులో ఉన్నారు. రెగ్యులర్ టీచర్ సెలవులో ఉన్నారు. 1వ తరగతి పిల్లలు అక్షరమాల చార్ట్‌లో అక్షరాలు గుర్తిస్తున్నారు. చిన్న చిన్న రెండు అక్షరాల పదాలు వాక్యాలు చదవడం రాయడం వచ్చేలా తీర్చిదిద్దాలి .ఎక్కువగా ఒకటో తరగతి విద్యార్థులకు ఓరల్ డ్రిల్లింగ్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయునికి సూచించడమైనది. హైస్కూల్ విద్య బాగుపడాలంటే ప్రాథమిక విద్య ఒక గాడిలో పడాలి దానికి అనుగుణంగా మీరు పని చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించడమైనది. 2వ తరగతి విద్యార్థులు తెలుగు చదవలేక పోతున్నారు. చతుర్విధ ప్రక్రియలు వచ్చే విధంగా చిన్న చిన్న కలపడాలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారం నేర్పించాలి అని సూచించడమైనది. బాత్రూంకి తలుపు లేదు. ఉన్న తలుపుని బాగు చేయించాలని సూచించడమైనది. లేవట్రి రూములో బేసిన్ నాసు పట్టి ఉంది. యాసిడ్ తెప్పించి ఆయాతో క్లీన్ చేయించవలసిందిగా సూచించడమైనది. జిఎఫ్ఎల్ఎన్ సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

### సీతానగరం, పెదంకాలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో

## నులిపురుగులు నివారణ టాబ్లెట్‌లు పంపిణీ



**సీతానగరం ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని సీతానగరం, పెదంకాలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పలు గ్రామాలతో పాటు పాఠశాలు. హాస్టల్స్ జాతీయ నులిపురు గుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమంను వైద్యాధికారులు పి.ఉషారాణి. శ్రీకాంత్. పావని ఆధ్వర్యంలో ఆల్బండంజల్ మాత్రలు పంపిణీ చేసారు.

ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ నులిపురు గుల యొక్క దుష్పరిమానాలు, తది తర అంశాలనువివరించారు. అనంతరం జాతీయ నులి పురుగుల దినోత్సవం కార్యక్రమం పిల్లల శారీరక మరియు మానసిక ఎదుగుదలకు నులిపు రుగులు ప్రధాన అద్దంకి అని వాటిని నిర్మూలించడం ద్వారానే ఆరోగ్యవం తమైన తరాన్ని నిర్మించగలమని నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత ఏర్పడి చదువుపై ఏకాగ్రత తగ్గుతుందని ఈమాత్రలు వేయడం ద్వారా దానిని అరికట్ట వచ్చని వెల్లడించారు.ముఖ్యంగా బహిరంగ మలవిసర్జన మానుకోవా లని భోజనానికి ముందు తదుపరి చేతులను శుభ్రంగా కడుక్కోవడం వంటి చిన్నపాటి అలవాట్లు పెద్ద మార్పులు తెస్తాయని సూచించారు. ఒకటి నుండి 19 ఏళ్ల లోపు పిల్లలకు మరియు విద్యార్థులకు,బడిబయట ఉన్న పిల్లలకు ఈమాత్రలు అందేలా తగు చర్యలు చేపట్టామని ఈవో సూర్యనారాయణ, యూడిసి మురళి, సిహెచ్ఓ ఎస్ వెంకటరమణ ఆశ వర్కర్స్, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ నులిపురుగుల నివారణ దినోత్సవం

**లక్కవరపుకోట ఫిబ్రవరి 17 (మేజర్ న్యూస్) :** ప్రపంచ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంను ఎల్ కోట జడ్పీ ఉన్నత పాఠశాల లో ఎల్ కోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎల్ కోట ఇన్చార్జ్ తహసిల్దార్ టీ రమేష్ ఎంఈఓ సిహెచ్ కూర్మా రావులు విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు నులిపురుగుల నివారణ నిమిత్తం ఆల్బెండజల్ టాబ్లెట్లు



తప్పనిసరిగా వేయాలని ఈ నులిపురుగులు శరీరంలో పెరిగిపోతే విద్యార్థులకు రక్తహీనత కడుపునొప్పి వంటి ఇబ్బందులు ఏర్పడి వారి శారీరక ఎదుగుదలకు ఆటంకం కలుగుతుందని అందుకే ప్రభుత్వం విద్యార్థులు చిన్నపిల్లలు అందరికీ ఉచితంగా ఈ ఆల్బెండజోల్ టాబ్లెట్లు పంపిణీ చేస్తుందని వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు మండలంలో 5725 మంది విద్యార్థులకు నులి పురుగుల నివారణ టాబ్లెట్లు సిబ్బంది ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు ఒకటి నుంచి రెండు సంవత్సరాల్లోపు పిల్లలకు అర మాత్ర మూడు సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల లో పిల్లలకు పూర్తి మాత్ర వేయవచ్చని ఈ టాబ్లెట్లు వేయడం వల్ల ఎటువంటి ఇబ్బందులు కలిగిన వెంటనే వైద్యుల్ని సంప్రదించాలని సూచించారు ఈ నులిపురుగుల నివారణ మాత్రలు హాస్పిటల్లో ఎప్పుడూ అందుబాటులో ఉంటాయని అవసరమైన విద్యార్థులు పిల్లలు వీటిని హాస్పిటల్ ద్వారా పొందవచ్చు అని తెలిపారు కార్యక్రమంలో హెచ్ఎం వేణుగోపాల్ ఎంపీడీఓ ఆఫీస్ ఏ ఓ దొర ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుధ్య లోపం

### - పట్టించుకోని అధికారులు



కోటబొమ్మాళి, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్: మండలం చిన్నసాన గ్రామంలో పారిశుధ్య లోపం కారణంగా ప్రధాన వీధి దుర్వాసనతో దుర్భరంగా మారింది. స్థానిక స్కూలు ఎదురుగా ఉన్న రహదారి పక్కన కాలువలను శుభ్రపరచకపోవడంతో చెత్త పేరుకుపోయి తీవ్ర దుర్వాసనతో వ్యాపిస్తోంది. ఎస్సీ వీధి పరిధిలో వాడుకలో ఉన్న బావి నుంచి వచ్చే నీరు సరిగా వెళ్లక కాలువల్లో నిల్వ ఉండడంతో పరిస్థితి మరింత విషమంగా మారింది. ఈ దుర్వాసన కారణంగా గ్రామస్తులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే మార్గం ద్వారా స్కూలుకు వెళ్లే విద్యార్థులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కాలువల్లో నిల్వ నీరు ఉండటంతో దోమలు పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు కూడా దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి కాలువలను శుభ్రపరిచి తగిన పారిశుధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డి వార్మింగ్ డే..



నరసన్నపేట, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్: నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం డి వార్మింగ్ డే సందర్భంగా విద్యార్థులకు ప్రిన్సిపల్ పెద్దాడ లత నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. వ్యక్తి ఆరోగ్యానికి పరిసరాల పరిశుభ్రత తో పాటు, శారీరక పరిశుభ్రత అవసరమని తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలను ప్రతి ఆరు నెలలకు ఒకసారి అందరూ మింగాలని విజ్ఞప్తి చేశారు. కలుషిత ఆహారము, అపరిశుభ్రత వల్ల క్రిములు వ్యాపించే ప్రమాదం ఉందని, తప్పనిసరిగా చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సబ్బుతో శుభ్రపరచుకోవాలని వైస్ ప్రిన్సిపల్ శాంతి హేమ్ సూచించారు. మహిళలు ముఖ్యంగా ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలని, వంట చేసే సమయంలో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులు భోజన సమయంలో పరిశుభ్రత పై శ్రద్ధ చూపాలని పలువురు అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కుమేయర్ ఘన స్వాగతం



విశాఖపట్నం, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్: విశాఖ వేదికగా నిర్వహించే ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ కోసం విశాఖపట్నం చేరుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కు విశాఖపట్నం ఐఎన్ఎస్ డేగాలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ తో కలిసి మంగళవారం నగర మేయర్ పీలా శ్రీనివాసరావు ఘన స్వాగతం పలికి పుష్ప గుచ్ఛాన్ని అందించారు.

# వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలి..

### - వీఆర్వోల నిరసన..



పోలాకి, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్: రాష్ట్ర వీఆర్వోల సంఘం పిలుపుమేరకు పోలాకి మండల రెవెన్యూ కార్యాలయం మంగళవారం వీఆర్వోలు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. వీఆర్వోలు పై పని ఒత్తిడి తగ్గించాలని నినదించారు. రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర సంఘం పిలుపుమేరకు వీఆర్వోలపై పని ఒత్తిడితో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వీఆర్వోలు, యాక్సిడెంట్లు పాలవడం, కొంతమంది ఆత్మహత్యలకు పాలవడంతో అధికారుల వైఖరిపై రాష్ట్ర సంఘంలో తీసుకున్న నిర్ణయం మేరకు మంగళవారం రాష్ట్రంలోని అన్ని తాహసిల్దార్స్ కార్యాలయాలవద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపడుతున్నాము. చనిపోయిన వీఆర్వోలకు సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబాలకు సంఘీభావంగా ఉంటామని తెలియజేస్తూ, రాష్ట్రంలో పనిచేస్తున్న వీఆర్వోలు ఎవరు కూడా ఆందోళన చెందవద్దు అని ఎవరు ఎటువంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం. మీకు అండగా ఉంటుందని తెలియజేయడానికి ఈ నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. రాష్ట్రస్థాయిలో, జిల్లా స్థాయిలో రెవిన్యూ, జి ఎస్ డబ్ల్యు ఎస్ అధికారులలో సమన్వయం లేకపోవడం వల్ల గ్రౌండ్ లెవెల్ పనిచేస్తున్న మా గ్రామ రెవెన్యూ అధికారులుతీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డిపార్ట్మెంట్ జాబ్ చార్ట్ ప్రకారం ఏ జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహించాలో కూడా స్పష్టత లేకుండా ఒకేసారి అన్ని విధులు చేయాలని ఒకపక్క రెవెన్యూ, మరోపక్క జీఎస్డబ్ల్యూఎస్ అధికారులు ఎవరికి వారు, వారు చెప్పిన పని చేయాలని ఒత్తిడి చేయడంతో చాలామంది వీఆర్వోలు తీవ్ర పని ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యలపై ఇప్పటికే మా రాష్ట్ర ఉన్నత అధికారుల దృష్టికి మా గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలు పరిష్కరించాలని తెలియజేసిన ఎటువంటి న్యాయం చేయలేదని అందువల్లనే రాష్ట్ర సంఘంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఆందోళన కార్యక్రమంలో భాగంగా జనవరి 12వ తేదీ నుండి వర్క్ టూ రూల్ అమలు చేయాలని రాష్ట్ర సంఘం నిర్ణయం మేరకు ఉన్నతాధికారులకు తెలియజేసి రాష్ట్ర వ్యాప్తంగా వర్క్ టూ రూల్ అమలు చేస్తూ ఉంటే కావాలని కొంతమంది అధికారులు షోకాజ్ నోటీసులు ఇవ్వడం బలవంతంగా రాత్రులు, పగలు టైం తో సంబంధం. లేకుండా సెలవు రోజులు, పండుగ రోజుల్లో, కూడా పనిచేయాలని ఒత్తిడి చేయడం జరుగుతుంది. ఈ విధంగా మా గ్రామ రెవెన్యూ అధికారులను ఇబ్బందులకు గురి చేస్తున్నందున, వర్క్ టూ రూల్ అమలు చేస్తామని అప్పటికి అధికారులు స్పందించకపోతే, రాష్ట్ర సంఘ నిర్ణయం మేరకు ఏ కార్యచరణకు పిలుపునిచ్చిన చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేస్తున్నాం. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి నెల ఒకటో తేదీన ఆదివారం, సెలవు రోజు, వస్తి ముందు రోజే పెన్షన్లు పంపిణీ కార్యక్రమం పెట్టడం తర్వాత సెలవు రోజున సెలవు తీసుకునే లాగా ముఖ్యమంత్రి గారే చెబుతూ ఉంటే రోజువారి విధులు సర్వేలు విషయంలో అధికారులు మాత్రం టైం తో సంబంధం లేకుండా రాత్రులు, పగలు, సెలవు రోజులు, పండుగ రోజుల్లో, కూడా విధులు చేయాలని ఒత్తిడి చేయడం చూస్తూ ఉంటే కావాలని ఉద్యోగులను కూటమి ప్రభుత్వానికి దూరం చేయడానికి కుట్ర జరుగుతుందని, అలాగే గత ప్రభుత్వంలో జరిగిన రీ సర్వేలో, పాస్ పుస్తకాలలో జరిగిన తప్పులు విషయంలో సరి చేయకుండా మరల అవే పుస్తకాలు ఇవ్వడం వల్ల రైతులకు ఉపయోగం లేదని మా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం, జనవరి 10వ తేదీన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే తప్పులు తడకలుగా ఉన్న పాస్ పుస్తకాలు పంపిణీ నిలుపుదల చేసి తప్పులను సరి చేసిన తర్వాతే రైతులకు ఇబ్బంది లేకుండా కొత్త పాస్ పుస్తకాలు రైతులకు ఇవ్వాలని ఒక మంచి ఆలోచనతో ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుని అధికారులను ఆదేశిస్తే ముఖ్యమంత్రి ఆశయాలు కూడా నెరవేరకుండా, వీఆర్వోలకు రైతుల నుండి సమాచారం తీసుకోవడానికి, తప్పులు సరి చేయడానికి, కావలసిన టైం ఇవ్వకుండా మరల అధికారులు గత ప్రభుత్వంలో జరిగిన తప్పుల్ని సరిగ్గా సరి చేయకుండా మరల మాతో తప్పులు చేయించి రైతులకు తప్పులు తడకలుగా పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తే రైతులు కూటమి ప్రభుత్వాన్ని కూడా విమర్శించడం జరుగుతుంది. వీఆర్వోలును కూడా దోషులుగా చూడడం జరుగుతుంది. అందువలన గ్రౌండ్ లెవెల్ లో ఉన్న వాస్తవ పరిస్థితులను తెలుసుకొని రీ సర్వే, మరియు రీ సర్వే జరిగిన గ్రామాల్లో పాస్ పుస్తకాలు కరెక్ట్ గా రైతులకు అందజేయాలంటే వీఆర్వోలకు, సర్వేర్లకు కావలసిన సమయం ఇచ్చే విధంగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని తెలియజేస్తున్నాముఅలాగే మా సమస్యలపై కూడా వెంటనే మాతో చర్చించి మా సమస్యలు పరిష్కారానికి కూడా కృషి చేయాలని ముఖ్యమంత్రి కోరుచున్నాము. కార్యక్రమంలో వీఆర్వోల సంఘం నాయకులు ప్రగడ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణ కార్యక్రమం విజయవంతం..

### - ప్రాథమిక ఆరోగ్య కేంద్ర విస్తరణ అధికారి, వ్యాధి పరిశోధకులు డాక్టర్ నల్లి రవికుమార్ - బి వాష్ యువర్ హాండ్స్ డెమో




పోలాకి, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్: ఆరోగ్యవంతమైన జీవన సరళికి నులిపురుగుల నివారణ ఎంతో దోహదపడుతుందని, అందుకోసం ప్రతి ఒక్కరు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పోలాకి ఆరోగ్య విస్తరణ అధికారి, మైక్రోబయాలజిస్ట్ డాక్టర్ నల్లి రవికుమార్ తెలిపారు. పిల్లలు ఆరోగ్యం మన భవిష్యత్తు కాబట్టి నులిపురుగులను ఆల్బెండజోల్ మాత్రల ద్వారా తరిమికొట్టాలని అన్నారు. ఫిబ్రవరి 17న పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డా. నల్లి రవికుమార్, ఆధ్వర్యంలో ఆల్బెండాజోల్ -- 400 మిల్లీగ్రాముల మాత్రలు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, నర్సింగ్, బీడీఎస్ మరియు పారామెడికల్ కళాశాలలతో పాటు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేయడమైనది. 1-2 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు 1/2 మాత్ర, 2-19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు 1 మాత్ర ఆల్బెండాజోల్ 400 మి.గ్రా మాత్రలను పంపిణీ చేసినట్లు ఈ సందర్భంగా తెలిపారు. 17వ తేదీకి గైర్హాజరు అయిన పిల్లలకు మరల 24/02/2026 తేదీన అదనపు పంపిణీ నిర్వహిస్తామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 14 సబ్ సెంటర్లలో 62 ప్రభుత్వ మరియు ప్రైవేట్ విద్యాసంస్థలలో పిల్లలకు మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. జూనియర్ కళాశాలలలో, ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో 65 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 68 68 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసామని తెలిపారు. 6898 మొత్తం లక్ష్యంగా 6878 మంది అనగా దాదాపు 98 శాతం మంది పిల్లలకు మాత్రలు వేయించామని వివరించారు. అల్బెండాజోల్ మాత్రలు వినియోగం ద్వారా ఎటువంటి దుష్ప్రభావాలు కలగలేదని ఈ సందర్భంగా వివరించారు. నులిపురుగుల నివారణకు సంబంధించి అవగాహన కల్పించే విధంగా ఏపీ మోడల్ స్కూల్ ఈదులవలసలో విద్యార్థులతో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ, పాఠశాలలు, కళాశాలలలో అధ్యాపక సిబ్బంది వైద్యారోగ్య శాఖ పర్యవేక్షణ సిబ్బంది సి హెచ్ ఓ లు ఏఎన్ఎం హెల్త్ అసిస్టెంట్లు అంగన్వాడి కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి

: డా.ఎస్.సునీత



**ఎల్ ఎన్ పేట, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** లక్ష్మీ నర్సు పేట గ్రామంలో లోని మోడల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రభుత్వం ఆదేశాలు మేరకు నేషనల్ డీ వార్మింగ్ డే(జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం)ను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్ డా. ఎస్.సునీత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత ను పాటించాలని మరియు చేతులు పరిశుభ్రత ను చేయు విధానం ను తెలియజేశారు. తదుపరి అల్బెండజోల్ మాత్రలను విద్యార్థి -విద్యార్థినీలు కు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్పర్సన్,బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి, గురు దేవా ఛారిటీ బుల్ ట్రస్ట్ ప్రతినిధి;దివ్యాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు, సక్షం జిల్లా కన్వీనర్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లయన్.ఎం.కె.మిత్రో, ప్రధానోపాధ్యాయులు బి.రమాదేవి,; హెల్త్ ఎడ్యుకేటర్ మేరీ సుశీల రాణి, హెల్త్ విజటర్ తవిటమ్మ; ఏ. ఎన్.ఎం.కె.రాజేశ్వరీ, హెల్త్ అసిస్టెంట్ ఉమాపతి, ఉపాధ్యాయులు పి.లక్ష్మణరావు;టి.ఉపేంద్ర, ఆశా కార్యకర్త కె.లక్ష్మీ మరియు విద్యార్థి -విద్యార్థినీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టి.వి. ద్వారా నేషనల్ డీ వార్మింగ్ గూర్చి విద్యార్థి -విద్యార్థినీలు కు చూపించారు మరియు డా.ఎస్.సునీత నేషనల్ డీ వార్మింగ్ డే గూర్చి వివరించారు.

## విద్యార్థుల్లో జ్వలించే కాంక్ష ఉండాలి

**- ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ - పద్మావతి జూనియర్ కళాశాలలో ఘనంగా ఫేర్వెల్ డే**




**నరసన్నపేట, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** విద్యార్థుల్లో నిరంతరం జ్వలించే కాంక్ష, సాధించాలనే సంకల్పం ఉంటే అనుకున్న లక్ష్యాలను చేరుకోవడం సులభతరమని ఈదులవలస ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ అన్నారు. మంగళవారం స్థానిక పద్మావతి జూనియర్ కళాశాల ఫేర్వెల్ డే కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ విద్యా విజ్ఞానంతో పాటు సామర్థ్యం, నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే యువతకు ఉజ్వల భవిత సుసాధ్యమన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. జీవితాలను విచ్ఛిన్నం చేసే డ్రగ్స్, మత్తు పదార్థాల పట్ల యువత జాగృత వహించి, మానవీయతా దృక్పథంతో తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. కళాశాల డైరక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎంతో శ్రమతో బిడ్డల ఉన్నతిని ఆకాంక్షించే తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా యువతీ యువకులు ముందడుగు వేసి ఉత్తములుగా ఎదగి సమాజ శ్రేయస్సులో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఈఎం నాయుడు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాసరావు ఆదర్శ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నీలం, విద్యార్థులు పాల్గొన్నారు.

## నులిపురుగుల మందులు వేసుకోవడం తప్పనిసరి



**మెలియాపుట్టి, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** పిల్లలకు నులి పురుగులు మందులు వేయడం తప్పనిసరి అని ఎంపీడీవో పి .నర్సింహ ప్రసాద్ అన్నారు. మంగళవారం మెలియాపుట్టి మండలంలోని కోసమాల, నడసంద్ర గ్రామాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీ వార్మింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అల్బండజోల్ మాత్రలు విద్యార్థులకు వేశారు. ఈ మాత్రాలలో వేసుకోవడం వలన విద్యార్థులకు భవిష్యత్తులో నులిపురుగులు సమస్యలు, ఎటువంటి వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. అలాగే ఈ దినము తప్పిపోయిన విద్యార్థులు ఈనెల 24వ తేదీన మరల మాత్రలు విద్యార్థులకు వేయబడుతుంది అన్నారు. ఈ కార్యక్రమములో ఎంఈఓ ఎస్.దేవేంద్రరావు, ప్రధానోపాధ్యాయురాలు నమిత సాహు ,భాస్కర మిత్రా, దివ్యశ్రీ ,ఎల్ .డిలేశ్వరరావు, టి పద్మావతి, మౌనిక, ఏఎన్ఎంలు,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నీలమణి దుర్గ అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



**పాతపట్నం, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** మంగళవారం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలోని వెలసియున్న నీలమణి దుర్గ అమ్మవారిని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. రెడ్డి శాంతి మాట్లాడుతూ "లోక కళ్యాణం కోసం, నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆ అమ్మవారిని ప్రార్థించానన్నారు. అమావాస్య వంటి పవిత్ర దినాన అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

## అభివృద్ధి చేయడంలో కూటమి ప్రభుత్వం ముందంజ



**మునగపాక, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన మునగపాక మండల తెలుగుదేశం పార్టీ ఆఫీసులో మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో నియోజకవర్గ టిడిపి పరిశీలకులు బోండా జగన్ మాట్లాడుతూ కోటమి ధర్మం పాటించాలని అందరూ సమన్వయం పాటించాలని అన్నారు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి కర్రీ సాయి కృష్ణ మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికలు అధిక స్థానాలను కైవసంచేసుకోవాలని అన్నారు, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలలోనికి కార్యకర్తలు విధిగా తీసుకెళ్లాలని, అన్నారు,, ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు గ్రామ శాఖ టిడిపి అధ్యక్షుడు దాడి శివ, మండల తెలుగు రైతు అధ్యక్షుడు మల్ల శేషు, క్లస్టర్ ఇంచార్జ్ కాండ్రేగుల శంకర్, యూనిట్ ఇంచార్జ్ ఆడారి జగన్నాథరావు, వాడ్రపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు ఆడారి బాలాజీ, ఆడారి యోగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ ఆన్స్ కాన్వెంట్ స్కూల్ లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం



**పాతపట్నం, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** 2000 మంది విద్యార్థులకు అల్బెండజోల్ పంపిణీ – ఆరోగ్య పరిరక్షణకు పాఠశాలల ముందడుగు.. పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పాతపట్నంలోని సెయింట్ ఆన్స్ కాన్వెంట్ స్కూల్‌లో విశేష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 2000 మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు స్వయంగా పర్యవేక్షిస్తూ విద్యార్థులతో మాత్రలను మింగించారు. నులిపురుగుల కారణంగా చిన్నారుల్లో రక్తహీనత, పోషకాహార లోపం, బరువు తగ్గడం, అలసట వంటి సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత లోపం, తాగునీటి సమస్యల కారణంగా ఈ సమస్య మరింత ఎక్కువగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో పాఠశాలల ద్వారా మాత్రల పంపిణీ చేయడం ద్వారా చిన్నారుల్లో ఈ సమస్యలను నియంత్రించవచ్చని ఆరోగ్య శాఖ భావిస్తోంది. ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రిన్సీ పాల్ మాట్లాడుతూ, నులిపురుగుల నివారణ ద్వారా విద్యార్థుల శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు వారి చదువుపై దృష్టి పెరుగుతుందని తెలిపారు. ఆరోగ్యవంతమైన పిల్లలే సమాజ భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం పాఠశాల స్థాయిలో విజయవంతంగా అమలవుతుండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సిపోడెంట్ సిస్టర్ లిమా జాన్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ సిస్టర్ థిస్ ఆన్, సిస్టర్ శాంతి, అకడమిక్ హెడ్ శర్మ సార్, కోఆర్డినేటర్ నిర్మలా పాణిగ్రహి, నీరజ, క్లాస్ టీచర్లు పాల్గొని సమిష్టిగా నిర్వహించారు. ప్రతి విద్యార్థికి మాత్ర అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, చిన్న వయసులోనే నులిపురుగుల నివారణ చేపడితే భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు గణనీయంగా తగ్గుతాయి. ప్రభుత్వం, పాఠశాలలు, తల్లిదండ్రులు కలిసి పనిచేస్తే పిల్లల్లో పోషకాహార లోపం తగ్గించి, ఆరోగ్యవంతమైన తరాన్ని తీర్చిదిద్దవచ్చని కార్యక్రమం ద్వారా స్పష్టమైంది.

## వైద్య సేవలపై జిల్లా టాస్క్ ఫోర్స్ సమీక్ష



**అచ్యుతాపురం, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** మాతా శిశు మరణాల నివారణలకు వైద్య సిబ్బంది కట్టుబడి పనిచేయాలని జిల్లా టాస్క్ ఫోర్స్ ప్రధాన అధికారిణి డా. జె. ప్రశాంతి ఆదేశించారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతలలో రక్తహీనత లేకుండా చూడాలని సూచించారు. టాస్క్ ఫోర్స్ బృందంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రామచంద్రరావు, డిపిఓ జగదీశ్, జనార్ధనతో కలిసి హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఖాజీపాలెం విలేజ్ హెల్త్ క్లినిక్ను సందర్శించారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. ఆర్సీహెచ్లో గర్భిణీలు, పిల్లల నమోదు లక్ష్యాలు సాధించాలి. చిన్న వయసులో గర్భిణీలు నమోదు కాకుండా చూడాలి. హై-రిస్క్ గర్భిణీలను గుర్తించి తగిన చికిత్స అందించాలి. ప్రతి ఒక్కరికి ఆభ ఐడీ ఉండేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. సంక్రమణ, అసంక్రమణ వ్యాధుల సర్వేలు, గర్భిణీలు-పిల్లల సేవల ఆన్లైన్ పోర్టల్ వివరాలు పరిశీలించారు. క్షేత్రస్థాయి వైద్య రికార్డులు ధృవీకరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఉ మామహేశ్, సిబ్బంది నాగజ్యోతి, శశికళ, నాగవరలక్ష్మి, ఆదిలక్ష్మి, జోత్స్న, నాగలక్ష్మి, గుణలక్ష్మి, పద్మ, జ్యోతి, లీల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# తప్పుడు చికిత్సతో ప్రాణం తీసిన బెహరా ఆసుపత్రి

**- స్థానిక పత్రికలను పంపిణీ చేసే కె .వెంకట్రావు మృతి -**

**డాక్టర్లు , యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమన్న బంధువులు**





**విశాఖపట్నం, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** స్థానిక పత్రికలను పంపిణీ చేసే కె .వెంకట్రావు(65) మృతికి గోపాలపట్నంలోని బెహరా ఆసుపత్రి డాక్టర్లు, యాజమాన్యమే కారణమని ఆయన కుమారుడు కె. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఘటనపై గోపాలపట్నం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైన నేపథ్యంలో కేజీహెచ్ మార్చ్యురికి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. మంగళవారం మార్చురీ వద్ద మీడియాతో మాట్లాడుతూ కాలుకు గాయమై ఆసుపత్రికి వస్తే ప్రాణం తీసారని శ్యాం ప్రసాద్ ఆరోపించారు. సంబంధిత డాక్టర్లు, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని , ఆసుపత్రిపై సమగ్ర దర్యాప్తు చేయాలనీ వెంకటరమణ చేశారు. వేపగుంట ప్రాంతంలో నివాసం ఉంటున్న కె .వెంకట్రావు స్థానిక పత్రికలను పంపిణీ చేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు శనివారం మధ్యాహ్నం ఆయన ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న సమయంలో బండి మీద నుండి జారీ పడిపోయారని తెలిపారు. దాంతో కాలికి గాయమై గోపాలపట్నంలో గల బెహరా ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్చామన్నారు. ఆర్థోపెడిక్ డాక్టర్ పరిశీలించి చిన్నపాటి ఆపరేషన్ అవసరమని చెప్పడంతో దానికి అంగీకరించామని తెలిపారు.సోమవారం మధ్యాహ్నం ఆపరేషన్ థియేటర్ కి తీసుకుని వెళ్లారని గంటలో డాక్టర్ బయటికి వచ్చి మత్తు మందు ఇచ్చామని దానికి ఆయన శరీరం సహకరించడం లేదని చెప్పారని వివరించారు. మరో గంటలో అతను చనిపోయారని చెప్పారన్నారు . కేవలం డాక్టర్ల తప్పుడు చికిత్స, హాస్పిటల్ యజమాని డాక్టర్ రవితేజ నిర్లక్ష్యం వల్లే వెంకట్రావు చనిపోయారని ఆరోపించారు. ఆపరేషన్ ముందు ఆయనకు అన్ని వైద్య పరీక్షలు చేశారని అంతా బాగుందని చెప్పారని తెలిపారు. మత్తుమందు (అనస్థీషియా)మోతాదుకు మించి ఇవ్వటం వల్లే చనిపోయి ఉంటారని భావిస్తున్నామని పేర్కొన్నారు. అసలు మత్తు ఇచ్చిన డాక్టర్ అనస్థీషియా డాక్టరో కాదో తేలాలన్నారు. చనిపోయిన వెంటనే తమకు చెప్పకుండా రెండు గంటలపాటు రహస్యంగా ఉంచారని పేర్కొన్నారు. ఇంత అన్యాయానికి గురైన తాము హాస్పిటల్ యజమాని డాక్టర్ బెహరా రవితేజను సంప్రదిస్తే తమ పట్ల దారుణంగా మాట్లాడారని వాపోయారు. దిక్కున వాడికి చెప్పుకోండి ..కేసు పెట్టుకోండి.. అంటూ దురుసుగా మాట్లాడుతూ, బెదిరింపులకు దిగారని తెలిపారు. మీడియాతో మాట్లాడిన వారిలో ఆయన బంధువులు ఉన్నారు.

## - గోపాలపట్నం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు

బెహరా ఆసుపత్రి యాజమాన్యం రాజకీయ పలుకుబడి కలగడంతో తొలుత పోలీసుల నుండి ఎలాంటి స్పందన రాలేదు. సోమవారం సాయంత్రం 5 గంటలకే గోపాలపట్నం పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన ఫిర్యాదు విషయంలో తాత్సారం చేయటంతో స్థానిక పత్రికల ప్రతినిధులు జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ , ఏసిపి లకు ఫిర్యాదు చేయడంతో గోపాలపట్నం పోలీసులు ఫిర్యాదు స్వీకరించి రాత్రి 11 గంటలకుకేసు నమోదు చేశారు. ఆ తర్వాత మృతదేహాన్ని బెహరా ఆసుపత్రి నుండి కేజీహెచ్ మార్చ్యురికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు . పోలీసు కమిషనర్ డా.శంక బ్రత బాగ్చి వెంటనే స్పందించి ప్రత్యేక డాక్టర్ల కమిటీతో పోస్టుమార్టం చేయాలని వైద్యాధికారులను కోరారు. దీంతో పోస్టుమార్టం కోసం ఫోరెన్సిక్, పెథాలజీ, అనస్థీషియా అనస్థీషియా , ఆర్థోపెడిక్ శాఖాధిపతులతో ఏర్పడిన ప్రత్యేక కమిటీ పోస్టుమార్టం చేశారు. బాధితులు, స్థానిక పత్రికల ప్రతినిధులు జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ దృష్టికి మంగళవారం తీసుకుని వెళ్లడంతో ఆయన స్పందించి బెహరా ఆసుపత్రిపై సమగ్ర దర్యాప్తు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

# ఫిబ్రవరి 20 నుండి మార్చి 16 వరకు ఏఎస్ఆర్ జిల్లాలో ఆదివాసీ సత్యాగ్రహ యాత్ర

**- ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఏసి వెల్లడి**



**హుకుంపేట, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయుటకు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదివాసులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలని నవంబర్ 9, 2025 నుండి ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఏసి చేపట్టిన ఆదివాసీ సత్యాగ్రహ యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా పోలవరం, ఏలూరు, మన్యం జిల్లాలలో పూర్తి చేసుకుంది. ఏఎస్ఆర్ జిల్లాలోని ఫిబ్రవరి 20 నుండి మొదలై మార్చి 16 పాడేరులో ముగియనున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఏసి జిల్లా చైర్మన్ రామారావు దొర, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అద్యక్షుడు మసాడ ఈశ్వర రావు లు సంయుక్త ప్రకటనలో మీడియాకు తెలిపారు. జిల్లాలోని ముంచంగిపుట్టు మండలం ప్రారంభమై ప్రతిమండలానికి రెండేసి రోజులు చొప్పున యాత్ర కొనసాగనుందని, ఈ యాత్రకు ఆయా మండలాలలో జెఏసికి సభ్య సంఘాలుగా ఉన్న ఆదివాసి విద్యార్థి, నిరుద్యోగ సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పక్షాలు ప్రత్యక్షంగా పాల్గోవాలని పిలుపునిచ్చారు. అలాగే "మార్చి 16 న పాడేరులో జరగనున్న "ఆదివాసి సత్యాగ్రహ యాత్ర" ముగింపు ర్యాలిలో యువత పెద్ద సంఖ్యలో పాల్గోవాలని, అనంతరం కొత్తకార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థి రేగం సూర్యప్రకాష్ మృతి

**- విద్యార్థి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించిన సియ్యారి దొన్ను దొర**



**హుకుంపేట, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** డిగ్రీ విద్యార్థి హుకుంపేట మండలం కొందిరాప గ్రామానికి చెందిన రేగం సూర్య ప్రకాష్ పార్థివదేహాన్ని తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ ఇన్చార్జ్, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర సందర్శించి నివాళులర్పించారు. సూర్య ప్రకాష్ పాడేరులో డిగ్రీ చదువుతున్నారు. హుకుంపేట మండలం గొందిరాప గ్రామానికి చెందిన రేగం సూర్య ప్రకాష్ పాడేరు డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. మహా శివరాత్రి సందర్భంగా మత్స్యగుండంలో మత్స్య లింగేశ్వర స్వామి వారిని దర్శించుకొని మిత్రులతో కలిసి వెళ్ళి తిరుగుప్రయణంలో ద్విచక్ర వాహనం మీద వస్తూ ప్రమాదానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయం తెలుసుకున్న సియ్యారి దొన్నుదొర సూర్య ప్రకాష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన అనంతరం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి మనోధైర్యం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట మండల క్లస్టర్ ఇన్చార్జి కుడేలి నూకరాజు, జన్ని మత్స్యరాజు, కో కన్వీనర్ పాడి సుమన్ , అసెంబ్లీ అధికార ప్రతినిధి పట్టెబోయినా శంకర్ నాయుడు, జనసేన మండల ప్రధాన కార్యదర్శి జన్ని లింగన్న, పాతకోట గ్రామ కమిటీ అధ్యక్షుడు కొర్ర నరసింగరావు, కొట్నపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు సాంబె బాబురావు, యూనిట్ ఇంచార్జి బోయిని చిన్నయ్య, సిరగం గ్రామ కమిటీ అధ్యక్షులు పూజారి మాణిక్యం, వార్డు నెంబర్ సాయి కిరణ్, స్తానిక సర్పంచ్ కొప్పుల లక్ష్మయ్య, గ్రామస్థులు రేగం కామరాజు టీచర్, రేగం సింహాద్రిబాబు టీచర్, రేగం కృష్ణ పంచాయితీ కార్యదర్శి , టీడీపీ నాయకులు కొండబాబు, అప్పారావు, టీడీపీ కార్యకర్తలు, జనసేన నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గూగుల్ డేటా సెంటర్ భూసేకరణ సంపూర్ణం

**- గంటా చొరవతో ముందుకొచ్చిన రైతులు**



**విశాఖపట్నం, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో గూగుల్ డేటా సెంటర్ కోసం చేస్తున్న భూసేకరణ పూర్తయ్యింది. ఇప్పటివరకూ భూమి ఇవ్వని దివ్యాంగుడైన రైతు గణేష్ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో మంగళవారం అంగీకార పత్రాలను మండల రెవిన్యూ అధికారులకు సమర్పించారు. అంతకుముందు భీమిలి బాలికల గురుకుల పాఠశాల కార్యక్రమంలో పాల్గొన్న గంటాను కలిశారు. ప్రభుత్వం నుంచి అదనంగా పరిహారం తెచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. శాలువా కప్పి ఆయనపై అభిమానాన్ని చాటుకుని తన 1.94 ఎకరాల అసైన్డ్ భూమి గూగుల్ డేటా సెంటర్ కోసం ఇస్తున్నట్టు చెప్పారు. విశాఖకు గ్రోత్ ఇంజన్ గా కానున్న గూగుల్ కు భూమి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నందుకు గణేష్ ను గంటా అభినందించారు. గూగుల్ డేటా సెంటర్ కోసం మొత్తం 308 ఎకరాలను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే.

## - వైసీపీ కుట్రలకు చెక్

ప్రభుత్వం ఇచ్చే పరిహారం కంటే ఎక్కువ ఇస్తామని వైసీపీ నాయకుల బినామీ ఒకరు రైతులను మభ్య పెట్టడంతో ప్రారంభంలో కొందరు ఆలోచనలో పడ్డారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ లు సీఎం విశాఖ వచ్చినప్పుడు పరిస్థితి వివరించి.. ఎకరా రూ. 17 లక్షలుగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ మార్కెట్ రేట్ స్థానంలో పరిహారాన్ని రూ. 20 లక్షలకు పెంచేలా చేశారు. ఎకరంలో 80 సెంట్ల భూమికి రెండున్నర రెట్ల పరిహారాన్ని, అంటే రూ.40 లక్షలు కాకుండా 20 సెంట్ల భూమి కూడా ఇస్తామని ప్రకటించారు. అలాగే ఇంటికో ఉద్యోగం, ఉపాధి కోసం షాపింగ్ కాంప్లెక్స్ లో ఒక షాపు, బంజరు భూముల అభివృద్ధి పథకం కింద సాగు చేస్తున్న 520 మంది రైతులకు 3 సెంట్ల నివేశన స్థలాలు ఇస్తామని చెప్పడంతో అధికశాతం మంది రైతులు భూములివ్వడానికి సుముఖత వ్యక్తం చేశారు. గంభీరంలో ఐఐఎం కోసం భూసేకరణ చేసినప్పుడు విద్యా శాఖ మంత్రిగా ఉన్న గంటా అత్యుత్తమ ప్యాకేజీ ఇచ్చారని పేర్కొంటూ తర్లువాడ మాజీ సర్పంచ్ మజ్జి వెంకట్రావు (వైసీపీ) భూములివ్వడానికి ముందుకు వచ్చారు. మొత్తం 51 మంది అసైనీలు కూడా భూములు ఇవ్వడానికి అంగీకరిస్తూ అధికారికంగా పత్రాలు ఇవ్వడంతో గూగుల్ డేటా సెంటర్ భూసేకరణ పూర్తయ్యిందని ఎమ్మార్వో ఎస్.శ్రీనుబాబు చెప్పారు. వచ్చే నెలలో శంకుస్థాపన చేసే అవకాశం ఉన్నందున ఎలాంటి వివాదాలు లేకుండా భూసేకరణ పూర్తి కావడం శుభపరిణామంగా గంటా పేర్కొన్నారు.

# గిరిజన గ్రామాల్లో పుట్టగొడుగుల పెంపకం

**- యువతకు ఉపాధి, ఆదాయం**



**హుకుంపేట, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** అల్లూరి జిల్లా పాడేరు లో"ఆదివాసీ మిత్ర సంస్థ"గిరిజన గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇస్తుంది. అతి తక్కువ ఖర్చు, తక్కువ స్థలంతోనే పోషక విలువలు అధికంగా ఉండే ఆయిస్టర్ మాష్రూమ్ ను సులభగా పెంచుకోవచ్చునని ట్రైనర్ మత్యరాజు చెప్పారు. ఈ పద్దతి ప్రారంభికులకు కూడా సులభంగా ఫలితాలు ఇస్తుందని, ప్రోటీన్లు, ఫైబర్, విటమిన్లు సమృద్ధిగా ఉండే ఈ పుట్టగొడుగులు ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా, కొద్దిపాటి పెట్టుబడితో అదనపు ఆదాయాన్ని కూడా అందిస్తుందని సంస్థ సీఇవో మన్మధరావు సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమాల్లో సంస్థ సిబ్బంది కూడా పాల్గొంటున్నారు.

# ఆంధ్రప్రదేశ్ దారితప్పిన సచివాలయ వ్యవస్థకు దిక్కేది?




**హుకుంపేట, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** ఉన్నత ఆశయాలు, ఉదాత్త లక్ష్యాలతో ఆంధ్రప్రదేశ్‌లో మొదలైన గ్రామ–వార్డు సచివాలయ వ్యవస్థ దారి తప్పింది. తాజా దుస్థితిని ఇలాగే అనుమతిస్తే ఆర్థిక భారంతో పాటు మరిన్ని విపరిణామాలకు దారి తీసే ప్రమాదముంది. లోతుగా సమీక్షించి, తప్పిదాలను వెంటనే సరిదిద్దితే తప్ప ఆశించిన ప్రయోజనాలు నెరవేరవు. సంకుచిత రాజకీయ దృష్టికోణంలో కాకుండా గ్రామస్వరాజ్య స్ఫూర్తితో సంస్కరణలు చేపట్టాలి. విస్తృత, ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి, సిఫారసులను నిజాయితీగా అమలు చేయాలి. పాలన వికేంద్రీకరణ, సేవల విస్తరణ, పథకాల్లో పారదర్శకత, సమస్యల పరిష్కారం అన్న బహుముఖ లక్ష్యాల సాధనకు ప్రజాస్వామ్య ప్రభుత్వం కట్టుబడాలి. గ్రామ–వార్డు సచివాలయ వ్యవస్థ పనితీరును తెలుసుకోవడం కోసం 'పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ" ఆంధ్రప్రదేశ్‌లో విస్తృత క్షేత్రస్థాయి సర్వేను నిర్వహించింది. ఇందులో భాగంగా ఉత్తరాన ఇచ్ఛాపురం నుంచి దక్షిణాన తడ వరకున్న గ్రామాలు, వార్డులను సంస్థ ప్రతినిధి బృందాలు కలయ తిరుగుతూ పరిశీలించాయి. సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు, సాధారణ పౌరులతో ప్రత్యక్షంగా మాట్లాడి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ విశ్లేషణ రూపొందింది. 2019 వేసవిలో, గాంధీజయంతి సందర్భంగా ప్రారంభమైన గ్రామ–వార్డు సచివాలయ వ్యవస్థ ఒక పరిపాలనా సంస్కరణ మాత్రమే కాదు సమూల మార్పుకు నాంది అని భావించారు. గ్రామ స్వరాజ్యాన్ని భారత ప్రజాస్వామ్యానికి ఆత్మగా చూసిన మహాత్మా గాంధీ ఆలోచనల నుంచి స్ఫూర్తి పొందిన ఈ వ్యవస్థ, వికేంద్రీకృత పాలనతో గ్రామ స్థాయిలోనే అన్ని సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పడింది.ప్రభుత్వ సేవలను చేరవేయడమే లక్ష్యం ప్రతి గడపకు బహుళ విభాగాల సిబ్బంది, వాలంటీర్లను పంపిచ్చి– సంక్షేమ పథకాలను, ముఖ్యంగా నాటి ప్రభుత్వం చేపట్టిన 'నవరత్నాల'ను పారదర్శకంగా అమలు చేయడం; సమస్యల్ని వేగంగా పరిష్కరించడం; 'గ్రామసభ' కేంద్రకంగా బాధ్యతాయుత పాలనను నిర్మించడం ప్రధాన ఉద్దేశ్యం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేదలు, భూమిలేని వారు, అట్టడుగు వర్గాల కోసం ఇది గౌరవం, సమానత్వం, న్యాయమనే వాగ్దానంగా కనిపించింది. కేరళ నమూనా నుంచి కొంత స్ఫూర్తి.. ప్రారంభ ప్రణాళిక సమగ్రంగా, మంచి ఉద్దేశ్యాలతో రూపొందింది. కేరళ పంచాయతీరాజ్ నమూనా నుంచి కొంత స్ఫూర్తి పొందిన ఈ వ్యవస్థలో మొదట ప్రతి సచివాలయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మల్టీపర్పస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌తో సహా 14 మంది సిబ్బంది ఉండాలని భావించినా, చివరికి 11 మందికి పరిమితం చేశారు. ఇంటింటికీ పెన్షన్లు అందించడం, ప్రజా సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సేకరించడం, పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి బాధ్యతలతో పాటు; నెలకు ఐదు వేల రూపాయల గౌరవ వేతనం పొందే వాలంటీర్లు ప్రజలకు– ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసేవారు. కేంద్ర పథకాలైన 14వ ఆర్థిక సంఘం నిధులు, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మౌలిక సదుపాయాల కల్పన జరగాల్సి ఉంది. రాజ్యాంగంలోని పదకొండో షెడ్యూల్‌లో పేర్కొన్న 29 అంశాలపై పంచాయతీరాజ్ సంస్థలకు అధికారం ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, ఆరు సంవత్సరాల తర్వాత ఈ ఆశావహ వ్యవస్థ కీలక మలుపు వద్ద నిలిచింది. 2025 డిసెంబర్ నుంచి 2026 జనవరి వరకు నిర్వహించిన ఫీల్డ్ సర్వే ప్రకారం, ఈ వ్యవస్థ తన ప్రాథమిక లక్ష్యాల నుంచి దూరమైందని స్పష్టమౌతోంది. ప్రజల ఆశలతో ప్రారంభమైన కార్యక్రమం క్రమంగా నిర్లక్ష్యం, అసమర్థత, నిరుత్సాహం, అమలు స్తబ్ధత వైపు జారిపోతోంది. ఎక్కువగా పేరుకే పరిమితమౌతోన్న వికేంద్రీకరణ.. పంచాయతీరాజ్ సంస్థలతో కలిసి పనిచేయాల్సిన సచివాలయాలు అనేక చోట్ల సమాంతర వ్యవస్థలుగా మారి; ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యుల పాత్రను తగ్గిస్తున్నాయి. "ఈ వ్యవస్థలో మా స్థానం ఏంటి?" అని మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, గ్రామ సర్పంచులు ప్రశ్నిస్తున్నారు. సచివాలయ సిబ్బంది గ్రామ సభలకు హాజరు కావాలని, అభివృద్ధి ప్రణాళికల్లో భాగస్వామ్యం కావాలని, వార్షిక–అయిదేళ్ల కార్యాచరణ రూపొందించాలని ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు అమలులో కనిపించడంలేదు. దీంతో ప్రజాప్రతినిధులు అమలు ప్రక్రియ నుంచి వేరుపడుతున్నారు. ఈ వ్యవస్థలో మానవ వనరుల నిర్వహణ వ్యయం మరింత ఆందోళన కలిగిస్తోంది. రెగ్యులరైజేషన్ తర్వాత లక్షా పది వేల మందికి పైగా ఉద్యోగులున్నారు. వారిలో చాలామంది డిగ్రీలు, పీజీలతో పాటు సోషల్ వర్క్‌లో మాస్టర్స్, పీహెచ్‌డీలు చేసిన ఉన్నత విద్యావంతులు. అయినప్పటికీ పాఠశాల మరుగుదొడ్ల ఫోటోలు తీయడం, వైన్ షాపులకు జియో ట్యాగింగ్ చేయడంవంటి పనులు అప్పగించడంతో తమ ప్రతిభ వృధా అవుతోందని వారు భావిస్తున్నారు.స్వాతంత్ర్యాన్ని మరింత దెబ్బతీస్తున్న జోక్యం.. 2024లో తదనంతరం వాలంటీర్ వ్యవస్థ ఉన్నపళంగా రద్దవడంతో ఇంటింటికీ సేవలు అందించే బాధ్యతలు, ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న సిబ్బందిపై పడిపోయాయి. వారానికి 48 గంటలకు మించి పని, దూరప్రాంతాల్లో ఫేషియల్ రికగ్నిషన్ హాజరు సమస్యలు, జీతం కోతల భయం, ప్రమోషన్లు–ఇంక్రిమెంట్లు లేకపోవడం ఇలాంటివి ఉద్యోగుల్లో ఆందోళన పెంచుతున్నాయి. యునైటెడ్ ఫ్యామిలీ కార్డ్ అప్‌డేట్లు, బయోమెట్రిక్ ధృవీకరణలు, ఈ–కేవైసీ, కుటుంబ వలసల ట్రాకింగ్‌వంటి అంతులేని సర్వేలు ప్రధాన సేవలను పక్కకు నెడుతున్నాయి. "పర్యవేక్షకులు చాలామంది ఉన్నారు, కానీ నిజమైన మార్గదర్శకత్వం లేదు" అని సిబ్బంది వాపోతున్నారు. నియంత్రణ–నిర్వహణ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉంది. లైన్ అధికారుల ఒత్తిడి, రాజకీయ జోక్యం స్వాతంత్ర్యాన్ని మరింత దెబ్బతీస్తున్నాయి. ఉద్యోగులపై నిరంతర ఒత్తిడి వారి మానసిక, శారీరక ఆరోగ్య సంక్షోభానికి దారితీస్తోంది. సుమారు పది మంది సచివాలయ ఉద్యోగుల ఆత్మహత్యల్లో, ఆకస్మిక మరణాలో 2025లోనే నమోదయ్యాయి. మొత్తంగా 61 మంది చనిపోయినట్టు ధృవీకరణ. తమను రాత్రి విధుల నుంచి మినహాయించాలని, ప్రమోషన్ అవకాశాలు కావాలని మహిళా పోలీసు అసిస్టెంట్లు కోరుతున్నారు. సర్వేయర్లు ఆధునిక పరికరాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అనేక విభాగాల బాధ్యతలు చేపట్టి, నాణ్యత లోపాల పేరుతో మెమోలు, సస్పెన్షన్లు ఎదుర్కొంటున్నారు. ప్రజల ఇబ్బందులు.. సంక్షేమ కార్యదర్శులు తమ నైపుణ్యానికి సంబంధించిన పనులకంటే ఇతర సర్వేలకు మళ్లించబడుతున్నారు. అంతిమంగా ఆ ప్రభావం ప్రజలపైనే పడుతోంది. 72 గంటల్లో సమస్య పరిష్కారం అనే లక్ష్యం కడకొక ఆశగానే మిగులుతోంది. సచివాలయాలు సమస్యలను పరిష్కరించే కేంద్రాల కంటే దరఖాస్తులు స్వీకరించే కౌంటర్లుగా మారుతున్నాయనే అభిప్రాయం వినిపిస్తోంది. సర్టిఫికెట్లు, భూ సర్వేలు, సబ్సిడీలు, పథకాల కోసం ఆలస్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతూ జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్ లేదా ముఖ్యమంత్రి ప్రజా దర్బార్‌ను ఆశ్రయిస్తున్నారు. ప్రత్యేకించి గిరిజన ప్రాంతాల్లో సచివాలయాల పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు దత్తత తీసుకున్న పెదలబుడు గ్రామంలో సిబ్బంది హాజరు లోపం, 15 లక్షల రూపాయలతో నిర్మించిన లైబ్రరీ వినియోగం లేకపోవడం, కనెక్టివిటీ సమస్యలు ప్రజల్లో నిరాశను పెంచుతున్నాయి. వాలంటీర్ వ్యవస్థ లేకపోవడంతో ఇంటికి వచ్చే పెన్షన్ల కోసమో, ఇతర అవసరాలకో పౌరులు ఇప్పుడు కార్యాలయాలకు వెళ్లాల్సి రావడం వారి నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. ఆర్థికంగా కూడా ఈ వ్యవస్థ "తెల్ల ఏనుగు"గా మారుతోందనే విమర్శలున్నాయి. జీతాలు, అలవెన్సులు, నిర్వహణ ఖర్చులు వేల కోట్లు అయినప్పటికీ ఫలితాలు ఆ నిష్పత్తిలో కనిపించడం లేదు. జనాభా ఆధారంగా పంచాయతీల వర్గీకరణ జరుగుతున్నా, అధిక సిబ్బందిని సరైన విభాగాలకు మళ్లించాల్సిన అవసరం ఉంది.రాజకీయాలకు అతీతంగా తక్షణ చర్యలు అవసరం.. పబ్లిక్ వర్క్స్, రెవెన్యూ, సామాజిక సంక్షేమవంటి విభాగాల్లో ఖాళీలకు అనుగుణంగా నైపుణ్యాల మ్యాపింగ్, శిక్షణ ద్వారా ఉద్యోగుల సేవల్ని సమర్థంగా పునర్వినియోగం చేయవచ్చు. ఈ పరిస్థితికి మూల కారణాలు ప్రారంభ దశలో పైలట్ పరీక్షలు లేకపోవడం, సమన్వయ లోపం, 2024 తర్వాత తీసుకున్న మార్పులకు సమగ్ర వ్యూహం లేకపోవడమే! వరుస ప్రభుత్వాలు బాధ్యత నుంచి తప్పించుకోజాలవు. ఒకటి లోపభూయిష్ట అమలయితే మరొకటి స్పష్టతలేని సవరణలు. ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా తక్షణ చర్య అవసరం. కనీసం పదవీ విరమణ చేసిన చీఫ్ సెక్రటరీ స్థాయి అధికారి అధ్యక్షతన అన్ని పార్టీల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాలు, పౌర సమాజం సభ్యులతో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలి. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలి. సచివాలయాలను పంచాయతీరాజ్ సంస్థలతో పూర్తిగా అనుసంధానించి గ్రామ సభలకు సంయుక్త బాధ్యత కల్పించాలి. పర్యవేక్షణ, నివేదిక వ్యవస్థలను స్పష్టంగా నిర్వచించాలి. సర్వవిధ కుటుంబ డేటాతో సమగ్ర సర్వే విధానం అమలు చేయాలి. పాఠశాలల పర్యవేక్షణకు ప్రత్యేక విద్యా సహాయకులను నియమించాలి. ప్రతి కార్యాలయానికి కనీస సౌకర్యాలు కల్పించాలి; గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక నమూనాలు రూపొందించాలి. రాజకీయ ప్రభావం లేకుండా పరిమిత స్థాయిలో వాలంటీర్లను పునరుద్ధరించాలి. జనాభా ఆధారంగా సిబ్బంది పునర్వ్యవస్థీకరణ చేసి, అధిక సిబ్బందిని ఇతర విభాగాలకు మళ్లించాలి. ఉద్యోగుల డిమాండ్లైన సౌకర్యవంతమైన పని వేళలు, గోప్యమైన మానసిక ఆరోగ్య సలహాలు, ప్రమోషన్ మార్గాలు, ఆధునిక పరికరాలు, భద్రతా ప్రమాణాలను అమలు చేయాలి. ఈ వ్యవస్థను పునరుజ్జీవింపజేయడం పరిపాలనా అవసరం మాత్రమే కాదు! పాలనా వికేంద్రీకరణతో పాటు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, సామాజిక న్యాయానికి ఇదెంతో కీలకం. ఆధారపూర్వక, సమగ్ర సంస్కరణలతో గ్రామ స్వరాజ్య వాగ్దానాన్ని తిరిగి సాధించవచ్చు. శక్తివంతమైన గ్రామాలు, పారదర్శక సంక్షేమం, ప్రతి పౌరుడికి గౌరవప్రదమైన జీవితం. గాంధీజీ చెప్పినట్లే, నిజమైన స్వాతంత్ర్యం గ్రామ పునాదుల నుంచి మొదలవుతుంది. సవ్యమైన 'సచివాలయ వ్యవస్థ' ద్వారా మాత్రమే ఎన్నికైన ప్రభుత్వం ప్రజలకు కట్టుబడే ప్రజాస్వామ్యం వస్తుంది.

---

# విశాఖలో 72 గంటల డ్రోన్ నిషేధం

**– ఐఎఫ్ఆర్–మిలాన్ – ఐయాన్స్ ప్రధానుల సదస్సు నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు – ఐఎన్ఎస్ దేగా నుంచి పార్క్ హోటల్ వరకు ఐదు కిలోమీటర్ల పరిధిలో తాత్కాలిక రెడ్ జోన్ అమలు – నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు – సీపీ శంఖబ్రత బాగ్చి హెచ్చరిక**




Flying/operating of drones in the peripheral area within 5 kms radius roundings of enroute from **INS Dega to Park Hotel, Visakhapatnam** is hereby **ROHIBITED** for a period of 3 days (72 hours) with effect from 0600 hrs on .02.2026 to 0600 hrs on 20.02.2026. If any person/drone operator is found lating the orders, they will be liable for punishment under the Aircraft Act, 1934.

**విశాఖ క్రైం, ఫిబ్రవరి 17, మేజర్‌న్యూస్:** విశాఖ నగరంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబడుతున్న ఐఎఫ్ఆర్--మిలాన్-- యాన్స్ ప్రధాన సదస్సుల నేపథ్యంలో నగర పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. నగర పరిధిలో డ్రోన్ కెమెరాల వినియోగంపై తాత్కాలిక నిషేధాన్ని అమలు చేస్తున్నట్లు సీపీ శంఖబ్రత బాగ్చి ప్రకటించారు.ఈనెల 17-02-2026 ఉదయం 6 గంటల నుంచి 20-02-2026 ఉదయం 6 గంటల వరకు మొత్తం 72 గంటలపాటు "తాత్కాలిక రెడ్ జోన్" అమల్లో ఉంటుందని తెలిపారు. ఈ నిషేధం ఐఎన్ఎస్ దేగ నుంచి పార్క్ హోటల్ వరకు సుమారు ఐదు కిలోమీటర్ల పరిధిలో వర్తించనుంది.ఈ ప్రాంతంలో ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రోన్ కెమెరాలు ఎగరవేయరాదని, ఫోటోలు లేదా వీడియోలు చిత్రీకరించరాదని స్పష్టం చేశారు. భద్రతా దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలు జరగనున్నందున దేశ విదేశాల నుంచి ప్రతినిధులు, నౌకాదళ ప్రధానులు పాల్గొననున్న నేపథ్యంలో అప్రమత్తత అవసరమని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు, ఫోటోగ్రాఫర్లు, ఈవెంట్ నిర్వాహకులు పోలీసుల సూచనలను కచ్చితంగా పాటించి నగర భద్రతకు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. విశాఖలో జరుగుతున్న ఈ మహత్తర నౌకాదళ వేడుకలకు నగరం సన్నద్ధమవుతున్న వేళ, భద్రతా పరంగా ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సూర్య
బుధవారం18 ఫిబ్రవరి 2026

# ఖనిజాభివృద్ధి సంస్థ నివేదికపై ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి




**అరకులోయ,ఫిబ్రవరి17, మేజర్ న్యూస్:**అల్లూరి సీతారామరాజు జిల్లా,పాడేరు ఏజెన్సీ పరిధిలోని అరకు,చింతపల్లి అటవీ ప్రాంతం ఆరు బ్లాక్ లో నిక్షిప్తమై ఉన్న 615 మిలియన్ టన్నుల బాక్సైట్ ను వెలికితీసే అధికారం కల్పించాలని,లేదా వేలం వేసే అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ కోరుతూ సమర్పించిన నివేదికపై ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు.బాలదేవ్ మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు,జీవన విధానం, పర్యావరణానికి హాని తలపెట్టే రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ నివేదికను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.గత 20 ఏళ్లుగా ఆదివాసీలు,గిరిజన సంఘాలు,రాజకీయ పార్టీలు, గిరిజన స్వచ్ఛంద సంస్థల నిర్వాహకుల పోరాటాల ఫలితంగా బాక్సైట్ నిక్షేపాల తవ్వకాల జీఓలను గత ప్రభుత్వాలు రద్దు చేశాయని ఆయన చెప్పారు. అయినప్పటికీ ఆన్ రాక్,రస్ ఆల్ ఖైమా వంటి బడా కార్పొరేట్ సంస్థలతో చేసుకున్న అక్రమ ఒప్పందాలను మాత్రం రద్దు చేయలేదని,ఆన్ రాక్ కంపెనీ అత్యున్నత న్యాయస్థానాలైన హైకోర్టు,సుప్రీంకోర్టులలో దాఖలు చేసిన పిటిషన్లకు ఊరట లభించకపోవడంతో లండన్ ఆర్బిటేషన్ కోర్టులో వాజ్యం దాఖలు చేసిందని ఆయన తెలిపారు.2026వ సంవత్సరం మార్చి 26వ తేదీన విచారణ జరగనున్న నేపథ్యంలో బాక్సైట్ ఖనిజ సంపద వెలికితీత అంశం మరొకసారి తెరపైకి వచ్చిందన్నారు.మరో జన్మ ఉంటే ఆదివాసీ ప్రాంతంలో పుడతానని ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివాసీ ప్రాంతాన్ని విధ్వంసం చేసే బాక్సైట్ అక్రమ ఒప్పందాలను ఖనిజాభివృద్ధి సంస్థకు ఇచ్చిన నివేదికను వెంటనే రద్దు చేయాలని, ఆదివాసులకు జలసమాధి చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టు అక్రమ ఒప్పందాలు జారీచేసిన జీఓలు 2,13,51 సైతం రద్దు చేయాలని అల్లూరి జిల్లా ఆదివాసీ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మైనింగ్ విధానంలో పెను మార్పులు చేసిన ఫలితంగా ఏజెన్సీ ప్రాంతాల్లో అపారమైన సహజవనరులు బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు బాక్సైట్ తవ్వకాలు జరపాలని వేలం పాటలు వేసే అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఖనిజాభివృద్ధి సంస్థ నివేదిక ఇచ్చిందని,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసుల హక్కులు, చట్టాలను ఉల్లంఘించి,పర్యావరణానికి తీవ్ర హాని కలిగించే ఆదివాసుల జీవనం ధ్వంసం చేస్తున్న బాక్సైట్ తవ్వకాల కుట్రను ఆదివాసీ ప్రజలు తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆర్గానిక్ కాఫీ తోటలు బాక్సైట్ నిక్షిప్తమై ఉన్న కొండల్లోనే ఉన్నాయని, బాక్సైట్ తవ్వకాలు జరిగితే ఆదివాసి జీవన విధానంతో పాటు కాఫీ తోటలు,పంట పొలాలు విధ్వంసం అవుతాయని ఆయన చెప్పారు.ఈ మేరకు తక్షణమే ఖనిజాభివృద్ధి సంస్థ ఇచ్చిన నివేదికను రద్దుచేసి, బాక్సైట్ అన్రాక్ కంపెనీతో చేసుకున్న పాత ఒప్పందాలను సైతం రద్దు చేయాలని రాష్ట్ర కూటమి ప్రభుత్వానికి ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేస్తుందని ఆయన తెలిపారు.లేనిపక్షంలో చైనా క్లే,హైడ్రో పోరాటం తరహాలో మరో బాక్సైట్ పోరాటాలు కొనసాగిస్తామని రాష్ట్ర కూటమి ప్రభుత్వానికి పొద్దు.బాలదేవ్ హెచ్చరించారు.విలేకరుల సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సివేరి.కొండలరావు, అల్లూరి జిల్లా నాయకుడు సత్యనారాయణ,హైడ్రో పవర్ ప్రాజెక్టు కమిటీ కన్వీనర్లు, మాజీ ఎంపీటీసీ దశరద్, సురేష్,కృష్ణంరాజు,నోబో, పెసా కమిటీ సభ్యులు సోనియా,సురేష్ కుమార్, బాలరాజు,శ్రీరామ్,మనోజ్, మధు,సింహాద్రి,చిన్న వన్న్య తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో మంచి ఆయుష్ష మందులు



**డుంబ్రిగుడ, ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్:-** స్థానిక మండల కేంద్రంలోని ఆయుస్సు వైద్యశాలలు మంచి మందులు అందుబాటులో ఉన్నాయని వైద్య నిపుణులు విజయ్ భాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సాధారణ వ్యాధులతో పాటు కిడ్నీ సంబంధిత, గ్యాస్ట్రబుల్, మహిళల వ్యక్తిగత వ్యాధులు, మలబద్ధకం, కీళ్ల నొప్పుల వంటి వ్యాదులకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కేరళ రాష్ట్రం నుంచి రాష్ట్రానికి ఆయా వ్యాధుల సంగ్రమణకు సంబంధించి మందులు ఆసుపత్రిలో ఉన్నాయన్నారు. ఆయా వ్యాధులకు గురైన గిరిజనులు ఆసుపత్రిలో సందర్శించి వైద్యం పొందాలని ఆయన కోరారు.

## ధైర్యంగా పరీక్షలు రాయండి



**డుంబ్రిగుడ, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్:** – పరీక్షలు అంటే ఎటువంటి భయం , బిడికి లేకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ సుమన్ కుమార్ సింగ్ విద్యార్థులకు సూచించారు. స్థానిక పాఠశాల నుంచి సీబీఎస్ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు గుర్తింపు కార్డులతో పాటు వాటార్ బాటిల్, ఇతర సామాగ్రిలను ఆయన అందజేశారు. ఖచ్చితమైన ప్రణాళికతో పరీక్షకు హాజరైతే ఉత్తమ ఫలితాలు సాధ్యపడతాయని ఆయన విద్యార్థులకు మనోధైర్యాన్ని ఆయన నింపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నులి పురుగుల నివారణ మందులు పంపిణీ



**డుంబ్రిగుడ, ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్:**-మండలంలో నులి పురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. బాలికల ఆశ్రమ పాఠశాలలో నులి పురుగుల మందుల నివారణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో ప్రేమ్ సాగర్ మాట్లాడుతూ నులి పురుగుల వల్ల ఎదుగదలతో మానసిక సమస్యలు తలెత్తుతాయని అన్నారు. 19 ఏళ్లలోపు బాల, బాలికలు అందరూ మందులను వేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. వైద్యాధికారిణి అంభిక, పీహెచ్ఎన్ విజయరత్న కుమారి, ఆరోగ్య సహాయకులు స్వామి, ఎంఎలెచ్పీ శీరిష ఏఎన్ఎం ఉమా, కార్యకర్త మేరి తదితరులు పాల్గొన్నారు.

## సుచ్ఛ రథంతో చెత్తని నిత్యవసర సరుకులుగా మార్చండి



**రణస్థలం, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్:** రణస్థలం పంచాయతీలో చెత్త నుండి మంచిని తయారు చేయాలి చెత్త నుండి జీవన విధానం పెంచే విధంగా నిత్యవసర సరుకులను ప్రతి పంచాయతీ నుంచి ప్రజలకు హాని చేసే చెత్తను సేకరించడం దాని నుండి మంచిని పెంచే విధంగా నిత్యవసర సరుకులు అందించడం ఎంతో ప్రజలకు ఆనందాయకంగా ఉందని పంచాయతీ ప్రజలందరూ ఎక్కువగా మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. వారి నుండి చెత్తను తీసుకొని వారికి కావలసిన నిత్యవసర సరుకులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ మురళి, ఎక్స్ సర్పంచ్ మహాదశ రమణయ్య, ఎంపీటీసీ మజ్జి వెంకటరమణ, గుడిపాటి ప్రదీప్, గుడిపాటి రామారావు, శంకరు, రమణ, కోటి సచివాలయం సిబ్బంది శ్రీను వార్డ్ నెంబర్ వెంకట్రావు గోవిందు మహిళలు యువత యూత్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అబలాసింగి స్కూల్ భవనం నిర్మించండి




**కొత్తూరు ఫిబ్రవరి 17(మేజర్ న్యూస్ ):**కొత్తూరు మండలం అడ్డంగి పంచాయితీ అబలాసింగి పాఠశాల భవనాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ వై జోగారావు కు యస్ యఫ్ ఐ జిల్లా అధ్యక్షులు డి చందు, సహాయ కార్యదర్శి యస్ చిన్నారావు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ ఆరు గిరిజన గ్రామాలకు అబలాసింగి పాఠశాల ఒక్కటేనని, ఆ పాఠశాల కు కూడ పిల్లలు చదువుకోడానికి భవనం తో సహా రోడ్డు సదుపాయం లేదని వారు తెలియ జేశారు. అడ్డంగి పంచాయితీ గిరిపుత్రులకు విద్య ఎండ మావిగా ఉందని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని కూటమి ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తున్న గిరిపుత్రుల భవిష్యత్తు కోసం పాఠశాల భవనం కట్టలేని దుస్థితి ప్రభుత్వం ఉందని అన్నారు. పాఠశాల భవనం నిర్మాణం కోసం 2012 లో నిధులు మంజూరు చేసిన నేటివరకు కార్యరూపం దాల్చలేదంటే పాలకులు ఎంత దౌరభాగ్య పరిస్థితుల్లో ఉన్నారో అర్థమౌతుంది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు కల్పన కోసం ప్రశ్నించే పాలకులు, అధికార్లు లేకపోవడం తో అబలాసింగి పాఠశాల ప్రస్తుతం రేకుల షెడ్డు పశువులు పాకలో పాఠశాల నడుస్తుండడం సిగ్గుచేటు. పేద బడుగు వర్గాల కు చెందిన విద్యార్థుల కోసం వంద రోజుల పండగ అంటూ మెగా పేరెంట్స్ మీటింగులు పెట్టి ఊకదంపుడు ప్రసంగాలు తప్పు విద్యా శాఖ మంత్రి కి పాఠశాల భవనం కు నిధులు మంజూరు చేయాలన్న ఆలోచన లేకపోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు.తక్షణమే ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి భవనం నిర్మించాలని అబలాసింగి గిరిజనులు కోరుతున్నారు.

## అన్ని రంగాలు ప్రజలు హర్షించే బడ్జెట్



**కోటబొమ్మాళి, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలు హర్షించదగ్గదని రాష్ట్ర కళింగ వైశ్య కార్పోరేషన్చైర్మన్ బోయిన గోవిందరాజులు అన్నారు. ఆయన మంగళవారం స్థానిక ఎన్టీఆర్ భవనంలో విలేకర్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ. 3.32.205 కోట్లుతో భారీ బడ్జెట్ ప్రవేశపెట్టడం సంతృప్తికరమని అన్నారు. మహిళా, పరిశ్రమ, చేనేత రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని, ముఖ్యంగా వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత కల్పించటం జరిగిందన్నారు. వంశదార, అసోర్సు రిజర్వయర్లుతోపాటు ఎత్తిపోతల పథకాల నిధుల కేటాయింతో ఆ రంగానికి ఇచ్చిన ప్రాధన్యానత అని అన్నారు. డిజిటల్ విప్లవంలో చంద్రబాబునాయుడుతే కీలకప్రాతయని బిల్గేట్ కితాబు ఇవ్వడం ఆనందదాయకం అన్నారు. అలాగే జిల్లాలోని కోస్టల్ కార్డెర్లో మత్స్యకారుల జీవితాలు మెరుగుపడతాయన్నారు. ముఖ్యంగా అక్వా రంగాల ఎగుమతులు సుంకాలు తగ్గాయన్నారు. దాని వల్ల రైంతాగానికి తగిన ఆర్థిక పరిపుష్టి కలుగుతుందన్నారు. బిల్గేట్స్ వంటి దిగ్గజం ముఖ్యమంత్రికి అభినందించారని, ఆయన రాక రాష్ట్రానికి శుభ పరిణామన్నారు. టెక్కలిలో 50 పడకల అయుష్ అసుపత్రి నిర్మాణానికి రూ. 15కోట్లుతో నిర్మించునందుకు ఉత్తర్వులు జారీ చేయటం హర్షనీయమన్నారు. దీనికి ప్రధాన కారణమై కేంద్రపౌరవిమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషి వల్ల మూలపేట పోర్టుతో టెక్కలి ప్రత్యేకత అంతరించుకుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశం నేతలు నంబాళ శ్రీనివాస్, సాసుమంతు ఆనందరావు, కోరాడ గోవిందరావు, కె. గోవిందరావు, పట్ట సింహాచలం, దేవాది సింహాద్రమ్మ , క్రిష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నలుపురుగుల వ్యాధిల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



**కోటబొమ్మాళి, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్:** పిల్లలు నలుపురుగుల వల్ల ప్రబలే వ్యాధిల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో కె. ఫణీంద్రకుమార్ అన్నారు. ఆయన మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవ పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఢి వార్మింగ్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను నలుపురుగుల వ్యాధి భారిన పడకుండా చూసుకోవాల్సిన బాద్యత తల్లిదండ్రులు పైన, వైద్య సిబ్బంది పైన ఉందని అన్నారు. 2 నుంచి 5 సంవత్సరాల గల పిల్లల తల్లిదండ్రులు అంగన్వాడీ కేంద్రాలకు తీసుకువెళ్లాలని, ఐదు సంవత్సరాలు పై బడి 19 సంవత్సరాలు వయస్సు గల పిల్లలకు పాఠశాలలకు, కళాశాలలో నులిపురుగుల మాత్రలు వేయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నితీస్, ఎంఈవో 2 డి. గోవిందరావు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాక్సైట్ వెలికితీత ఆలోచన విరమించాలి



**అరకులోయ,ఫిబ్రవరి17, మేజర్ న్యూస్:**అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు,అనంతగిరి, చింతపల్లి ప్రాంతంలో నిక్షిప్తమై ఉన్న బాక్సైట్ ఖనిజ సంపద తవ్వకాల ఆలోచనను విరమించాలని రాష్ట్ర కూటమి ప్రభుత్వాన్ని ఆదివాసులు డిమాండ్ చేశారు.బాక్సైట్ నిక్షేపాల తవ్వకాల అంశం మరో మారు తెరపైకి రావడంతో గిరిజనులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ పరిధిలోగల బాక్సైట్ ప్రభావిత గ్రామాల గిరిజనులు దాబుగుడ గ్రామంలో నిరసన ప్రదర్శన చేపట్టి నినాదాలు చేశారు. సుంకరమెట్ట పంచాయతీ సర్పంచ్ గెమ్మెల.చిన్నబాబు, సిపిఎం అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వి. ఉమామహేశ్వరరావుతో కలిసి ఆదివాసీలు సాంప్రదాయ ఆయుధాలతో నిరసన తెలియజేశారు. బాక్సైట్ తవ్వితే ఊరుకునేది లేదని, బాక్సైట్ జోలికి వస్తే తరిమి తరిమి కొడతామని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసులను ఉద్దేశించి సిపిఎం నాయకుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల క్రితం బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున జరిపిన పోరాటానికి తలగ్గిన అప్పటి ప్రభుత్వం బాక్సైట్ వెలికితీతకు అనుమతి ఇచ్చిన జీవోలు రద్దు చేసిందన్నారు.మరోసారి రాష్ట్ర కూటమి ప్రభుత్వం తవ్వకాలు జరిపేందుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతంలో ఉన్న సహజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నారని,దీనిలో భాగంగానే అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న ఆదానికి హైడ్రో పవర్ ప్రాజెక్టు కట్టబెట్టినట్టు ఆయన తెలిపారు. దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు జరుగుతున్నాయన్నారు. జరుగుతున్నాయని తెలిపారు.5వ షెడ్యూల్ ఉన్న ప్రాంతం 1/70 చట్టం,పిసా చట్టం,అటవీ హక్కుల చట్టం అమల్లో ఉన్న చట్టాన్ని ఉల్లంఘించి ప్రభుత్వాలు సహజ సంపదను ప్రైవేట్ వ్యక్తులకు దారదత్తం చేస్తున్నారని ఆయన విమర్శించారు.బాక్సైట్ తవ్వకాల ఆలోచనలను తక్షణమే వెనక్కి తీసుకోకపోతే మరోసారి గిరిజన ప్రాంతంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు జరుగుతాయని కూటమి ప్రభుత్వాన్ని ఉమామహేశ్వరరావు హెచ్చరించారు.

## రీ సర్వే, మ్యుటేషన్స్, ఆర్ ఓ ఆర్ సంబంధిత పెండింగ్ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి



**- జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్**

**పాడేరు, మేజర్ న్యూస్ ఫిబ్రవరి 17:**తహసీల్దార్ లాగిన్ లో పెండింగ్ లో ఉన్నటువంటి రీ సర్వే సమస్యలను గడువు లోగా పూర్తి చెయ్యాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి రెవెన్యూ సంబంధిత సమస్యలపై వర్చువల్ గా అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాల రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల రెవెన్యూ అధికారులు పరిష్కారం కాని పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను సరియైన పరిశీలన చేసి పరిష్కారం కొరకు ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ లాగిన్ కి పంపించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యలను పరిష్కరించుటకు మండల రెవెన్యూ అధికారులు, రెవెన్యూ గ్రామాలలో షెడ్యూల్ ప్రకారం అవగాహనా సదస్సులు నిర్వహించాలని, రీ సర్వే,మ్యుటేషన్స్,ఆర్ వో ఆర్ సంబంధిత అంశాలపై ఆ గ్రామాలలో పరిష్కరించిన సమస్యలను ప్రజలకు వివరించి ఐవిఆర్ఎస్ కాల్స్ లో సంతృప్తి స్థాయిలను పెంచాలన్నారు. పిజిఆర్ఎస్ రీ ఓపెన్ అయిన దరఖాస్తులను క్షేత్ర స్థాయి లో అధికారులు పర్యవేక్షణ చేసి పరిష్కరించాలన్నారు. ప్రతి నెల ఒకటో తేదీ ఉదయం 7 గంటల నుండి జిల్లాలో ఉన్న చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ వేగవంతం చేయాలన్నారు. రేషన్ పంపిణీలో వచ్చే సాంకేతిక సమస్యలను అధిగమించాలన్నారు. రేషన్ పంపిణీ కి సంబంధించి ఐవిఆర్ఎస్ కాల్స్ లో ప్రజల యొక్క సంతృప్తి స్థాయి పెంచాలన్నారు. తప్పులు లేని పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయాలని పాసు పుస్తకాలలో దొర్లిన తప్పులను సవరించాలన్నారు. మండల రెవెన్యూ అధికారులు వారంలో ఒకరోజు మండల రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించుకోవాలని, ఈ సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల్లో పరిష్కారం కాని రెవెన్యూ సమస్యలపై చర్చించి పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయో ఐవిఆర్ఎస్ ద్వారా తీసుకునే ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లా సంతృప్తి శాతం పెంచే విధంగా లబ్ధిదారులతో మాట్లాడి అవగాహన కల్పించాలన్నారు. ఓటర్లను సంబంధిత పోలింగ్ కేంద్రంతో మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో చేపట్టబోయే రీ,రీ సర్వే ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించుటకు మండల స్థాయిలో ఉన్న రెవెన్యూ సిబ్బందికి విడతల వారీగా శిక్షణలు ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పీవో తిరుమాని శ్రీ పూజ, రంపచోడవరం పివో స్మరణ్ రాజ్, చింతూరు ఇంచార్జ్ పివో శుభం శుభం నొక్వాల్, పాడేరు ఇంచార్జ్ డిఆర్ఓ అంబేద్కర్, పాడేరు ఇంచార్జ్ ఆర్డీవో ఎంవీఎస్ లోకేశ్వరరావు, వివిధ మండలాల రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారిగా గంటా సుధాకర్ నియామకము



**పాడేరు, మేజర్ న్యూస్ ఫిబ్రవరి 17:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఎండీ ఉత్తర్వులు మేరకు పోలవరం ఇంచార్జ్ కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ వారిని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కలెక్టరేట్ కార్యాలయం నందు మర్యాదపూర్వకముగా కలిసి నియామిక పత్రాలను జిల్లా కలెక్టర్ వారికి సమర్పించారు. గంటా సుధాకర్ వారు గతంలో కోనసీమ, బాపట్ల, ఏలూరు, తూర్పుగోదావరి, జిల్లాలలో నైపుణ్యా అభివృద్ధి అధికారిగా, ఏపీఎస్ఎస్ డిసిలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ గా పనిచేసి పోలవరం జిల్లాకు నూతన అధికారిగా నియమితులయ్యారు.

## పింఛన్ పంపిణీలో అలసత్వం వహించరాదు



ఏ ఎస్ ఆర్ జిల్లా (పాడేరు), మేజర్ న్యూస్ ఫిబ్రవరి 17: పింఛన్ పంపిణీలో అలసత్వం వహించిన, అవకతవకలు జరిగినట్లు తెలిసిన ఎంతటి అధికారికైనా సరే శాఖపరమైన చర్యలు తప్పవని, పింఛన్ పంపిణీ లో ఐవిఆర్ఎస్ ద్వారా వచ్చే కాల్స్ లో లబ్దిదారులకు ఏ విధమైన ప్రశ్నకు సంతృప్తి చెందితే సమాధానంగా ఏ బటన్ ప్రెస్ చెయ్యాలో(నొక్కలో) తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లా అధికారులతో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో ఆయన మాట్లాడుతూ స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు విభాగాల ద్వారా ప్రజలకు ఏయే సేవలు అందుతున్నాయో గ్రామ సభలు ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. మండల అభివృద్ధి అధికారులు, గ్రామ స్థాయిలో ప్రభుత్వ సేవలపై స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు విభాగాల సిబ్బందికి వర్క్ షాప్ లు నిర్వహించాలన్నారు. పెన్షన్ పంపిణీ అధికారులు పెన్షన్ పంపిణీ ఆనంతరం మిగిలిన సొమ్మును ప్రభుత్వానికి జమ చేయని, లేని యెడల క్రమశిక్షణా చర్యలు, క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాబోయే వేసవి కాలంలో గ్రామాలలో నీటి యెద్దడి సమస్య తలెత్తకుండా ముందు గానే ప్రణాళికలు తయారు చేసుకోవాలనీ ఆర్ డబ్ల్యూ ఎస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.హర్ ఘర్ జల్ లో భాగంగా జల్ జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో త్రాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. త్రాగునీరు సరఫరా జరిగే ప్రాంతాలకు నీటి యొక్క పరిమాణము, నాణ్యతను ల్యాబ్ అసిస్టెంట్ ల ద్వారా పరీక్షలు నిర్వహించి తద్వారా నీటిని సరఫరా చేయాలని, త్రాగునీరు నాణ్యతా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షిస్తుండాలన్నారు. అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలోనూ, ప్రభుత్వ పాఠశాలల నందు త్రాగు నీటి నమూనాలను పరీక్షించాలనీ,పరిసరాలను పరిశుభ్రముగా ఉంచాలనీ, వాడుక నీటిని భూమి లోకి ఇంకే విధముగా ఇంకుడు గుంతలను నిర్మించాలన్నారు. జిల్లాలో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాట్లుకు యువతను ప్రోత్సహించి వేగవంతం చేయాలి. పీఎంఈజిపి ద్వారా నిరుద్యోగ, యువతీ, యువకులకు శిక్షణలు ఇప్పించి ఉపాధి భృతి కల్పించాలన్నారు. అరకు ప్లాటెడ్ కాంప్లెక్స్ , చింతపల్లి, ఏటుపల్లి లలో ఎంఎస్ఎమ్ఈ పార్క్ ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, పూర్తి అయిన పార్క్ లలో వ్యాపారాలు ప్రారంభించే విదంగా స్థానిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా మూడు ఐటిడిఏ ల పరిధిలో పెద్ద యెత్తున జాబ్ మేళాలు నిర్వహించి స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. జిల్లా లో ఉన్న అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో, ప్రభుత్వ పాఠశాలలో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతకు, అధిక ప్రాధాన్యతనిస్తూ ఆహారం కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. మార్గదర్శిలు ఎక్కువ బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఐ గాట్ కర్మయోగి పథకం ద్వారా పెద్ద ఎత్తున నిరుద్యోగ యువతి,యువకులు రిజిస్ట్రేషన్ చేసి వారికి నైపుణ్య శిక్షణ ఇప్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, పాడేరు ఐటిడిఏ పివో తిరుమాని శ్రీ పూజ, రంపచోడవరం పివో స్మరన్ రాజ్, చింతూరు ఇంచార్జ్ పివో శుభం నొక్వాల్, జడ్ పి సీఈఓ నారాయణ మూర్తి, డిఆర్డిఏ పిడీ వి. మురళి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈ ఈ నాగేశ్వరరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్ వి రమణా రావు, డిఎల్ పిఓ పిఎస్ కుమార్ మండల ప్రత్యేక అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, వివిధ శాఖల అధికారులు ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే

## నులిపురుగుల మాత్రలు తప్పనిసరి తీసుకోవాలి



(పాడేరు) మేజర్ న్యూస్ ఫిబ్రవరి : 17.పిల్లల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం " అల్బెండజోల్ " మాత్రలతో నులిపురుగుల నిర్మూలన మాత్రాలను గుత్తులపుట్టు ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం ప్రారంభించి, పిల్లలకు నుస్పురుగుల మాత్రలను మింగించిన జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ . జిల్లాలో 97.85% లక్ష్యం పూర్తి చేసి, ఫిబ్రవరి 24న మాప్-అప్ డే అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా పిల్లల ఆరోగ్య పరిరక్షణే మనందరి బాధ్యత.మంగళవారం ఉదయం 'జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవాన్ని' ఘనంగా నిర్వహించారు. పాడేరు మండలం, గుత్తులపుట్టులోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ స్వయంగా పాల్గొని విద్యార్థులకు " అల్బెండజోల్ " మాత్రలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2 నుండి 19 ఏళ్ల వయస్సు గల విద్యార్థులందరూ తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్ర వేసుకోవాలని పిలుపునిచ్చారు. నులిపురుగుల వల్ల కలిగే రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వాంతులు వంటి సమస్యలను ఈ మాత్రలతో నివారించవచ్చునాని,ఈ మాత్రల వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవని, ఒకవేళ చిన్నపాటి అసౌకర్యం కలిగినా తక్షణమే సహాయం అందించేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఎండలు పెరుగుతున్న దృష్ట్యా విద్యార్థులు, ప్రజలు తరచూ మంచి ఎక్కువగా నీరు త్రాగి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. కృష్ణమూర్తి నాయక్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 3,26,910 మంది పిల్లలను అర్హులుగా గుర్తించగా, మొదటి రోజే 3,19,881 మందికి (97.85%) మాత్రలు పంపిణీ చేశామని తెలిపారు. ఈరోజు మాత్రలు వేసుకోలేకపోయిన విద్యార్థుల కోసం ఫిబ్రవరి 24న 'మాప్-అప్ డే' (వీశీజూ-బజూ ఋఖఎ) నిర్వహిస్తున్నామని, ఆ రోజుతో 100% లక్ష్యాన్ని పూర్తి చేస్తామని కలెక్టర్ ప్రకటించారు.ఈ కార్యక్రమంలో జోనల్ మలేరియా అధికారి డాక్టర్ ప్రభావతి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రతాప్, ప్రోగ్రాం మేనేజర్ ఏగిరెడ్డి కిషోర్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వైద్య సిబ్బంది విద్యార్థులు పి.హెహ్.సి వైద్య సిబ్బంది ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా డిగ్రీ కళాశాలలో రోడ్డు సేఫ్టీ పై అవేర్నెస్

**- సబ్జెక్ట్:ఏ ఆర్ కె త్రీ,ఫోటో రైట్ అప్,అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చలపతిరావు**



**అరకులోయ,ఫిబ్రవరి17, మేజర్ న్యూస్:**అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు.కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి. చలపతిరావు ఆధ్వర్యంలో నేషనల్ రోడ్డు సేఫ్టీ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్ ) పర్యవేక్షణలో రోడ్డు సేఫ్టీ అవేర్నెస్ ప్రోగ్రాం ఏర్పాటయింది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి. చలపతిరావు మాట్లాడుతూ రహదారి భద్రత అందరి బాధ్యత అన్నారు.వాహనాలపై ప్రయాణిస్తున్నప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆయన చెప్పారు.ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నప్పుడు హెల్మెట్ ను ధరించాలని,మద్యం సేవించి వాహనం నడపకూడదని,సీట్ బెల్ట్ ధరించాలని,మొబైల్ ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేయకూడదని,మితిమీరిన వేగంతో ప్రయాణించరాదని విద్యార్థులకు ఆయన సూచించారు.సేఫ్ డ్రైవ్,సేవ్ లైఫ్ అనే నినాదంతో ప్రిన్సిపాల్ ప్రసంగించి విద్యార్థులందరికీ రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ సుభాన్, డాక్టర్ పి.బలరాం,డాక్టర్ సిహెచ్.మురళీకృష్ణ,డికెవి ఎస్.ప్రణీత,కెమిస్ట్రీ అధ్యాపకులు పి.శోభన్,పిడి జ్యోతి,సిహెచ్.రక్షితరాణి, అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## 22న మారేపల్లిలో అభయాంజనేయ స్వామి ఆలయ శిఖర, విగ్రహ ప్రతిష్ట



**దేవరాపల్లి, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్** : మండలంలోని మారేపల్లి గ్రామంలో అభయాంజనేయ స్వామి నూతన ఆలయ శిఖర, విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అభయాంజనేయ స్వామి శిఖర, విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలకు మాడుగుల నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తికి ఆహ్వానం అందజేశారు. ఈ ఆలయ శిఖర, విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలో భాగంగా అదే రోజు మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం, తప్పిడగుళ్ళు, చిడతలు, చిటికెలు, పలు రకాల సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి భక్తులు యావన్మంది తరలివచ్చి స్వామివారిని దర్శించి, ప్రసాదం స్వీకరించాలని వారు ఆకాంక్షించారు.

## నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

**దేవరాపల్లి, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్**: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు



దేవరాపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారిణి ఈ. పూజ్య మేఘన డి వార్మింగ్ మాత్రలను విద్యార్థులకు మింగించారు. అనంతరం విద్యార్థులను సమావేశపరిచి భోజనంకు ముందు విద్యార్థులు శుభ్రముగా చేతులు కడుక్కోవాలని, ఆరోగ్య నియమాలు ఎలా పాటించాలి అన్న విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలు వేచలం పిహెచ్సి వైద్య అధికారిని శకుంతల ఈ డి వార్మింగ్ మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమాలలో ఎంపీడీవో ఎం.వి సువర్ణరాజు, డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్, సిహెచ్ఓ ఆనంద్, పిహెచ్ఎన్ అప్పల నరసమ్మ, హెల్త్ సూపర్వైజర్ జీకే పుష్పరాజ్, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పరిశుభ్రత పై ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలి



**దేవరాపల్లి, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్** : గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, అప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో ఎం వి సువర్ణరాజు అన్నారు. మండలంలోని ముషిడిపల్లి పంచాయతీలో మంగళవారం ఆయన పర్యటించారు. గ్రామంలో పారిశుధ్యం, డ్రైనేజీల పరిస్థితిని పరిశీలించారు. మధ్యలో నిలిచిపోయిన ఎస్డబ్ల్యూపీసీ షెడ్ (సంపద కేంద్రం) నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి సింగంపల్లి సురేష్‌ను ఆదేశించారు. హరిత రాయబారులు వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సోమిరెడ్డి గోవింద, స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ త్రినాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### జాతీయ నులిపురుగు దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు టాబ్లెట్స్ వేసిన డాక్టర్ ప్రశాంతి



**నర్సీపట్నం ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్:**జాతీయ నులిపురుగు దినోత్సవం సందర్భంగా అనకాపల్లి జిల్లా డిపిఎమ్ఓ డాక్టర్ ప్రశాంతి బలిఘట్టం గ్రామంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాల సందర్శించడం అయినది ఈ సందర్భంగా పిల్లలందరూ ఈరోజు ఆల్బెండజోళ్ళు మాత్రలు మింగాలని పరిసరాలు పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత మరియు చేతులు కడుక్కోడంలో ప్రయోజనాలు తెలియజేశారు .ఇక ఈ కార్యక్రమంలో బలిఘట్టం పీహెచ్సీ డాక్టర్ మాధుర్య మరియు డిప్యూటీ డిహెచ్ ఎం ఓ ఆఫీస్ సిబ్బంది రమణబాబు పాల్గొన్నారు

# మహిళా ఉద్యోగుల భద్రతే లక్ష్యం

## అచ్యుతాపురం 'బ్రాండిక్స్'లో భారీ అవగాహన సదస్సు



**అచ్చుతాపురం అనకాపల్లి (అచ్యుతాపురం), ఫిబ్రవరి 17:మేజర్ న్యూస్:**పరిశ్రమల్లో పనిచేసే మహిళా ఉద్యోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, వారి రక్షణే జిల్లా పోలీసు యంత్రాంగం తొలి ప్రాధాన్యత అని అధికారులు స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపీఎస్ ఆదేశాల మేరకు, లిఅచ్యుతాపురం బ్రాండిక్స్ కంపెనీ లోని యూనిట్ 2 లో మహిళా ఉద్యోగులకు చట్టాలు, రక్షణ, మార్గాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీ ఈ.శ్రీనివాసులు గారి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ ఎస్సై పి.రాములమ్మ పాల్గొని కీలక సూచనలు చేశారు.అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు రక్షణ కవచంలా పనిచేసే 'శక్తి' యాప్‌ను ప్రతి మహిళా ఉద్యోగి మొబైల్‌లో ఉండాలని అధికారులు సూచించారు. ఒక్క బటన్ నొక్కితే నిమిషాల్లో పోలీసు సహాయం అందుతుందని వివరించారు.ప్రస్తుత డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం, ఫోటోలు షేర్ చేయవద్దని హెచ్చరించారు. వేధింపులకు గురయ్యే మహిళలకు భద్రతకు టోల్ ఫ్రీ నెంబర్ 181 ద్వారా ఉచిత న్యాయ, వైద్య మరియు కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని ఎస్సై రాములమ్మ తెలిపారు. పని ప్రదేశాల్లో లేదా బయట వేధింపులు ఎదురైతే భయపడకుండా ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు."మీ భద్రతే మా బాధ్యత. వేధింపులను మౌనంగా భరించవద్దు, ధైర్యంగా పోలీసులను ఆశ్రయించండి." జిల్లా పోలీస్ యంత్రాంగంఅనంతరం మహిళా ఉద్యోగులు అడిగిన పలు సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు

## పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




**అచ్చుతాపురం 17 మేజర్ న్యూస్:**అచ్చుతాపురం మండలంలో వివిధ గ్రామాల్లో పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ నిర్వహించి ఎంపీడీవో ఆఫీస్ వద్ద ధర్నా చేసి ఎంపీడీవోకి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మిక సంఘం ఆడారి నాగేశ్వరరావు, సిఐటియు కన్వీనర్ కే సోమనాయుడు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులుగా ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తూ గ్రామాల్లో కాలువలు రోడ్లు శుభ్రం చేస్తున్న వీరికి మాత్రం కనీస వేతనాలు అమలు చేయడం లేదు ప్రభుత్వం ప్రతి పంచాయతీలో పంచాయతీ కార్మికులకు నెలకు 10000 రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం చెబుతున్న ఆచరణలో అమలు కావడం లేదు ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వేతనాలు పెంచడం లేదు దీంతో పంచాయతీ కార్మికులు అర్ధాకులతో జీవిస్తున్నారు ప్రభుత్వం వెంటనే పంచాయతీ కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి నెలకు 16,000 జీతం పెంచాలని ఈఎస్ఐ పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించి వారంలో ఒకరోజు సెలవు ఇవ్వాలని బకాయి వేతనాలు ఇవ్వాలని పనిముట్లు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్ రాము, పంచాయతీ వియ్యపు లక్ష్మి ముప్పిడి కళ్యాణి దోసూరు నాగమణి బద్ది అప్పారావు తెల్లారి లక్ష్మి చేపల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన కళ్యాణపులోవ ఉత్సవాలు



**రావికమతం ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్** :మండలంలో చీమలపాడు పంచాయితీ కళ్యాణపులోవ పోతురాజు బాబు ఆలయ ఉత్సవాలు మంగళవారం తో ముగిశాయి ఈనెల 15 నుంచి ప్రారంభమైన ఉత్సవాలకు ఊహించిన దానికన్నా ఎక్కువ సంఖ్యలో భక్తులు తరలివచ్చిన విషయం తెలిసిందే మంగళవారం అతి తక్కువ మంది స్వామివారిని దర్శించుకున్నారు. ముగింపు సందర్భంగా దేవదయ ధర్మదాయ శాఖ ఈవో సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో వాలంటీర్లు భక్తులు హుండీలో సమర్పించిన కానుకులను లెక్కించగా . 11, లక్షల 48 వేల 362 రూపాయలు ఉందని ఈవో తెలిపారు. ప్రత్యేక దర్శనం టికెట్లకు 3,55,300 రూపాయలు దర్శనం టికెట్ల 1,23,290 రూపాయలు కేశఖండన టికెట్లకు 44, 275 రూపాయలు కొబ్బరికాయలు తలనీలాలు విక్రయించగా ఒక లక్ష పదివేల రూపాయలుతో కలిపి మొత్తం ఆదాయం 17,81,227 రూపాయలు సమకూరిందని వివరించారు గత ఏడాది మొత్తం ఆదాయం 13,42,750 రూపాయలు కాగా ఏడాది అధికంగా 4 లక్షల 38477 రూపాయలు ఆదాయం దేవాలయానికి వచ్చిందన్నారు. . ఈ మొత్తాన్ని బందోబస్తు తో ట్రెజరీకి పంపమన్నారు .

## అసెంబ్లీలో విద్యార్థుల సందడి ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన



**నర్సీపట్నం ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్:** భావి భారత పౌరులైన విద్యార్థులకు చట్టసభల పనితీరుపై అవగాహన కల్పించేలా ఆంధ్రప్రదేశ్ శాసనసభ వేదికైంది. మంగళవారం సుమారు 300 మంది విద్యార్థులు అసెంబ్లీని సందర్శించి, సభా వ్యవహారాలను ప్రత్యక్షంగా వీక్షించారు. గత ఐదు రోజులుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు దాదాపు 1100 మంది విద్యార్థులు ప్రజాస్వామ్య దేవాలయాన్ని సందర్శించడం విశేషం. ప్రజా సమస్యలపై చర్చలు ఎలా జరుగుతాయి, చట్టాల రూపకల్పన ప్రక్రియ ఏ విధంగా ఉంటుంది అనే అంశాలను విద్యార్థులు ఎంతో ఆసక్తిగా గమనించారు.సభా విరామ సమయంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుతో పాటు ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కామినేని శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, పత్తిపాటి పుల్లారావు, బోండా ఉమామహేశ్వరరావు తదితరులు విద్యార్థుల వద్దకు వెళ్లి ఆత్మీయంగా పలకరించారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఓపికగా సమాధానాలు ఇచ్చారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకుని దేశాభివృద్ధిలో కీలక భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా నేతలు ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రూపు ఫోటోలు దిగారు. చట్టసభల వాతావరణాన్ని స్వయంగా చూడటం తమకు ఎంతో జ్ఞానాన్ని ఇచ్చిందని, ఈ పర్యటన తమలో సరికొత్త స్ఫూర్తిని నింపిందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## మైనర్ బాలికలను తల్లిదండ్రులకు అప్పగించిన పట్టణ పోలీసులు



**నర్సీపట్నం ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్:**హాస్టల్ నుండి చెప్పకుండా వచ్చిన ఇద్దరు మైనర్ గిరిజన బాలికలను హాస్టల్ సిబ్బందికి అప్పగించినట్లు నర్సీపట్నం టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.కె గఫూర్ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. అల్లూరిజిల్లా లంబసింగిలోని ట్రైబల్ వెల్ఫేయిర్ హాస్టల్ విద్యార్థినులు ఇద్దరు కనిపించడం లేదని సమాచారం అందగానే పట్టణంలో గాలింపు చేపట్టామన్నారు. సోమవారం రాత్రి నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ లో బాలికలను గుర్తించి హాస్టల్ సిబ్బందికి సమాచారం ఇచ్చి వారిని హాస్టల్లో భద్రంగా ఉంచి వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని సీఐ తెలిపారు.

# నర్సీపట్నంలో జనవాణి కార్యక్రమం లో వచ్చిన సమస్య లు పరిష్కారానికి కృషి



**నర్సీపట్నం ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్న:**ర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని రామారావుపేటలోని జనసేన పార్టీ కార్యాలయం లో మంగళవారం జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలు మండలాల నుంచి ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 22 వినతులు అందినట్లు వీరసూర్యచంద్ర తెలిపారు. భూ వివాదాలు, పింఛన్లు, విద్యుత్ సరఫరా తదితర సమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా లీజు ముగిసినప్పటికి మా స్థలంలో కొనసాగుతున్న బిఎస్ఎన్ఎల్ టవర్ తొలగించాలంటూ నాతవరం మండలం డి. యర్రవరంకు చెందిన అల్లు రాజేశ్వరి అనే మహిళ వినతిపత్రం అందజేశారు. దీనిపై అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే పింఛన్ల మంజూరు, రీ సర్వే సమస్యలు, ఆర్టీసిలో పని చేస్తు చనిపోయిన వ్యక్తికి కారుణ్య నియామకాలు చేపట్టాలని, అలాగే విద్యుత్ సరఫరా లోపాలు వంటి సమస్యలపై కూడా వినతులు అందినట్లు తెలిపారు. సంబంధిత అధికారుల తక్షణమే మాట్లాడటం జరిగిందని, ఈ సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తామన్నారు. జనవాణిలో పచ్చిన ప్రతి ఫిర్యాదుకు న్యాయం చేయడం తమ లక్ష్యమని, జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సూర్యచంద్ర పేర్కొన్నారు. . ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణ టాబ్లెట్స్ 6 నెలలకు ఒకసారి మింగాలి



**రావికమతం ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్:** విద్యార్థులలో ఆకలి లేకపోవడం, రక్తహీనత కు కారణం నులి పురుగులు పేగులలో పేరుకు పోవడమే అని వైద్యాధికారిణి లు నళిని పుష్ప, సురేఖ లు తెలిపారు జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం రావికమతం జిల్లా పరిషత్ హైస్కూల్ లో, వైద్యాధికారిణి నళిని పుష్ప, దొండపూడి హైస్కూల్లో వైద్యాధికారిణి సురేఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. భోజనం చేసిన తర్వాత స్వయంగా విద్యార్థులచే ఈ మాత్రలను మింగించారు. చప్పరించి మింగాలని సూచించారు. పిహెచ్సి లలో పరిధిలో అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులచే నులిపురుగుల నివారణ మాత్రలు మింగిస్తున్నామని తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వీటిని తీసుకోవాలని సూచించారు.

## పూడిమడక సచివాలయం వద్ద కొండబాబు ఆధ్వర్యంలో నిరాశన



**అచ్చుతాపురం ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్:**పూడిమడక సచివాలయం వద్ద గ్రామస్తులు ఆందోళన గ్రామపంచాయతీ పరిధిలో కమ్యూనిటీ స్థలం లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా బిల్డింగ్ కట్టడానికి ప్రయత్నం చేయడంతో రెండో వార్డ్ మెంబర్ పి కొండబాబు ఆధ్వర్యంలో సచివాలయం వద్ద దీక్షలకు పూనుకోవడం జరిగింది సంబంధించి అధికారులు ఎంపీడీవో పంచాయతీ సెక్రెటరీ సిఏ ఎస్ ఐ చర్చలు జరపడం జరిగింది బిల్డింగ్ కట్టే యజమాని తప్పుడు నిర్ణయం తీసుకోవడంతో మందలించి గ్రామ ప్రజలకి హామీ ఇవ్వడంతో విర్మించుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు లోవ రాజు బంగారాజు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## మాజీ ఎంపీ పప్పల చలపతిరావును కలిసిన టిడిపి నాయకులు



**అచ్చుతాపురం ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్:** మండలంలో చోడపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ వడిసెల శ్రీనివాసరావు వైఎస్ఆర్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో జాయిన్ అయిన సందర్భంగా ఎలమంచి నియోజక వర్గ మాజీ ఎంపీ పప్పలు చలపతిరావు నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు ఈ కార్యక్రమంలో కర్రి వెంకటరమణ కూనిచెట్టి రమణ కొమ్మఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# నేషనల్ జూనియర్ కాలేజ్ లో ఫేర్వెల్ పార్టీ



**మునగపాక ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్** :మండల కేంద్రమైన మునగపాక లో గల నేషనల్ జూనియర్ కాలేజ్ లో ఫేర్వెల్ పార్టీ మంగళవారం నిర్వహించారు,ఈ కార్యక్రమమునకు మునగపాక ఎస్ఐ పి ప్రసాద్ రావు అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయిలో ఉద్యోగాలకు ఎంపికై అటు తల్లిదండ్రులకు,కాలేజీకి, మీ గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అన్నారు, దూర ప్రాంతములైన అనకాపల్లి అచ్యుతాపురం విశాఖపట్నం గాజువాక దూర ప్రాంతాల్లో వెళ్లకుండా మండల హెడ్ క్వార్టర్ లోనే కాలేజీని స్థాపించి మెరుగైన ఫలితాలు సాధించడంలో అభినందనీయమని ఎస్సై పి ప్రసాదరావు తెలిపారు ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బొడ్డేడ మహేష్, బొడ్డేడ శంకరరావు , శరగడం ప్రసాద్ మరియు ప్రిన్సిపల్ కాండ్రేగుల ఈశ్వరరావు విద్యార్థుల ఉద్దేశించి ప్రసంగించారు ఇంటర్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఫీజులో పూర్తి రాయితీ మరియు మెమొంటోలు అందించారు విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో అలరించారు ఈ కార్యక్రమంలో మిగిలిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# కొండుపాలెంలో రి సర్వే గ్రామసభ నేడు



**అనకాపల్లి, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్:** మండలంలోని కొండుపాలెంలో రీ సర్వే ఫైనల్ ఆర్ఓఆర్ పై బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు గ్రామసభ జరగనున్నదని గ్రామ సర్పంచ్ దుల్ల వరలక్ష్మి జగన్ అన్నారు. రీ సర్వేలో జరిగిన అవకతవకలపై గ్రామ రైతుల విచారణ జరపమని, సవరించమని అనేకసార్లు పిజిఆర్ఎస్ ద్వారా పెట్టిన అర్జీలను పట్టించుకోకుండా ఫైనల్ ఆర్ ఓ ఆర్ ను విడుదల చేయడం అన్యాయమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్వేలో జరిగిన అవకతవకులను సరి చేసిన తర్వాత మాత్రమే ఫైనల్ ఆర్వో ఆర్ ను ప్రచురించాలని గ్రామ సర్పంచ్ దుల్ల వరలక్ష్మి జగన్ డిమాండ్ చేస్తున్నారు. కొందరు రైతులకు రిసర్వే నోటీసులు కూడా జారీ చేయలేదని, ఇంటిపేర్లు, ఆధార్ నెంబర్లు తదితర అనేక వివరాలు, విస్తీర్ణాలు తప్పుగా నమోదు చేశారని ధ్వజమెత్తారు. జాయింట్ కలెక్టర్ రీ సర్వే అవకతవకలపై విచారణ జరిపించాలని, కొండుపాలెం రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. లేకుంటే పట్టాదారు పాస్ పుస్తకాలో అనేక తప్పులు దొర్లి రైతులు ఇబ్బందులకు గురవుతారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రి సర్వే అవకతవకలపై జారీచేసిన మార్గదర్శకాలను అధికారులు అమలు చేయాలని ఆయన కోరారు.

## పదవ తరగతి, ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



**అనకాపల్లి, ప్రతినిధి ,ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్:** జిల్లాలో పదవ తరగతి, ఓపెన్ స్కూల్ పదవ తరగతి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 16 వ తేది నుండి మార్చి 29 వ తేది వరకు జిల్లాలో 102 పరీక్ష కేంద్రాలలో ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షలకు జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులు 20,577 మంది, ప్రయివేట్ విద్యార్థులు 440 మంది మొత్తం 21,017 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. జిల్లాలో ఓపెన్ స్కూల్ పదవ తరగతి పరీక్షలను మార్చి నెల 16వ తేదీ నుంచి ఏప్రియల్ నెల 1 వ తేదీ వరకు ఉదయం 09:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 71 ఓపెన్ స్కూల్ పదవ తరగతి కి చెందిన 531 మంది విద్యార్థులు జిల్లాలో 102 పరీక్ష కేంద్రాలలో పరీక్షలను రాయనున్నారని మరియు జిల్లాలో 38 ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ కి చెందిన 1398 మంది విద్యార్థులుకు గాను జిల్లాలో 6 పరీక్ష కేంద్రాలలో మార్చి 2వ తేదీ నుంచి మార్చి 13వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సమన్వయంతో అధికారులందరూ పనిచేసి విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షా కేంద్రలలో అన్నిసౌకర్యాలను కల్పించాలన్నారు, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో పక్కాగా ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి జి అప్పారావు నాయుడును కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగా చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ప్రజా రవాణాశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు ఏర్పాటు చేయాలని, మెడికల్ క్యాంపు ఏర్పాటుచేసి అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేయాలని, పరీక్షా కేంద్రాలకు దగ్గరలోని జెరాక్స్ సెంటర్లను పరీక్షల సమయంలో మూసివేయాలని తెలిపారు. పరీక్షా పత్రాలకు, తనిఖీ బృందాలకు ఎస్కార్ట్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు తెలిపారు. పరీక్షల నిర్వహణ తనిఖీ చేయుటకు సిట్టింగు, ఫ్లయింగు స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణ అనంతరం జవాబు పత్రాల బండిల్స్ సకాలంలో పంపించుటకు పరీక్షల నిర్వహణ అధికారులకు తపాలా శాఖ సిబ్బంది సహకరించాలని కలెక్టర్ తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఆయా శాఖలకు కేటాయించిన పనులను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పరీక్షలను సమర్ధవంతంగా నిర్వహించాలని కోరారు. ప్రైవేటు పాఠశాలలతో ఎక్కడా మాస్ కాపీయింగు జరుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు, పర్యవేక్షణ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక కేంద్రాలలో అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టరు తెలిపారు. ఈ సమావేశంలో ఇంచార్జి డి.అర్వో శ్రీనివాస్, డి ఈ ఓ., జి. అప్పారావు నాయుడు, డి ఐ ఈ ఓ,. వినోద్ బాబు, జిల్లా రవాణా, ప్రజా రవాణా శాఖ అధికారులు జి. మనోహర్, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు, ఎలక్ట్రికల్, తపాలా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## వేతనాలు బాధ్యత మాది- పట్టణం శుభ్రత బాధ్యత మీది



**రావికమతం ఫిబ్రవరి 17 మేజర్ న్యూస్ :** ప్రతినెల విధిగా వేతనాలు మంజూరు చేసే బాధ్యత తీసుకుంటానని చోడవరం పట్టణాన్ని శుభ్రంగా బాధ్యత తీసుకోవాలని సర్పంచ్ కాసులమ్మ పారిశుధ్య కార్మికులను కోరారు. మంగళవారం 72 మంది పారిశుధ్య కార్మికులకు రెండు నెలలకు వేతనాలు ఒక్కొక్కరికి 24 వేల రూపాయలు చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్ణీత సమయానికి వేతనాలు విధిగా వేతనాలు కార్మికులు ఇస్తామన్నారు. పట్టణంలో 20 వార్డులు శుభ్రంగా తీర్చిదిద్దాలని సర్పంచ్ కోరారు. త్రాగునీటి వనరుల క్లోరేషన్ చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని తెలిపారు. తడి పొడి చెత్తలను సంపద కేంద్రానికి తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ సీతారామస్వామి జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన కె.కోటపాడు నూతన సీఐ కృష్ణ



**అనకాపల్లి, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్:** అనకాపల్లి జిల్లా కె.కోటపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కె.కృష్ణ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీకి మొక్కను అందజేసారు. ?నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ కృష్ణని జిల్లా ఎస్పీ అభినందిస్తూ, విధి నిర్వహణలో అనుసరించాల్సిన పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు.?ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలను కాపాడటంలో రాజీ పోకూడదన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి రవాణా, వేధింపులకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు. రాత్రి సమయాల్లో గస్తీని ముమ్మరం చేసి, నేరాల నియంత్రణ కు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు.తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని, శాంతి భద్రతల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా సీఐ కృష్ణ జిల్లా ఎస్పీకి వివరించారు.

## రెండు కోళ్లు, ఇద్దరు వ్యక్తులు, రూ.420 నగదు స్వాధీనం

**అనకాపల్లి, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్:** మండలంలోని మామిడిపాలెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడిపందాలపై అనకాపల్లి రూరల్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారని ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఈ దాడుల్లో రెండు కోళ్లు, ఇద్దరు వ్యక్తులు, రూ. 420 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ఏపీ సివిల్ సర్వీసెస్ పెన్షన్ నిబంధనలు-2026లో



**అనకాపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 17, మేజర్ న్యూస్.** ప్రతిపాదిత ఏపీ సివిల్ సర్వీసెస్ (పెన్షన్) నిబంధనలు--2026లో పెన్షనర్లు మరియు సేవలో ఉన్న ఉద్యోగుల హక్కులను దెబ్బతీసే పలు నిబంధనలను తొలగించాలి లేదా సవరించాలంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక వినతి పత్రాన్ని సమర్పించినట్లు రాష్ట్ర పంచాయితీ రాజ్ పెన్షనర్ల సంఘం తరపున యూ.కూర్మారావు, జనరల్ సెక్రటరీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ--- పెన్షన్ అనేది దయాదాక్షిణ్యం కాదని, ఉద్యోగి జీవితకాలంలో చేసిన సేవలకు వాయిదా వేసిన వేతనమని, రాజ్యాంగ పరిరక్షణ కలిగిన హక్కు అని స్పష్టం చేశారు. అలాంటి పెన్షన్ హక్కులను పరిమితం చేసే విధంగా ప్రతిపాదిత నిబంధనలు ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. 33 సంవత్సరాల సేవకు పరిమితి అన్యాయంపూర్తి పెన్షన్ కోసం అర్హత సేవను 33 సంవత్సరాలకు పరిమితం చేయడం సరికాదని, 35--38 సంవత్సరాలు సేవలందించిన ఉద్యోగులకు ఇది తీరని అన్యాయం అవుతుందని పేర్కొన్నారు. వాస్తవంగా చేసిన సేవకు అనుగుణంగా పెన్షన్ లెక్కింపు కొనసాగించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ నిలిపివేతకు స్పష్టమైన రక్షణలు కావాలి"తీవ్ర దురాచరణ" వంటి అస్పష్ట పదాలతో పెన్షన్ నిలిపివేతకు అవకాశం కల్పించడం దుర్వినియోగానికి దారితీస్తుందని తెలిపారు. న్యాయస్థానం తుది తీర్పు, సహజ న్యాయ సూత్రాల అమలు లేకుండా పెన్షన్‌ను నిలిపివేయరాదని స్పష్టమైన రక్షణ నిబంధనలు చేర్చాలని కోరారు. ఫ్యామిలీ పెన్షన్ హక్కుల పరిరక్షణవిధవలు, ఆధారిత కుటుంబ సభ్యులకు ఫ్యామిలీ పెన్షన్ ఒక్కటే జీవనాధారం అని, ప్రస్తుతం అమలులో ఉన్న 50% ఎన్‌హాన్స్‌డ్ ఫ్యామిలీ పెన్షన్, 30% నార్మల్ ఫ్యామిలీ పెన్షన్ విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. వికలాంగ పిల్లలు, ఆధారిత అవివాహిత కుమార్తెల హక్కులను స్పష్టంగా రక్షించాలన్నారు. ఈఓఎల్ లెక్కింపు కొనసాగాలిప్రస్తుత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అనుమతించిన ఈఓఎల్‌ను పెన్షన్ అర్హత సేవలో లెక్కించడం రద్దు చేయరాదని, అలా చేస్తే వేలాది ఉద్యోగులు తీవ్రంగా నష్ట పోతారని హెచ్చరించారు.

"పబ్లిక్ ఇంటరెస్ట్" పేరుతో అస్పష్ట నిబంధనలు తొలగించాలిప్రజాహితమనే పేరుతో బలవంతపు పదవీ విరమణ లేదా పెన్షన్ మార్పులకు అవకాశం ఇచ్చే అస్పష్ట నిబంధనలను పూర్తిగా తొలగించాలి లేదా ఖచ్చితంగా నిర్వచించాలన్నారు. 50% పెన్షన్‌ను చట్టబద్ధ హక్కుగా హామీ ఇవ్వాలిచివరి ప్రాథమిక వేతనంలో 50% పెన్షన్‌ను కార్యనిర్వాహక ఆదేశాలపై ఆధారపడకుండా, చట్టబద్ధ హక్కుగా నిబంధనల్లో స్పష్టంగా పేర్కొనాలని విజ్ఞప్తి చేశారు. పెన్షన్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సెల్ ఏర్పాటు చేయాలిడిజిటల్ విధానంలో పెన్షన్ ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో, ఆర్థిక శాఖలో ప్రత్యేకంగా పెన్షన్ ఫిర్యాదుల పరిష్కార విభాగాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపాదిత నిబంధనలకు సంబంధించి పెన్షనర్ల సంఘాలతో సంప్రదింపులు జరిపిన తరువాతే తుది నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దశాబ్దాల పాటు నిజాయితీగా ప్రజాసేవ చేసిన పెన్షనర్లకు గౌరవం, ఆర్థిక భద్రత కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ నైతిక, రాజ్యాంగ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు